

Dwaraka ఈనాడు




కరీంనగర్ 15-1-2018 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 156
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



పాలం విమానాశ్రయంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు స్వాగతం పలుకుతున్న ప్రధాని మోదీ. ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి స్వయంగా విమానాశ్రయానికి వెళ్లిన మోదీ నెతన్యాహును ఆయన భార్య శారాకు స్వాగతం పలికి అందర్నీ ఆశ్చర్యపరిచారు. 13 లో



టర్కీలో శనివారం పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. 162 మంది ప్రయాణికులతో అంకారా నుంచి ట్రాబ్జాన్ చేరుకున్న ఓ విమానం రన్‌వే నుంచి ప్రమాదవశాత్తు పక్కకు జారి నల్ల సముద్రానికి కొన్ని మీటర్ల దూరంలో నిలిచిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ హాని జరగలేదు.



సెలవు: సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం 'ఈనాడు' కార్యాలయానికి సెలవు. మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

- మేనేజింగ్ డైరెక్టర్

చెక్కుల సంబురం

పెట్టుబడి పంపిణీ కార్యక్రమం పక్షం రోజులు!

- ప్రజాప్రతినిధులకూ భాగస్వామ్యం
- వ్యవసాయ బడ్జెట్‌లో నిధులు
- ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో కొత్తగా ప్రారంభిస్తున్న పంట పెట్టుబడి మద్దతు పథకం కింద మే మొదటి తేదీ నుంచి పక్షం రోజుల పాటు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా రైతులకు రూ. నాలుగేసి వేల సాయాన్ని అందజేస్తున్నందున పండుగ వాతావరణంలో దీనిని జరిపించాలని యోచిస్తున్నారు. దీనిలో అధికారులు, రైతు సమన్వయ సమితులతో పాటు రాష్ట్రంలోని అన్ని స్థాయిల్లోని ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. పంట పెట్టుబడి పథకం కింద వెచ్చించే నిధులను వ్యవసాయ బడ్జెట్‌లో చేర్చనున్నారు. పెట్టుబడి పథకంలో ప్రతి రైతుకు ఎకరానికి రూ.ఎనిమిదేసి వేల సాయం అందించనున్నారు. మొదటి విడత కింద ఖరీఫ్



పంట పెట్టుబడిగా రూ. 4 వేలను ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన గల మంత్రివర్గ ఉపసంఘం శనివారం రాత్రి సీఎం కేసీఆర్‌ను కలిసి నివేదిక అందజేసింది. నివేదికను ముఖ్యమంత్రి పరిశీలించారు.

సిఫార్సులకు అనుగుణంగా రైతులకు చెక్కుల రూపేణనే ఆర్థిక సాయం అందించనున్నారు. దీనికి అనుగుణంగా భారతీయ రిజర్వ్‌బ్యాంకు అధికారులతో చర్చించాలని సీఎం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను ఆదేశించారు. నిధుల లభ్యత అనంతరం బ్యాంకుల వారిగా రైతుల పేరిట చెక్కులను తయారు చేసి, పంపిణీపై దృష్టి సారిస్తారు. ఇప్పటికే మే15 లోగా సాయం అందజేస్తామని సీఎం ప్రకటించారు. దీనికి అనుగుణంగా మార్గదర్శకాలు జారీ చేస్తారు. కార్యాచరణను ప్రకటిస్తారు. మే మొదటి రోజున ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని తొలిరోజు ప్రారంభిస్తారు. కొన్ని జిల్లాల్లోనూ ఆయన పర్యటించి రైతులకు చెక్కులు అందజేస్తారు. మంత్రులు ఆయా జిల్లాల్లో కార్యక్రమాలకు హాజరవుతారు. ఇతర చోట్ల కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యేలు అధ్యక్షులుగా ఉంటారు. దీంతో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, జడ్పీ ఛైర్‌పర్సన్లు, మండల పరిషత్ (మిగతా 2లో)

వ్యవసాయ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు

- పంట పెట్టుబడి మద్దతు పథకానికి రూ.12 వేల కోట్ల మేరకు నిధులు అవసరమని ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది.
- ఈ నిధులను వ్యవసాయ బడ్జెట్‌లో చేరుస్తారు.
- ఇప్పటికే వ్యవసాయ బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసింది.



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రను కలసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర



సీజేఐ జస్టిస్ దీపక్‌మిశ్ర

త్వరలోనే వివాద పరిష్కారం

బార్ కౌన్సిళ్లకు భారత ప్రధాన న్యాయమూర్తి హామీ

జస్టిస్ చలమేశ్వర్‌తో ఇద్దరు జడ్జీల భేటీ.. నేడు చర్చించనున్న 'ఫుల్ కోర్టు'

ఈనాడు, దిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్రకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులోని నలుగురు సీనియర్ జడ్జీలు మీడియా సమావేశం నిర్వహించిన నేపథ్యంలో తలెత్తిన వివాద పరిష్కారానికి చర్చోపచర్చలు జరుగుతున్నాయి. జస్టిస్ దీపక్ మిశ్రతో ఆదివారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ), సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) ప్రతినిధి బృందాలు వేరువేరుగా సమావేశమయ్యాయి. వివాదం (మిగతా 2లో)



- సమీపంలోని పంచాయతీలు నగరాల్లో విలీనం
- ప్రక్రియను వేగవంతం చేసిన ప్రభుత్వం
- పంచాయతీ చట్టంలో మార్పులు..
- ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందిస్తున్న పురపాలకశాఖ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో నగరాల విస్తరణ, పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో నగరాలు, పట్టణాలకు సమీపంలోని గ్రామపంచాయతీలను పట్టణ స్థానిక సంస్థల్లో విలీనం చేసే కసరత్తును ప్రభుత్వం వేగవంతం చేసింది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలోనివి, సమీప గ్రామాలు, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, రామగుండం నగరపాలక సంస్థల సమీపంలోని గ్రామాలు, జిల్లా కేంద్రాల చుట్టూ ఉండే గ్రామ పంచాయతీలను పురపాలక పరిధిలోకి తీసుకురానున్నారు. నగరాలు, పట్టణాలకు అనుబంధంగానే ఉన్నా గ్రామపంచాయతీలుగా కొనసాగుతుండటంతో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆక్రమణలు, ప్రణాళికబద్ధంగా లేని అభివృద్ధి, ఇళ్ల నిర్మాణంలో ఇష్టారాజ్యం, రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణంలో నిబంధనలు పాటించకపోవడం సహా అనేక విధాలుగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు (మిగతా 2లో)

మార్చి 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు!


- నెలాఖరు వరకు నిర్వహణ
- ప్రభుత్వ యోచన

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను వచ్చే మార్చి 12 నుంచి నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అప్పటి నుంచి నెలాఖరు వరకు ఈ సమావేశాలు సాగే అవకాశం ఉంది. గత ఏడాది మార్చి 11 నుంచి బడ్జెట్ సమావేశాలు జరిగాయి. ఈ ఏడాది అదే తేదీ నుంచి సమావేశాలు జరపాలని సీఎం కేసీఆర్ మొదట భావించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం భూరికార్డుల నవీకరణలో భాగంగా కొత్తగా రూపొందించిన పట్టాదార్ పాసు పుస్తకాల పంపిణీకి ఇదే ముహూర్తం బాగుందనే ఉద్దేశంతో దానిని ఖరారు చేశారు. ఆ ఒక్కరోజే రాష్ట్రమంతటా పాసు పుస్తకాల పంపిణీని చేపడతారు. మరుసటి రోజు నుంచే బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఈ సమావేశాల్లో (మిగతా 2లో)

23 శాతం రిజిస్ట్రేషన్లు ఆన్‌లైన్‌లోనే

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లకు ఆదరణ పెరుగుతోంది. మొత్తం రిజిస్ట్రేషన్లలో 23 శాతం దాకా ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 8.5 లక్షల రిజిస్ట్రేషన్లు జరగ్గా ఇందులో 1.95 లక్షలు ఆన్‌లైన్‌లో జరిగినవే. ఈ విధానం సులభంగా ఉండటంతోపాటు గంటల తరబడి కార్యాలయాల్లో వేచి చూడాల్సిన అవసరం లేకపోవడంతో ఆదరణ పెరుగుతోంది. ఆన్‌లైన్‌లోనే డాక్యుమెంట్‌ను పూర్తిగా తనిఖీ చేసుకుని తప్పులులేకుండా చూసుకోగలగడంతో వీటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతోపాటు దళారులను ఆశ్రయించే అవసరం ఉండదు. రాష్ట్రంలోనే అత్యధిక ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు రంగారెడ్డి జిల్లాలో జరగ్గా సంగారెడ్డి, మేడ్చల్, నిజామాబాద్ జిల్లాలు తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్‌కు సమయం నమోదుచేసుకొని ఆ సమయానికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తే సరిపోతుంది. ఈ విధానానికి ప్రచారం కల్పించడంతోపాటు నిర్దేశించిన సమయంలోనే రిజిస్ట్రేషన్లు పూర్తయ్యేలా ఆ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.



జయేంద్ర సరస్వతికి తీవ్ర అస్వస్థత

పోరూరు రామచంద్ర ఆసుపత్రికి తరలింపు 11 లో



ఇదీ సంగతి!



మీతోడు.. మావాడే

- పోలీసు శాఖలో సిఫార్సుల కలకలం
- వరస పదోన్నతులతో పోస్టింగ్‌లకు పోటీ
- అప్రాధాన్య పోస్టుల నుంచి దూరం
- ప్రజాప్రతినిధులకు కాసుల పంట
- ఎక్కడ కోరితే అక్కడే కొలువు

ఈనాడు, హైదరాబాద్: పోలీసుశాఖలో పదోన్నతులు ప్రజాప్రతినిధుల పంట పండిస్తున్నాయి. మంచి పోస్టింగు కోసం పోటీ పెరగడంతో దానికి తగ్గట్టుగా రేటు కూడా



పెరుగుతోంది. ఒక్కో సీఐ పోస్టుకు రూ. నాలుగు లక్షలు పైనే పలుకుతోంది. పదోన్నతులు పొందినవారు కనీసం రెండేళ్లపాటు అప్రాధాన్య పోస్టుల్లో పనిచేయాలనేది నిబంధన. దీనిని ఉల్లంఘిస్తూ ప్రజాప్రతినిధుల ద్వారా ఒత్తిడి తెప్పించి కావాల్సిన చోట పోస్టింగు దక్కించుకుంటున్నారు. కొత్తగా పదోన్నతులు పొందినవారు ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బ్యాచ్‌ల వారీగా డబ్బు జమ చేసి పోస్టింగుల కోసం వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది.

తెలంగాణ పోలీసుశాఖలో అన్నిస్థాయిల్లోనూ పదోన్నతులు ఇస్తున్న సంగతి తెలిసిందే. వారందరికీ పోస్టింగులు ఇవ్వాల్సి ఉంటుంది. గత అక్టోబరులో రాష్ట్రావ్యాప్తంగా 139 మంది సీఐలకు డీఎస్పీలుగా, 103 మంది డీఎస్పీలకు ఏఎస్పీలుగా, 33 మంది ఏఎస్పీలకు నాన్‌క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతులు దక్కాయి. తర్వాత దాదాపు 435 మంది ఎస్సైలకు సీఐలుగా పదోన్నతులు ఇచ్చారు. ప్రస్తుతం కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్సై పోస్టులకు (మిగతా 2లో)

TG

‘బోరు’మంటున్న రైతు

చిన్న, సన్నకారు రైతులకు భూగర్భ జలాలే ఆధారం

- ఉపరితల నీటి వాటా తగ్గుదల
- భారీగా పెరుగుతున్న లోతైన బోర్లు
- చెరువులు, కుంటల కింది సాగు తగ్గుదల
- రైతుకు ఖర్చు.. భూమికి శోకం
- భూగర్భజలాలపై తీవ్రమైన ఒత్తిడి
- ఉపరితల నీటికి ప్రాధాన్యమివ్వాలి
- చిన్ననీటి పథకాల గణాంకాలతో వెల్లడి
- 2013 - 14 నాటి గణాంకాలు విడుదల చేసిన కేంద్ర జలవనరులశాఖ

ఈనాడు - హైదరాబాద్

ప్రభుత్వాలు సాగునీటి సరఫరాకు ఎన్ని ప్రణాళికలు రచిస్తున్నా.. భారీ పథకాలను నిర్మిస్తున్నా. . చిన్న, సన్నకారు రైతులకు చిన్ననీటి పథకాలే పెద్ద దిక్కుగా ఉంటున్నాయి. సేద్యంలో ఉపరిత జలవనరుల వాటా తగ్గుతూ బోర్లు పెరుగుతుండటంతో భూగర్భజలాలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఇది ఎన్నో సమస్యలకు దారి తీసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉపరితల నీటివనరుల ద్వారా వ్యవసాయానికి నీటి సరఫరా పెరగాల్సిన అవసరం ఉందని కేంద్ర జలవనరుల శాఖ స్పష్టం చేస్తోంది. ఐదెకరాలు.. అంతకంటే తక్కువ భూమి కలిగిన అన్నదాతలకు చెరువులు, కుంటలు, బావులు, బోర్లతోనే అత్యధికంగా సాగునీరు అందుతుంటుంది. ఇందులోనూ 95 శాతం భూగర్భజలాల ద్వారానే. ఇది మరింత పెరుగుతూనే ఉంది. చెరువులు, కుంటలు, ఇతర ఉపరితల జలవనరుల ద్వారా సాగు తగ్గుతుండగా లోతైన గొట్టపుబావులు (బోర్ల) తవ్వడం మరింతగా పెరుగుతోంది. ఉపరితల చిన్ననీటి వనరుల వాటా 6 శాతం నుంచి 5 శాతానికి తగ్గింది. తక్కువ లోతులో ఉన్న బావులు, బోర్లు ఇప్పటికీ క్రియాశీలంగా ఉన్నా లోతైన బోర్లు వేగంగా దెబ్బతింటున్నాయి. చిన్న నీటి పథకాల ఐదో గణాంకాలను కేంద్ర జలవనరుల శాఖ విడుదల చేసింది. 2013-14 సంవత్సరం ప్రాతిపదికగా వీటిని రూపొందించారు.



పెరుగుతున్న గొట్టపు బావులు

దేశవ్యాప్తంగా సాగునీటిలో గొట్టపుబావుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అది కూడా లోతైన బోర్లు వేయడం బాగా పెరిగింది. గత గణాంకాల నాటికి, తాజా గణాంకాలనాటికి ఈ బోర్లలో 80 శాతం పెరుగుదల ఉంది. లోతైన బోర్లు 2.6 మిలియన్లు ఉన్నాయి. 1987లో లక్ష మాత్రం ఉండగా 2000-01కి నాటికి ఐదు లక్షలకు పెరగ్గా 2006-07 నాటికి 14.5 లక్షలకు, 2013-14 నాటికి 26 లక్షలకు పెరిగాయి. అయితే వీటిలో 20 శాతం పనిచేయడంలేదు.

బావులు తగ్గుతున్నాయి

దేశవ్యాప్తంగా బావులు 4.5 శాతం తగ్గాయి. గతంలో 92 లక్షలు ఉండగా తాజాగా ఇవి 87.8 లక్షలు ఉన్నాయి. చిన్ననీటి వనరుల్లో బావుల వాటా తగ్గుతుండగా ఈ స్థానాన్ని బోర్లు ఆక్రమిస్తున్నాయి. బావులు వాటా 44 శాతం నుంచి 40 శాతానికి తగ్గగా బోర్లవాటా 50 శాతం నుంచి 54 శాతానికి పెరిగింది. బావుల ద్వారా 16.8 మిలియన్ హెక్టార్లు సాగవుతున్నాయి.


సర్వేలో ఇతర అంశాలు

- భూగర్భజలాల వినియోగం ఎక్కువగా ఉన్న దక్షిణ భారతదేశం సహా మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ అందుబాటులో ఉండటంతో బోర్ల సంఖ్య పెరుగుతోంది.
- చిన్ననీటి వనరులు నీటి వినియోగానికి సౌర విద్యుత్ వినియోగంపై దృష్టి సారించాలి.
- చిన్ననీటి పథకాల్లో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉండగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడుల తర్వాత స్థానాల్లో తెలంగాణ, రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, బిహార్‌లు ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లోనే 90 శాతం చిన్ననీటి పథకాలు ఉన్నాయి.
- చిన్ననీటి వనరులు ద్వారా సాగు గత లెక్కల నాటికి 84.03 మిలియన్ హెక్టార్లు ఉండగా ఇది 89.52 మిలియన్ల హెక్టార్లకు పెరిగింది.
- దేశంలో 21.7 మిలియన్ల ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఇతర సమస్యలు, నీటి లభ్యత తక్కువగా ఉండటంతో 60.9 శాతం మాత్రం పనిచేస్తున్నాయి.
- 25 మీటర్లలోపు ఉన్న బోర్లు 5.9 మిలియన్లు ఉండగా వీటి ద్వారా 22.2 మిలియన్ల హెక్టార్లు సాగవుతోంది.
- 35 మీటర్ల నుంచి 70 మీటర్లలోపు లోతు ఉన్న బోర్లు 3.17 మిలియన్లు ఉండగా 11.6 మిలియన్ల హెక్టార్లు సాగవుతోంది. వీటిలో 18 శాతం వాటికి నీటి సమస్య ఉంది.

5 జిల్లాలు తెలంగాణలోనే..

- అత్యధిక చిన్ననీటి పథకాలు ఉన్న జిల్లాల్లో తెలంగాణలోని కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో ఉంది. ఈ జిల్లాలో 2,56,356 చిన్ననీటి పథకాలు ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో సోలాపూర్, నల్గొండ, నాసిక్, వరంగల్, అహ్మద్‌నగర్, మహబూబ్‌నగర్, పుణె, తిరువణ్ణామలై, మెదక్‌లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా 12వ స్థానంలో ఉంది. 13వ స్థానంలో నిజామాబాద్ జిల్లా ఉంది. మొదటి పది జిల్లాల్లో ఐదు జిల్లాలు తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నాయి.


కుంటలు, చెరువులు



చిన్ననీటి పథకాల్లో చెరువులు, కుంటలు సహా ఇతర ఉపరితల పథకాలు సంఖ్య వేగంగా తగ్గిపోతోంది. వీటి ద్వారా సాగు కూడా తగ్గుతోంది. 2006-07 గణన ప్రకారం ఇలాంటి పథకాలు 6.01 లక్షల ఉండగా 2013-14 నాటికి 5.92 లక్షలకు తగ్గాయి. ఇవి 48.9 లక్షల హెక్టార్లకు సాగునీరు అందిస్తున్నాయి. వీటిలో చెరువులు, కుంటలు 41 శాతం, రిజర్వాయర్లు 14 శాతం, తాత్కాలిక మళ్లింపు పథకాలు 10 శాతంగా ఉన్నాయి. ఉన్న వాటిలోనూ 74 శాతం మాత్రం పూర్తి స్థాయిలో వినియోగంలో ఉండగా 22 శాతం సమస్యలతో ఉన్నాయి. నిండకపోవడం, తక్కువ నీటి లభ్యత వల్ల వినియోగంలోలేవు

సొంత సొమ్ముతోనే బోర్లు


ఎక్కువశాతం మంది సొంత సొమ్ముతోనే బోర్లు వేసుకుంటున్నారు. చిన్ననీటి పథకాల్లో బోర్లు, బావుల్లో



శాతం సొంత డబ్బులతో ఏర్పాటు చేసుకుంటున్నవి	80.3 %
బ్యాంకు రుణాలతో ఏర్పాటు చేసుకున్నవి	6.5 %
ఇతర వనరుల ద్వారా	6.3 %
ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసుకున్నవి	5.1 %
వడ్డీలకు తెచ్చి వేసుకున్న బోర్లు	1.9 %

నీటివినియోగ సామర్థ్యం పెరిగింది

నీటి సరఫరాలో సామర్థ్యం పెరిగింది. నీటి వృథా తగ్గుతోంది. కాలువల ద్వారా నీటి సరఫరా కొంతమేర తగ్గినా ఇంకా ఎక్కువగా ఉంది. గతంలో కంటే పైపులు ద్వారా నీటి సరఫరా పెరిగింది. ఓపెన్ చానెళ్ల ద్వారా తగ్గింది. తుపర, బిందు సేద్యం, ఉపరితల పైపుల ద్వారా నీటి సరఫరా, భూగర్భ గొట్టాల ద్వారా, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా, స్ప్రింక్లర సేద్యం ద్వారా పెరిగింది..



- వినియోగంలో ఉన్న చిన్న నీటిపథకాల్లో మొదటి స్థానంలో మహారాష్ట్రలోని సోలాపూర్ ఉండగా రెండో స్థానంలో కరీంనగర్ ఉంది. తర్వాత స్థానాల్లో నల్గొండ, నాసిక్, వరంగల్, అహ్మద్‌నగర్, పుణె, తిరువణ్ణామలై, విళ్లుపురం, నిజామాబాద్, రాజ్‌కోట్, మెదక్, మహబూబ్‌నగర్‌లు ఉన్నాయి.
- చిన్ననీటి పథకాల ద్వారా ఐదు లక్షలకంటే ఎక్కువ హెక్టార్లు ఉన్న జిల్లాలు 21 ఉండగా నల్గొండ జిల్లా 50071 హెక్టార్లలో 21 స్థానంలో ఉంది.
- భూగర్భజలాలను వినియోగించుకునే చిన్ననీటి పథకాల్లో దేశంలోనే కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో ఉండగా తర్వాత స్థానంలో నల్గొండ జిల్లా, నాసిక్, వరంగల్‌లు ఉన్నాయి. 10, 11 స్థానాల్లోనిజామాబాద్, మెదక్‌జిల్లాలు ఉన్నాయి.

మా తండ్రి మృతిపై అనుమానాలేవీ లేవు

- జస్టిస్ లోయా కుమారుడి వెల్లడి



ముంబయి: సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీహెచ్ లోయా అకాల మరణానికి సంబంధించి.. తమ కుటుంబసభ్యులకు అనుమానాలేవీ లేవని ఆయన కుమారుడు అనూజ్ లోయా వెల్లడించారు. ఉగ్రవాదులతో సంబంధాలున్నట్లు ఆరోపణలున్న సొహ్రాబుద్దీన్ ‘నకిలీ ఎన్‌కౌంటర్’ కేసు విచారణకు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో.. 2014 డిసెంబర్ 1న లోయా గుండెపోటుతో మృతిచెందారు. అనంతరం ఈ ఎన్‌కౌంటర్ కేసులో నిందితుడిగా ఉన్న భాజపా అధ్యక్షుడు అమిత్ షాకు ఊరట లభించింది. లోయా మరణం అనుమానాస్పదంగా ఉందని ఆయన తండ్రి, సోదరి అప్పుడు ఆరోపించారు. అయితే ఇప్పుడు తమ కుటుంబ సభ్యులెవరికీ సందేహాలు లేవని అనూజ్ పేర్కొన్నారు. “అప్పుడు నేను భావోద్వేగాల సుడిగుండంలో ఉన్నా. నా తండ్రి మరణం గురించి నాకు సందేహాలు వచ్చాయి. అయితే ఇప్పుడవన్నీ తొలగిపోయాయి” అని అనూజ్ పేర్కొన్నారు. తన తాత, అత్తయ్య కూడా కొన్ని సందేహాలను పంచుకున్నారని.. అయితే వారి అనుమానాలు కూడా నివృత్తి అయ్యాయని అనూజ్ తెలిపారు. “కొందరు రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల నుంచి మాకు ఒత్తిళ్లు వస్తున్నాయి. మా తండ్రి మరణంపై పదే పదే ప్రశ్నిస్తూ మా కుటుంబ సభ్యులను వేధించడాన్ని.. దయచేసి మానుకోండి” అంటూ అనూజ్ కన్నీళ్లు పెట్టుకున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తిపై సుప్రీం కోర్టులోని నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ‘తిరుగుబాటు’ చేసిన నేపథ్యంలో అనూజ్ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకొంది. ప్రధాన న్యాయమూర్తితో విభేదాలకు లోయా మరణానికి సంబంధించిన అంశం కూడా కారణమని వారిలో ఒకరు వ్యాఖ్యానించారు.

ఇండోర్ వెళ్లబోయి నాగ్‌పుర్‌కు..

- ప్రయాణికుడు పొరపాటున వేరే విమానమెక్కినా గుర్తించని ఇండిగో సిబ్బంది

ముంబయి: విధి నిర్వహణలో ఇండిగో విమానయాన సంస్థ భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం తాజాగా బయటపడింది. ఓ ప్రయాణికుడు తాను వెళ్లాల్సిన విమానం కాకుండా వేరే విమానం ఎక్కి ప్రయాణిస్తున్నా వారు గుర్తించలేకపోయారు. ఈ ఘటన భద్రతాపరంగా తీవ్ర లోపమని అంగీకరిస్తూ ఇండిగో ఓ ప్రకటన విడుదల చేసింది. తమ సంస్థకు చెందిన ఓ విమానంలో శుక్రవారం దిల్లీ నుంచి ఇండోర్ వెళ్లాల్సిన ప్రయాణికుడు.. పొరపాటున ఇండిగోకే చెందిన వేరే విమానంలో నాగ్‌పుర్ వెళ్లినట్లు వెల్లడించింది. ఆయన వెళ్లాల్సిన విమానం కాకుండా వేరే విమానమెక్కినట్లు గుర్తించడంలో తమ భద్రతా సిబ్బంది విఫలమయ్యారని పేర్కొంది. ఘటనకు సంబంధించి ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు తెలిపింది.

చెక్కుల సంబురం

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు సైతం పాల్గొంటారు. సమావేశం అనంతరం రైతు సమన్వయ సమితులు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు ఈ చెక్కులను రైతులకు స్వయంగా అందజేస్తారు.

పెద్దఎత్తున ప్రచారం

పంట పెట్టుబడి మద్దతు పథకం కింద పంపిణీ చేసే చెక్కులు దుర్వినియోగం గాకుండా రైతులంతా వాటిని స్వయంగా వచ్చి పొందేలా చైతన్య పరిచేందుకు సాయం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసేలా పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రతి ఊరిలో డప్పు చాటింపు వేయించాలని, ప్రసార మాధ్యమాల్లో షెడ్యూలును ప్రకటించాలని చెప్పారు. లబ్ధిదారులు మినహా మిగిలిన వారెవరికీ చెక్కులను ఇవ్వరు. అందుబాటులో లేకపోతే కొంత గడువు ఇస్తారు. చెక్కుల కోసం లబ్ధిదారులే బ్యాంకులకు వెళ్లాలి. ఇతరులు వస్తే ఇవ్వరు.

మీతోడు.. మావాడే

(మొదటి పేజీ తరువాయి)

పదోన్నతులపై కసరత్తు జరుగుతోంది. వాస్తవానికి పోలీసుశాఖలో ఒక నిబంధన ఉంది. పదోన్నతి పొందిన తర్వాత కచ్చితంగా రెండేళ్లపాటు అప్రాధాన్య పోస్టులో పనిచేయాలి. ఆ తర్వాతే ప్రాధాన్యం ఉన్న (ఫోకల్) పోస్టింగ్ ఇస్తారు. కాని పలుకుబడి మాటున ఈ నిబంధన చెదిరిపోతోంది.

అనధికార నిబంధన

సాధారణంగా శాంతిభద్రతల విభాగంలో పనిచేసేందుకే చాలామంది ఉత్సాహం చూపుతారు. మామూలుగానే పోలీసుశాఖలో ఒక అనధికారిక నిబంధన కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో ఎస్సై, సీఐ, డీఎస్పీల పోస్టులు పొందాలంటే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నుంచి సిఫార్సు లేఖ తెచ్చుకోవాల్సి ఉంటుంది. దీన్ని అడ్డంపెట్టుకొని కొంతమంది ప్రజాప్రతినిధులు అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. పోస్టును బట్టి, హోదాను బట్టి లేఖ ఇవ్వడానికి రూ.4 నుంచి రూ. 10 లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. ఇదంతా పోలీసుశాఖలో వ్యవస్థీకృతంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఈ సంస్కృతికి చరమగీతం పాడాలని చూశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషరేట్ల పరిధిలో ప్రజాప్రతినిధుల లేఖలతో సంబంధం లేకుండా పోస్టింగులు ఇచ్చారు. మరికొన్ని ప్రాంతాల్లోనూ ఇదే పద్ధతి అనుసరించారు. కాని ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోస్టింగుల విషయంలో ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి పెరిగింది. గత అక్టోబరు నెలలో జరిగిన డీఎస్పీ, అదనపు ఎస్పీల పోస్టింగుల్లో ఇది స్పష్టంగా కనిపించింది. సిఫార్సు లేఖలు లేని వారికి నిబంధనల ప్రకారం అప్రాధాన్య పోస్టింగులు ఇచ్చారు. కాని రాజకీయ పలుకుబడి ఉన్నవారికి కోరుకున్న పోస్టులు ఇచ్చారు. ఒక్కో పోస్టుకు రూ. లక్షలో చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇది సద్దుమణగగానే తాజాగా ఎస్సైల నుంచి సీఐల పదోన్నతులు తెరపైకి వచ్చాయి. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో పోస్టింగులు ప్రక్రియ పెద్దగా వివాదాలేవీ లేకుండానే పూర్తయింది. మిగతా ప్రాంతాల్లో మాత్రం ఎవరి ప్రయత్నం వారు చేసుకుంటున్నారు.

బ్యాచ్‌లవారీగా వసూళ్లు

సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం.. ఏవైనా ఆరోపణలు ఉంటే తప్ప క్షేత్రస్థాయి సిబ్బందిని రెండేళ్ల వరకూ బదిలీ చేయకూడదు. దాంతో రెండేళ్లు పూర్తయిన పోస్టులను వెతికి వాటికోసం ప్రయత్నించేవారు కొందరైతే పలుకుబడితో నచ్చిన పోస్టింగ్ కోసం ప్రయత్నించేవారు మరికొందరు. ఇందులో కొత్త పరిణామం ఏమిటంటే పోస్టింగ్ తెచ్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం కొంతమంది అధికారులు ఓ నిధిని ఏర్పాటు చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం బ్యాచ్‌లవారీగా కొంతమంది అధికారులు తలాకొంత డబ్బు జమ చేసి పెట్టుకుంటున్నారు. తమ బ్యాచ్‌లో పోస్టు కోసం ప్రయత్నిస్తున్న వారికి దాన్నుంచి చెల్లిస్తున్నారు. ఒకరి తర్వాత ఒకరు సాయం చేసుకుంటూ పోస్టింగులు తెచ్చుకోవాలనేది వీరి ఆలోచన. అధికారుల్లో మొదలైన పోస్టింగుల యావ ప్రజాప్రతినిధుల పంట పండిస్తోంది. సీఐ స్థాయిలో ఒక్కో పోస్టు కోసం లేఖ ఇవ్వడానికి సగటున రూ. 5 లక్షల వరకూ వసూలు డిమాండు చేస్తున్నట్లు సమాచారం. మొదట్లో ఇటువంటి వాటిని తీవ్రంగానే పరిగణించిన ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తున్నందున ఇప్పుడు చూసీచూడనట్లు వ్యవహరిస్తోందనే ప్రచారం జరుగుతోంది.

సంతానం కలుగనందుకు నిందించడం క్రూరత్వమే

ముంబయి: సంతానం కలుగనందుకు జీవితభాగస్వామిని పదేపదే నిందించడం క్రూరత్వం అవుతుందని బొంబాయి హైకోర్టు వ్యాఖ్యానించింది. సంతానలేమికి బాధ్యుడివంటూ తన భార్య పదేపదే తనను నిందించిందని ఆరోపిస్తూ కోర్టును ఆశ్రయించిన 62 ఏళ్ల వ్యక్తికి విడాకులు మంజూరు చేసింది. జీవిత భాగస్వామి చేతిలో అతడు మానసిక యాతనకు గురైనట్లు స్పష్టమైందని వ్యాఖ్యానించిన కోర్టు విడాకులను మంజూరు చేసింది.

ఆ నలుగురి వాదన సబబే!

- కేసుల కేటాయింపులో ఏకపక్షం కూడదు
- సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తులకు మాజీల మద్దతు
- సీజేఐకు బహిరంగ లేఖ



జస్టిస్ హెచ్.సురేశ్
బొంబాయి హైకోర్టు మాజీ న్యాయమూర్తి



జస్టిస్ ఎ.పి.షా
దిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి



జస్టిస్ కె.చంద్రు
మద్రాస్ హైకోర్టు మాజీ జడ్జీ



జస్టిస్ పి.బి.సావంత్
సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

దిల్లీ: సుప్రీం కోర్టులో జడ్జీలకు కేసుల కేటాయింపుపై నలుగురు సీనియర్ న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలతో తాము ఏకీభవిస్తున్నట్లు నలుగురు మాజీ న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)కి ఒక బహిరంగ లేఖ రాశారు. ప్రస్తుత సంక్షోభాన్ని న్యాయవ్యవస్థ పరిధిలోనే పరిష్కారం చేసుకోవాలన్నారు.

సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి.బి. సావంత్, దిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.పి.షా, మద్రాస్ హైకోర్టు మాజీ జడ్జీ జస్టిస్ కె.చంద్రు, బొంబాయి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్.సురేశ్‌లు ఈ లేఖను రాశారు. దీన్ని మీడియాకూ అందించారు. అంతకుముందు జస్టిస్ షా మాట్లాడుతూ.. మిగతా ముగ్గురు మాజీ న్యాయమూర్తులు ఈ లేఖకు ఆమోదం తెలిపిన విషయంపై తనకు సమాచారం లేదన్నారు. అందువల్ల ఆ లేఖ రాసిన విషయాన్ని ఆయన తొలుత ధ్రువీకరించలేదు. ఆ తర్వాత మాట్లాడుతూ లేఖకు మిగతా ముగ్గురు ఆమోదం తెలిపారని తెలిపి, ధ్రువీకరించారు. ఈ మాజీ జడ్జీలు లేవనెత్తిన అంశాలివీ..

“సుప్రీం కోర్టులో వివిధ ధర్మాసనాలకు కేసుల కేటాయింపుపై నలుగురు సీనియర్ న్యాయమూర్తులు చాలా తీవ్రమైన అంశాన్ని లేవనెత్తారు. తమకు కేటాయింపు సరిగా జరగడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఏకపక్షంగా నిర్దిష్ట ధర్మాసనాలకే కేటాయిస్తున్నారని చెప్పారు. న్యాయ, చట్టబద్ధ పాలనపై ఇది చాలా తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. సీజేఐ.. ‘రోస్టర్‌కు మాస్టరే’, ధర్మాసనాలను ఏర్పాటు అధికారం ఆయనకు ఉన్న మాట వాస్తవమే. అంటే దీనర్థం.. సీజేఐ ఏకపక్షంగా వ్యవహరిస్తూ సున్నితమైన, ముఖ్య కేసులను తనకు నచ్చిన జూనియర్ న్యాయమూర్తులకు కేటాయించాలని కాదు. ప్రస్తుత సమస్యను పరిష్కరించాలి. ధర్మాసనాల కేటాయింపు, కేసుల పంపిణీపై విస్పష్ట నిబంధనలను రూపొందించాలి. అవి హేతుబద్ధంగా, న్యాయబద్ధంగా, పారదర్శకంగా ఉండాలి. న్యాయ వ్యవస్థ, సుప్రీం కోర్టుపై ప్రజల్లో విశ్వాసాన్ని తిరిగి ప్రోది చేసేందుకు దీన్ని తక్షణం చేపట్టాలి” అని లేఖలో పేర్కొన్నారు. ఇదంతా జరిగే వరకూ ముఖ్యమైన, సున్నిత కేసులను ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారించాలని కోరారు.

విస్తరించనున్న పురపాలన

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ పరిశీలనలో వెల్లడైంది. గ్రామ పంచాయతీల్లో కొందరు సర్పంచులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో గ్రామాల్లో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం గ్రామ పంచాయతీల విలీనంపై ప్రత్యేక దృష్టి సారించింది. త్వరలో ప్రభుత్వం తీసుకురానున్న కొత్త పంచాయతీరాజ్ చట్టంలో గ్రామపంచాయతీల విలీన ప్రక్రియను సులభతరం చేస్తూ అనేక మార్పులు తీసుకురానున్నారు. న్యాయస్థానాల్లో ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోనున్నారు. కొత్త చట్టంతో ప్రభుత్వం గ్రామపంచాయతీలు, లేదా కొన్ని గ్రామాలను నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో విలీనం చేయడానికి ప్రధాన అడ్డంకులు తొలగనున్నాయని అధికారులు చెబుతున్నారు. ఎన్నికలు జరిగిన పంచాయతీల విలీనానికి కోర్టుల్లో ఇబ్బందులు ఎదురైన క్రమంలో విలీన గ్రామాలు, కొత్త నగర పంచాయతీల వివరాలను సిద్ధం చేసుకున్న తర్వాతప్రభుత్వం ఎన్నికలదిశగా సాగనుంది.

హైదరాబాద్ సహా ఇతర నగరాలు: హైదరాబాద్ బాహ్యవలయం లోపలి ప్రాంతాల విలీనం, లేదంటే కొత్త నగర పంచాయతీలుగా ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. నగర పాలక సంస్థలకు ఐదు కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలు, పురపాలక సంఘాలకు మూడు కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలు, నగర పంచాయతీలకు కిలోమీటరు పరిధిలోని గ్రామాల వివరాలు సేకరిస్తున్నారు. ఇవి కాకుండా 15 వేల జనాభా దాటిన మేజర్ గ్రామపంచాయతీలను నగర పంచాయతీలుగా మార్చడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. సుమారు 40 మేజర్ పంచాయతీల వివరాలను జిల్లా కలెక్టర్ల ద్వారా సమాచారం తెప్పించుకుంది. హైదరాబాద్ పరిధిలో 38 గ్రామ పంచాయతీల సమాచారం సేకరించారు. నిజామాబాద్‌లో 13 గ్రామాలు, కరీంనగర్ నగర పాలక సంస్థలో 23 గ్రామాల విలీనాన్ని గుర్తించారు.

నిబంధనలు సిద్ధం చేస్తున్న పురపాలక శాఖ : పురపాలక శాఖ కూడా విలీనానికి వీలుగా అనేక మార్పులకు శ్రీకారం చుడుతోంది. గ్రామాల విలీనాన్ని పురపాలక మండళ్లు వ్యతిరేకించకుండా ఉండేలా నిబంధనలు మార్చనున్నారు. పురపాలక చట్టంలో కూడా మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావించినా ప్రస్తుతం నిబంధనల మార్పులకు మాత్రమే పరిమితమైంది. పురపాలక శాఖలో పంచాయతీల విలీనానికి, కొత్త నగరపంచాయతీల ఏర్పాటుకు కొన్ని ప్రత్యేక ప్రాతిపదికలను నిర్దేశించినుంది. న్యాయస్థానాల్లో ఎదురవుతున్న చిక్కులనేపథ్యంలో ఈ చర్యలకు శ్రీకారం చుట్టింది.

మార్చి 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు!

(మొదటి పేజీ తరువాయి)

సాధారణ, వ్యవసాయ బడ్జెట్లను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఉపసంఘాల నివేదికలపై అధ్యయనం ప్రారంభం పంటల పెట్టుబడి మద్దతు పథకం, కొత్త పంచాయతీరాజ్ చట్టంపై రెండు మంత్రివర్గ ఉపసంఘాలు సమర్పించిన రెండు నివేదికలపై ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యయనం ప్రారంభించారు. ఆదివారం రోజంతా వాటిని ఆయన పరిశీలించారు. వీటి గురించి మంత్రులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించిన అనంతరం ఆమోదించే అవకాశం ఉంది. ముందుగా కొత్త పంచాయతీరాజ్ చట్టంపై బిల్లు రూపకల్పన ప్రక్రియ నడుస్తుంది. న్యాయనిపుణులకు దాన్ని నివేదిస్తారు. అన్నీ కుదిరాక బిల్లును తయారు చేస్తారు. బిల్లుపై స్పష్టత వచ్చాకే రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి, వాటి ఆమోదం తీసుకుంటారు. రైతు పెట్టుబడి మద్దతు పథకం ఖరారుకు ముందు సీఎం కేసీఆర్ మంత్రులు, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. ఈ వారంలోనే అది జరిగే వీలుంది.

త్వరలోనే వివాద పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

త్వరలోనే పరిష్కారమవుతుందని, సుహృద్భావ వాతావరణం నెలకొంటుందని జస్టిస్ దీపక్ మిశ్ర ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.

ప్రస్తుత వివాద పరిష్కారానికి బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్ర నేతృత్వంలో ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఈ కమిటీ ఆదివారం సుప్రీం కోర్టుకు చెందిన పలువురు న్యాయమూర్తులతో భేటీ అయ్యింది. అసంతృప్త గళాన్ని వినిపించిన నలుగురు న్యాయమూర్తుల్లో జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ ఎం.బి.లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లతో సమావేశమైంది. జస్టిస్ అరుణ్ మిశ్రతోనూ భేటీ అయ్యింది. సొహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జీ బి.హెచ్. లోయా మరణంపై దర్యాప్తునకు ఆదేశించాలన్న ప్రజాహిత వ్యాజ్యంపై జస్టిస్ అరుణ్ మిశ్ర విచారణ జరుపుతున్నారు. ఈ కేసును ఆయనకు ఇవ్వడంపై నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ప్రశ్నలు లేవనెత్తిన సంగతి తెలిసిందే. న్యాయమూర్తులతో భేటీ అనంతరం బీసీఐ ప్రతినిధి బృందం సీజేఐతో 50 నిమిషాల పాటు సమావేశమైంది. ఈ సందర్భంగా ఈ వివాదంపై బీసీఐ అభిప్రాయాలను ఆయన ముందుంచింది. భేటీ అనంతరం బీసీఐ అధ్యక్షుడు మనన్ కుమార్ మిశ్ర మాట్లాడుతూ. . సుహృద్భావ వాతావరణంలో సమావేశం జరిగిందన్నారు. సమస్య పరిష్కారానికి సాధ్యమైన అన్ని చర్యలనూ తీసుకుంటానని ప్రధాన న్యాయమూర్తి హామీ ఇచ్చినట్లు చెప్పారు. అంతకుముందు మిగతా జడ్జీలతో సమావేశమైనప్పుడు వారు కూడా వివాద పరిష్కారానికి చేయాల్సిందంతా చేస్తామన్నట్లు తెలిపారు. న్యాయమూర్తులతో రోజంతా సాగించిన చర్చల సారాంశాన్ని సోమవారం జరిగే విలేఖరుల సమావేశంలో వివరిస్తామన్నారు. సుప్రీం కోర్టులో ఎలాంటి సంక్షోభం లేదన్నారు. 2, 3 రోజుల్లో అన్నీ పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. “మేం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలనుకోవడంలేదు. కాకపోతే ఎక్కడ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి, వాటిని పరిష్కరించడానికి ఏం మార్గాలున్నాయో తెలుసుకోవడానికి మాత్రమే న్యాయమూర్తులను కలిశాం” అని చెప్పారు.

అంతకుముందు సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్ జస్టిస్ దీపక్ మిశ్రను కలిశారు. ప్రస్తుత వివాదంపై ఎస్సీబీఏ చేసిన తీర్మానాన్ని ఆయనకు అందించారు. దాన్ని పరిశీలిస్తానని, సుప్రీం కోర్టులో సాధ్యమైనంత త్వరగా సుహృద్భావ వాతావరణం నెలకొనేలా చూస్తానని సీజేఐ హామీ ఇచ్చినట్లు వికాస్ సింగ్ అనంతరం విలేఖరులకు తెలిపారు. న్యాయమూర్తులందరూ తీర్మానాన్ని పరిశీలిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించడానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తులందరూ (ఫుల్ కోర్టు) సమావేశం కావాలని ఈ తీర్మానంలో ఎస్సీబీఏ కోరింది.

జస్టిస్ చలమేశ్వర్‌ను కలిసిన జడ్జీలు: మరోపక్క సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే, జస్టిస్ ఎల్.నాగేశ్వరరావులు.. జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఇందులో ఏ అంశాలు చర్చకు వచ్చిందీ తెలియరాలేదు. నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా ముందుకు రావడం దురదృష్టకరమని దిల్లీ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ల సమన్వయ కమిటీ పేర్కొంది. ఈ సమస్యను పది రోజుల్లోగా పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని స్పష్టంచేసింది.

నేడు ఫుల్ కోర్టు?: తాజా వివాదంపై సోమవారం సర్వోన్నత న్యాయస్థానం ‘ఫుల్ కోర్టు’ చర్చించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందులో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు అందరూ అంతర్గతంగా చర్చించుకుంటారు. సర్వోన్నత న్యాయస్థానంలో ప్రస్తుతం 25 మంది న్యాయమూర్తులు ఉన్నారు.

గ్రహం అనుగ్రహం

15-1-2018 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
చతుర్దశి: తె. 4-57 తదుపరి అమావాస్య
మూల నక్షత్రం: సా. 4-45 తదుపరి పూర్వాషాఢ
అమృత ఘడియలు: ఉ. 9-40 నుంచి 11-26 వరకు
వర్జ్యం: మ. 2-58 నుంచి 4-45 వరకు
తిరిగి తె. 3-23 నుంచి 5-10 వరకు
దుర్ముహూర్తం: మ. 12-31 నుంచి 1-15 వరకు
తిరిగి మ. 2-44 నుంచి 3-28 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-40
మకర సంక్రాంతి, మాసశివరాత్రి

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	9.9	32.5
మెదక్	14.3	35.0
రామగుండం	15.8	32.6
హైదరాబాద్	15.9	32.0
హన్మకొండ	16.0	32.0
నిజామాబాద్	17.0	34.0
కరీంనగర్	18.0	32.0
ఖమ్మం	18.0	35.0
మహబూబ్‌నగర్	19.5	34.8
తిరుపతి	20.8	31.8
సూర్యాపేట	23.0	35.0

నిర్లక్ష్యం పడగన సజీవ సాక్ష్యం

- మాయమవుతున్న కోటలు, బురుజులు
- పట్టించుకోని పంచాయతీలు
- దృష్టి సారిస్తే పర్యాటక ప్రాంతాలు



గోడలపై పెరిగే వృక్షాలతో దెబ్బ తింటున్న అందోల్ ప్రాకారం

ఈనాడు–హైదరాబాద్: రాణీరుద్రమ దేవి అంతటి శౌరప్రతాపాలతో ప్రస్తుత సంగారెడ్డి జిల్లాలోని ఆందోల్ నుంచి పరిపాలించిన మహారాణి శంకరమ్మ.. ఆమె తన తండ్రి పేరుతో నిర్మించిందే ప్రస్తుత సంగారెడ్డి పట్టణం. అలాంటి చోట.. 620 ఏళ్లుగా సజీవ సాక్ష్యాలుగా నిలిచి ఉన్న కోటలు, బురుజులు ఇప్పుడు నేలమట్టమైపోతున్నాయి. కోట గోడల్లో మొలిచిన మొక్కలు వృక్షాలుగా మారిపోతున్నా పట్టించుకొనేవారే లేరు. ఒక్క అందోల్ కోటలు, బురుజులే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా వేలసంఖ్యలోని పురాతన కట్టడాల దుస్థితి ఇది. పంచాయతీలు చొరవ చూపించగలిగితే ప్రతి గ్రామం ఒక పర్యాటక ప్రాంతంగా తయారవుతుంది. ప్రస్తుత పరిస్థితి మాత్రం చరిత్ర పిపాసుకులకు కంటనీరు తెప్పించేలా ఉంది. 'ఈనాడు' ప్రతినిధి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ఈ కట్టడాలపై నిర్లక్ష్య ధోరణి కొట్టొచ్చినట్టు కనిపించింది. రాజు కోట రాజధానిలో ఉంటే.. గోడలు, బురుజులు చుట్టూ మిగతా గ్రామాల్లో కనిపిస్తుంటాయి. శత్రుసైన్యాలు, దోపిడీ దొంగలు చొరబడకుండా ఎత్తైన బురుజుల్ని నిర్మించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో టేక్మాల్, మునిపల్లి, కర్చల్, జోగిపేట, అల్లాదుర్గం, రేగోడు.. ఇలా అనేక ప్రాంతాల్లో కోటలు, బురుజులు, ద్వారాలు వేల సంఖ్యలో ఉన్నట్లు అంచనా. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇవి క్రమేపీ కనుమరుగవుతున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కౌలాస్ ఖిల్లా నేలమట్టమయ్యే దుస్థితిలో ఉంది. ఉట్నూరును రాజధానిగా చేసుకొని పాలించిన గోండురాజుల విశాలమైన కోట శిథిలావస్థకు చేరింది. సంగారెడ్డికి దగ్గర్లోని ఆందోల్‌లో శత్రుదుర్భేద్య ప్రాకారాలు, బురుజుల్లో మొలిచిన మొక్కలు వృక్షాలై కట్టడాలను కూల్చేస్తున్నాయి. వాటిలోని రాళ్లను తీసుకెళ్లి మురుగుకాలువలకు ఉపయోగించుకొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇదే జిల్లాలోని పెద్దశంకరం పేటలోని బురుజులదీ అదే పరిస్థితి. సినీ నటులు, ఐటీ నిపుణులతో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రంగారెడ్డి జిల్లా మణికొండలో బురుజులు ప్రస్తుతం అందరి కళ్ల ముందే మాయమవుతున్నాయి.

ఇప్పుడేం చేయాలి?: కేవలం వృక్షాలను పెకలించగలిగినా కొన్ని బురుజులను, కోటలను కూలిపోకుండా కాపాడవచ్చు. గ్రామ పంచాయతీలు తక్కువ ఖర్చుతోనే ఈ పనిని చేపట్టవచ్చు. బురుజుల్లో ఏర్పడిన బీటలను సిమెంట్‌తో పూడ్చవచ్చు. ఆయా గ్రామాల్లోని యువజన సంఘాలు తలచుకుంటే ఈ పనులు సాధ్యమవుతాయి. పురాతన నేల బావులను ఉపాధి హామీ పథకం కింద పునరుద్ధరించుకోవచ్చని కేంద్రం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. వీటితో పాటు కోటలు, బురుజుల స్వల్ప మరమ్మతులు వంటివి ఈ పథకం కింద చేపట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపించొచ్చు. పెద్దశంకరంపేటలోని కోట లోపల భాగాన్ని ఏడాదికి ఒకసారి గ్రామస్థులు శుభ్రపర్చుకొని జాతర నిర్వహించుకొంటున్నారు.

ఇవీ ఉపయోగాలు: కోటల్ని సంరక్షించగలిగితే వాటిలో ఇప్పటికీ ఛేదించకుండా ఉన్న రహస్యాలపై ఔత్సాహికులు దృష్టి సారించవచ్చు. అందోల్ కోటలో బయటకు వెళ్లేందుకు రహస్య నేలమాళిగ ఉన్నట్టు చరిత్ర పుటల్లో ఉంది. దాన్ని ఇంతవరకూ ఎవరూ కనుక్కోలేదు. ఉట్నూరు కోటలోని కోనేరువద్ద స్తంభంపై ఉన్న శాసనాన్ని ఇంకా ఎవరూ చదవలేదు. కౌలాస్ ఖిల్లాలోని ఫిరంగులను సంరక్షించటంతో పాటు అక్కడి శిల్పకళపై అధ్యయనం చేయవచ్చు. పెదశంకరంపేట బురుజుల మధ్య సొరంగం ఎంత దూరం వరకూ ఉన్నదీ ఆరాతీయవచ్చు. వీటిని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దవచ్చు.

భారతీయ బృందానికి తెలుగమ్మాయి నేతృత్వం



శ్రీతేజ

ఈనాడు, దిల్లీ: జపాన్ ప్రభుత్వం ఏటా నిర్వహించే 'షిప్ ఫర్ వరల్డ్ యూత్ లీడర్స్' కార్యక్రమానికి వెళ్లే పది మంది భారతీయ బృందానికి హైదరాబాద్‌కు చెందిన యువ న్యాయవాది శ్రీతేజ నాయకత్వం వహించనున్నారు. ఈ బృందం మంగళవారం జపాన్ రాజధాని టోక్యో చేరుకొని అక్కడి నుంచి 11 దేశాలకు చెందిన 240 మంది ప్రతినిధులతో 45 రోజులపాటు నౌకలో సముద్ర మార్గంలో సింగపూర్, భారత్, శ్రీలంకలను చుట్టి తిరిగి జపాన్ చేరుకుంటుంది. ఈ బృందంలో ఆస్ట్రేలియా, మెక్సికో, మొజాంబిక్, ఒమన్, పెరూ, పోల్యాండ్, దక్షిణాఫ్రికా, స్పెయిన్, శ్రీలంక, జపాన్, భారత్‌కు చెందిన ప్రతినిధులు ఉంటారు. వీరికి వివిధ అంశాల్లో అవగాహన, నాయకత్వ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ప్రాతినిధ్యం వహిస్తున్న దేశాల్లోని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులపై వీరికి అవగాహన కల్పిస్తారు. కేంద్ర యువజన వ్యవహారాల శాఖ మంత్రి రాజ్యవర్ధన్ రాథోడ్ ఇంటర్వ్యూ చేసి తనను భారత బృందానికి నాయకత్వం వహించమన్నారని ఆదివారమిక్కడ విలేకర్లతో మాట్లాడుతూ శ్రీతేజ తెలిపారు.

ఈనాడు

వస్తోంది పారిశ్రామిక క్రాంతి

మార్పు నిత్యం మార్పు సత్యం అన్న సార్వకాలిక వాస్తవం ఊహాతీత వేగంతో అనుక్షణం రుజువవుతున్న రోజులివి. కృత్రిమ మేధతో అద్భుతాలు ఆవిష్కరించేలా మరమనుషు(రోబోల)లే నయా కార్మిక శక్తిగా రూపాంతరం చెందే నాలుగో పారిశ్రామిక విప్లవం కనుచూపు మేరలో పొడగడుతున్న వేళ దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు వచ్చేవారం జరగనుంది. ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి, తయారీ విలువ జోడింపులో ఎకాయెకి 96 శాతానికి పైగా ప్రాతినిధ్యం వహిస్తున్న నూరు దేశాల ఆర్థిక వ్యవస్థల్ని ఎంపిక చేసి, భవిష్యత్తులో తయారీ రంగం సవాళ్లకు అవి ఏ మేరకు సిద్ధంగా ఉన్నాయో ఆర్థిక వేదిక అధ్యయనం చేసింది. సమీప భవిష్యత్తులో సాంకేతిక ఆవిష్కరణలతో తయారీ రంగాన్ని కొత్తపుంతలు తొక్కించే పటిష్ఠ యంత్రాంగంతో జపాన్ మొట్టమొదటిస్థానంలో నిలువగా- దక్షిణ కొరియా, జర్మనీ, స్విట్జర్లాండ్, చైనాలు వరసగా తరవాతి స్థానాలు ఆక్రమించాయి. భారత్ 30వ స్థానంలో ఉందన్న నివేదిక- తక్కిన 'బ్రిక్స్' దేశాలైన రష్యా 35, బ్రెజిల్ 41, దక్షిణాఫ్రికా 45వ స్థానాల్లో నిలిచాయంటోంది. ఆయా దేశాల ఆధునిక పారిశ్రామిక వ్యూహాల అభివృద్ధిని అధ్యయనం చేసి వంద దేశాల్ని- ముందువరసలోనివి, గట్టి సామర్థ్యంగలవి, వారసత్వ పునాదులున్నవి, కొత్తగా కాలూనుతున్నవి అంటూ నాలుగు విభాగాలుగా నివేదిక వర్గీకరించింది. ప్రస్తుతం గట్టి పునాదులు ఉండి భవిష్యత్తులో సవాళ్ల తప్పటంటున్న మూడో విభాగంలో ఇండియాతోపాటు మెక్సికో, ఫిలిప్పీన్స్, రష్యాలు కొలువుతీరాయి. ముందువరసలో ఉన్న పాతిక దేశాలూ ఎలాంటి మార్పులకైనా సంసిద్ధంగా ఉన్న తయారీ వ్యవస్థలతో భారీ లబ్ధి ఒడిసిపట్టడానికి కాచుకుని ఉన్నాయని నివేదిక స్పష్టీకరిస్తోంది. నాలుగో పారిశ్రామిక విప్లవాన్ని అందిపుచ్చుకుని తయారీ రంగాన్ని రూపాంతరీకరించగలిగే జాబితాలో అమెరికా తొలి స్థానంలో ఉంటే, ఇండియా 44వ స్థానంతో సరిపెట్టుకొంది. 'భారత్‌లో తయారీ' నినాదం భారీ పెట్టుబడుల్ని రాబట్టేకోవడానికి దావోస్ పయనం కట్టే మోదీ ప్రభుత్వ యంత్రాంగం తప్పనిసరిగా దృష్టి సారించాల్సిన అధ్యయనమిది!

ప్రపంచ ఆర్థిక వేదిక కార్యనిర్వాహక అధ్యక్షుడి మాటల్లో నాలుగో పారిశ్రామిక విప్లవం అంటే- మన జీవన విధానాన్ని, పని పరిస్థితుల్ని, పరస్పర సంబంధాల్ని సమూలంగా మార్చేసే సాంకేతిక విప్లవం! జౌళి పరిశ్రమ, ఆవిరి యంత్రాలు, ఆధునిక కర్మాగారాల ఆవిర్భావంతో 18వ శతాబ్ది చివర్లో మొదటి పారిశ్రామిక విప్లవం బ్రిటన్‌లో పుట్టుకొచ్చింది. దాదాపు వందేళ్ల తరవాత వచ్చిన రెండో పారిశ్రామిక విప్లవం ఇరవయ్యో శతాబ్ది ఆరంభానికి ఉచ్ఛ దశకు చేరింది. డెబ్భయ్యో దశకంలో నాటి సాంకేతికత మూడో పారిశ్రామిక విప్లవానికి అంటుకట్టి, కళ్లు చెదిరే ఆవిష్కరణలతో ప్రపంచాన్ని కొత్త సహస్రాబ్దిలోకి తోడ్కొని వచ్చింది. దాని మౌలిక సదుపాయాలు, పరిజ్ఞానంపై ఆధారపడుతూనే ఉత్పత్తి, నిర్వహణ, పరిపాలన వ్యవస్థల్ని సమూలంగా మార్చేసే మహోధృత వేగంతో నాలుగో పారిశ్రామిక విప్లవం దూసుకొస్తోందని ప్రపంచ ఆర్థిక వేదిక పారాహుషార్ పలుకుతోంది. 2011లోనే ఇండస్ట్రీ 4.0 పేరిట జర్మనీ తయారీ రంగ డిజిటలీకరణలో ముందడుగు వేసింది. ఉత్పాదక రంగంతోపాటు సామాజిక వ్యవస్థనూ సాంకేతికంగా నవీకరించే వ్యూహాన్ని జపాన్ 2016లో చేపట్టగా- పారిశ్రామిక వ్యూహంతో బ్రిటన్, 'స్మార్ట్ ఇండస్ట్రీ' అంటూ సింగపూర్ వడివడిగా అడుగులేస్తున్నాయి. దక్షిణ కొరియా అయితే దేశాధ్యక్షుడి సారథ్యంలోనే నిపుణుల సంఘాన్ని ఏర్పాటుచేసి, మన కరెన్సీలో రెండు లక్షల 30వేల కోట్ల రూపాయల ఆర్థిక ఒడుదొడుకులకు కారణమయ్యే నాలుగో పారిశ్రామిక విప్లవం ఒత్తిళ్లను అధిగమించే ముందస్తు వ్యూహాల్ని అమలు చేస్తోంది. ఈ విషయంలో చైనా, ఇండియా కంటే ఎంతో ముందున్న సంగతి తెలిసిందే. దేశ జనాభాలో 35 ఏళ్లలోపున్న యువజనం 65 శాతంగా ఉన్న ఇండియా- భావి సవాళ్లకు దీటైన సమగ్రవ్యూహంతో ముందుకు దూకాల్సిందే!

మునుముందు ఉత్పాదక రంగాన పెట్టుబడికంటే మిన్నగా ప్రతిభే కీలక పాత్ర పోషించగలదంటున్న అధ్యయనాలు- నాలుగో పారిశ్రామిక విప్లవం గొప్ప అవకాశాల్నే కాదు, నిరుద్యోగిత రూపేణా భారీ అనర్థాల్నీ కొనితెస్తుందంటున్నాయి. చౌక కార్మిక శక్తితో ప్రయోజనం పొందుతున్న ఇండియా, లాటిన్ అమెరికా దేశాల ఆర్థిక వ్యవస్థలు కృత్రిమ మేధ, రోబోల వినియోగం వల్ల దెబ్బతినే ప్రమాదం ఉందంటున్నారు. వచ్చే రెండు దశాబ్దాల్లో బ్రిటన్ కార్మికుల్లో 35 శాతం, అమెరికాలో 47 శాతం కొత్త సాంకేతికత కారణంగా ఉద్యోగాలకు నీళ్లొదులుకోవాల్సిందేనని ఆక్స్‌ఫర్డ్ పరిశోధన ఎలుగెత్తుతోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పెరిగిన ఆర్థిక అసమానతలు భవిష్యత్తులో పెను అగాధాన్ని విస్తరింపజేయనున్న విశ్లేషణల వెలుగులో- పటుతర ఆర్థిక వ్యూహాలకు ఇండియా సాన పట్టాలి. రెండున్నర లక్షల కోట్ల డాలర్ల స్థూల దేశీయోత్పత్తితో ప్రపంచంలో ఆరో స్థానంలో ఉన్న ఇండియా మరో పుష్కర కాలానికల్లా పది లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరగల సత్తా సాధించాలంటే- మానవ వనరుల ఉన్నతీకరణపైనా, విద్య, శాస్త్ర పరిశోధనలు, ఆవిష్కరణలపైనా, నవకల్పనలపైనా భారీగా పెట్టుబడులు పెట్టాలి! మున్నెన్నడూ నేటి సాంకేతిక పరిజ్ఞాన పునాదులు పటిష్ఠంగా వ్యవస్థీకృతమై లేకపోవడం ఇండియాకు ఎంతగానో కలిసివచ్చే అంశమని, కాలంచెల్లిన పరిజ్ఞానాల్ని తోసిపుచ్చి రేపటి అవసరాలకు దీటైన దాన్ని మన యువత సమర్థంగా అందిపుచ్చుకొంటే ఉట్టిని ఇట్టే కొట్టగలమని రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ చెబుతున్నారు. భావి సవాళ్లను అవకాశాలుగా మలచే దార్శనిక వ్యూహనిర్మాణంతోనే దేశ యువజనం పారిశ్రామిక క్రాంతిదర్శులు కాగలుగుతారు!

కౌలు రైతు ఇంటా సిరులపంట!



దేశంలో సగం జనాభాకు ప్రధాన ఆధారమైన వ్యవసాయ రంగం ఆశించిన పురోగతి సాధించలేకపోతోంది. దీనిపై ఆధారపడ్డవారు స్థిరమైన ఆదాయాలు దక్కక ఒక్క పూట తిండికీ నోచుకోలేకపోతున్నారు. సాగుభూమి ఉన్న రైతులే సేద్యం లాభసాటిగా లేక సంక్షోభ పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయం. భూమిపై ఎలాంటి హక్కులూ లేని ఈ రైతుల్ని వాస్తవ సాగుదారులుగా గుర్తించి అన్ని రకాల ప్రయోజనాలు కల్పించాల్సిన అవసరముంది. ఈ దిశగా చట్టాలను అమలు చేయడం ద్వారా కౌలుదారులతో సహా సాగుదారులందరికీ సేద్యంపై భరోసా కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే! సాగుచేసే ప్రతి రైతుకూ సేద్యం లాభసాటి అయినప్పుడే నిజమైన హరిత విప్లవ ఫలితాలు అందుతాయని పాలకులు గుర్తించాలి.

దక్కని ప్రయోజనాలు

దేశంలో వ్యవసాయం వదిలేస్తున్నవారి సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. సొంతభూమి ఉన్నవారూ గిట్టుబాటు కాని సేద్యంకన్నా కూలిపని చేసుకుంటే కుటుంబాన్ని పోషించుకోవచ్చన్న ధీమాతో సాగుకు స్వస్తి చెబుతున్నారు. ఓ ప్రణాళిక ప్రకారం సేద్యంచేస్తూ మార్కెట్ నైపుణ్యాలను అలవరచుకుని వ్యవసాయంలో పలువురు రైతులు రాణిస్తున్నప్పటికీ, ఈ కొందరి విజయాలపట్ల అందరిలో అవగాహన కల్పించాల్సిన అవసరముంది. సేద్యాన్ని వదిలేస్తున్న భూయజమానుల నుంచి సొంతభూమిలేని రైతులు, కూలీలు కూడా పొలాలను కౌలుకు తీసుకుని సేద్యం సాగిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయం ఇలా క్రమంగా చేతులు మారుతోంది. పట్టా భూములున్న రైతుల కన్నా కౌలుదారుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. మారిన పరిస్థితుల్లో కౌలు సేద్యం మొత్తం సాగుభూమిలో 50 శాతం వరకు ఉండొచ్చని రైతుసంఘాల అంచనా. పలురకాల వృత్తుల్లో సంపాదించుకున్నవారంతా గ్రామాల్లో భూములు కొనుగోలు చేస్తుండటంతో సాగుభూముల్లో అధిక శాతం కౌలుదారులే పండించాల్సి వస్తోంది. దురదృష్టవశాత్తూ భూయజమానులకు అందే ఎలాంటి రాయితీలూ వీరికి అందకపోతుండటం వల్ల సేద్యంలో మిగులుబాటు ప్రశ్నార్థకమవుతోంది. కౌలు ధరలు పెరిగిపోతుండటం, కూలీల కొరత తదితర సమస్యలతో కౌలుదారులకు తిప్పలు తప్పడం లేదు. దేశంలోని మొత్తం సాగుభూమిలో సుమారు 40 శాతానికిపైగా కౌలురైతులే ఉన్నారని అంచనా. ఒక రైతుకు ప్రభుత్వపరంగా అందుతున్న ఇన్‌పుట్ సబ్సిడీలు, పంట రుణాలు, బీమా సదుపాయాలు కౌలుదారులకు దక్కడం లేదు. భూమిపై ఎలాంటి యాజమాన్య హక్కులు లేకపోవడం వల్ల వీరికి ప్రభుత్వరంగ బ్యాంకులేవీ అప్పులివ్వడం లేదు. దేశంలో ఏటా సుమారు ఎనిమిది లక్షల కోట్ల రూపాయలకు పైగా పంట రుణాలిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. దేశంలోని మొత్తం సాగుదారుల్లో నిజానికి 25 శాతానికైనా పంటరుణాలు దక్కడం లేదన్నది వాస్తవం. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కౌలుదారులకు రుణాలు అందించేందుకు రైతుమిత్ర బృందాలు ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ కాలంలో వీటిని తొలగించారు. 'సంయుక్త బాధ్యతా



పాలకుల భరోసాతోనే పండగ

బృందాలు' (జాయింట్ లయబిలిటీ గ్రూపులు)గా మార్చారు. వీరిలో కనీసం ఎనిమిది శాతం మంది కౌలుదారులకైనా రుణాలు అందించలేకపోయారు.

ప్రకృతి విపత్తులవల్ల వాటిల్లే నష్టాలు తట్టుకునే శక్తి కౌలురైతులకు ఉండదు. భూయజమానుల పేరిట వచ్చే పరిహారం చెక్కులు దక్కించుకోవడానికి ఒక్కోసారి నానాపాట్లూ పడాలి. భూమి కౌలుపత్రాలు లేకపోవడమూ దీనికి కారణం. ఈ దుస్థితిని సరిదిద్దడానికి ఏర్పడిన జయతీఘోష్ కమిషన్ వాస్తవ సాగుదారులను గుర్తించి, వారికి ప్రభుత్వపరంగా అందే రాయితీలన్నీ అందించాలని సూచించింది. కౌలు సేద్యానికి ఎలాంటి భరోసా లేకపోవడం, వ్యవసాయ పెట్టుబడులు పెరుగుతున్న తీరును దృష్టిలో పెట్టుకుని సొంతభూమి ఉన్న రైతులతో సమానంగా వీరికి అన్ని ప్రయోజనాలు దక్కాలని, వారందరినీ సంస్థాగత పరపతి పరిధిలోకి తీసుకురావాలని పేర్కొంది. ఈ సూచనలూ అమలు కానే లేదు. విభజనకు ముందే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు విడివిడిగా కౌలుచట్టాలున్నాయి. తెలంగాణ చట్టం ప్రకారం మహిళలు, చిన్నపిల్లలు, వికలాంగులు, మాజీ సైనికులు మినహా అసలు భూమిని ఎవరూ కౌలుకు ఇవ్వడానికే వీలులేదు. ఒకవేళ ఇతరులెవరైనా కౌలుకు తీసుకున్నా వారికి ఎలాంటి రాయితీలూ దక్కవు. ఆంధ్రప్రదేశ్ చట్టం ప్రకారం భూమిని ఎవరైనా కౌలుకు ఇవ్వవచ్చు. ఇస్తే కనీసం ఆరేళ్లు ఇవ్వాలి. అయితే వీరిమధ్య ఒప్పందం రిజిస్టరు కావాల్సి ఉంటుంది. పండే పంటను బట్టి కౌలు ధర ఉంటుంది. ఈ రెండింటిని క్రోడీకరించి మధ్యే మార్గంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011లో కౌలు రైతుల కష్టాలు తీరుస్తామంటూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'భూమి లైసెన్స్ కలిగిన వ్యవసాయదారుల చట్టం-2011'ను అమలులోకి తీసుకువచ్చింది. దీని ప్రకారం పండించే భూమిపై ఎలాంటి యాజమాన్య హక్కు లేకపోయినా సొంత భూమి కలిగిన రైతులతో సమానంగా ఈ చట్టం ద్వారా ప్రయోజనాలు కలుగుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. అమలు చేసిన ఏడాది కేవలం ఆరు లక్షల మందికి ప్రయోజనం కల్పించి, తరవాత మమ అనిపించింది. ఈ నేపథ్యంలో గతేడాది నీతి ఆయోగ్ కౌలుదారుల సంక్షేమం కోసం నమూనా కౌలు చట్టం ముసాయిదా రూపొందించి రాష్ట్రాల అభిప్రాయాలు కోరింది. పాత చట్టంలోని ఎన్నో అంశాలకు పరిష్కారాలు చూపుతూ రూపొందించిన ఈ ముసాయిదా ప్రకారం భూయజమాని, కౌలుదారు మధ్య ఒప్పంద పత్రం రిజిస్టరు కాకపోయినా, సర్పంచి లేదా స్థానిక అధికారులు వీరి మధ్య లీజును ధ్రువీకరించినా, దీని ఆధారంగా కౌలుదారులకు అన్ని ప్రయోజనాలు దక్కుతాయి. ఒకవేళ వివాదాలు ఏర్పడితే సివిల్ కోర్టుల జోక్యం లేకుండా కిందిస్థాయిలోనే పరిష్కారానికి పలు సూచనలు ఇందులో ఉన్నాయి. నీతి ఆయోగ్ ముసాయిదాలోని ఒకటి రెండు మంచి అంశాలను తీసుకునేందుకు కొన్ని రాష్ట్రాలు ఉత్సాహపడినా, ఒడిశా తప్ప ఏ ఒక్క రాష్ట్రమూ ముసాయిదాను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ఇష్టపడలేదు. ఇది చట్టరూపం దాలిస్తే కార్పొరేట్ వ్యవసాయానికి తలుపులు తెరచినట్లేనన్న భయాలు తీవ్రస్థాయిలో వ్యక్తమయ్యాయి. ఇలా చట్టాలు, చర్యలు కార్యాచరణలో విఫలమవుతుండటంవల్ల కౌలుదారుల శ్రేయం నీటిమీద రాతలవుతున్నాయి. కౌలుదారులకు రక్షణ లేకపోవడం, వ్యయనియంత్రణ వ్యూహాల లోపం, సాగు పద్ధతులు ఆచరించకపోవడం, విపణిలో దోపిడి, మద్దతు ధరలు కొరవడటం, మార్కెట్ నైపుణ్యాల లేమి సేద్యాన్ని భారంగా మార్చేస్తున్నాయి.

అధిక వ్యయంతో సతమతం



సొంత భూమి కలిగి సేద్యం చేస్తున్నవారికయ్యే ఎకరా సగటు ఖర్చులతో పోల్చితే కౌలుదారులకు రెట్టింపు పెట్టుబడి అవుతోంది. ఎకరా కౌలుకు కోస్తాలో సగటున రూ.30 వేల వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. దీంతో కౌలురైతుకు మిగిలేదేమీ ఉండటం లేదు. కౌలు ఎంత ఉండాలనే అంశంపై రెవిన్యూ చట్టాల్లోని పలు సెక్షన్లు స్పష్టంగా నిర్వచించినా అవి అమలు కావడంలేదు. కౌలు ధరలపై కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు నియంత్రణ లేకుండాపోయింది. చంద్రబాబు, కేసీఆర్ ప్రభుత్వాలు అమలుచేసిన రుణమాఫీ వల్ల రెండు రాష్ట్రాల్లో పట్టాదారు పాసుపుస్తకాలున్న రైతులకే ప్రయోజనం దక్కింది. పాసుపుస్తకాలున్న ప్రతి రైతుకూ ఉచిత ఎరువుల పథకం వర్తింపజేస్తామని, ఎకరాకు నాలుగు వేల రూపాయలు నేరుగా వారి ఖాతాలో వేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి నిరుడు ప్రకటించారు. వాస్తవంగా పంటలు సాగుచేస్తున్న తమకు దీనివల్ల ఎలాంటి మేలు జరగదన్న ఆందోళన కౌలురైతుల్లో వ్యక్తమవుతోంది. అయితే వాస్తవ సాగుదారుల అంచనా కోసం త్వరలోనే సర్వే చేపట్టి, వారి ఖాతాల్లోనూ ఉచిత ఎరువులకిచ్చే మొత్తాన్ని వేస్తామని ప్రభుత్వం ప్రకటించడం తెలంగాణ కౌలుదారులకు పెద్ద ఊరట. ఇదే తరహాలో ఆన్‌లైన్‌లో పాసుపుస్తకాల ఆధారంగా విత్తనాల పర్మిట్లు జారీచేసే విషయంలోనూ కౌలు రైతులకు మేలు చేకూర్చాలి.

చట్టాల సరళీకరణ అవసరం

దేశ ఆర్థిక వ్యవస్థ సుస్థిరాభివృద్ధికి వ్యవసాయం ఊతం కావాలంటే సాగుచేసే ప్రతి ఒక్కరికీ సేద్యం లాభసాటిగా ఉంటుందనే భరోసా ఇవ్వాలి. కౌలు రైతుల ప్రయోజనాలను విస్మరించి ముందడుగు వేయలేమని పాలకులు గుర్తించాలి. అప్పుల కింద పంట అమ్మేశాక పోషణ కోసం రైతుల బియ్యం కూడా కొనుక్కోవాల్సి వస్తోంది. పిల్లల చదువులు, శుభకార్యాలు, ఆరోగ్య వ్యయాలు అన్నీ భరించాల్సి రావడం రైతులపాలిట శాపమవుతోంది. ఈ పరిస్థితి మారాలి. సొంత భూమి ఉండి పట్టణాల్లో ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడినవారు తమ దగ్గర కౌలు తీసుకున్నవారికి ఒప్పంద పత్రాలు ఇచ్చి సహకరించడం ద్వారా పరిస్థితుల్లో కొంతమేర మార్పు తీసుకురావచ్చు. ఈ పత్రాలు చూపి భూమిపై కౌలుదారులు యాజమాన్య హక్కులను ఎక్కడ లేవనెత్తుతారో అంటూ భయపడాల్సిన అవసరం లేదు. దీనిపై ప్రభుత్వాలు పలుమార్లు భరోసా ఇచ్చినా భూయజమానుల్లో భయం పోలేదు. ఒప్పంద పత్రాల వల్ల ఆరుగాలం కష్టపడే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలతో పాటు పరిహారాలు అందే వీలుంటుంది. కౌలు చట్టాలను సరళీకరించి ప్రతి ఒక్కరికీ రాయితీలు అందేలా ప్రభుత్వాలు చూడాలి. నగదు బదిలీలో భాగంగా రాయితీలను యజమానుల ఖాతాల్లో జమ అయితే వాటిని కౌలుదారులకు అందించేలా, లేదా వాస్తవ సాగుదారులను గుర్తించి సబ్సిడీలు అందజేసేలా ఏర్పాట్లు చేయగలిగితేనే ప్రయోజనం ఉంటుంది. దేశంలో రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ఇంకా ఎంతో చేయాల్సి ఉందన్న సత్యాన్ని పాలకులు గుర్తించాలి. రెండో హరిత విప్లవం సాధించాలని డాక్టర్ స్వామినాథన్ వంటి శాస్త్రవేత్తలు పిలుపిస్తున్నా ప్రభుత్వ చర్యలు ఆ దిశగా లేవు. పంట పండించే క్రమంలో అన్నదాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వాటికి పరిష్కారాలను సత్వరమే చూపాలి. సాగు వ్యయం తగ్గించే మార్గాలు తెలియజేసి, అధిక దిగుబడులు సాధించి మంచి ధరలు పొందే పరిస్థితులు కల్పించాలి. కర్రు కదలించే ప్రతి రైతుకూ వ్యవసాయం లాభసాటిగా మారేలా సేద్య సంస్కరణలను సత్వరమే చేపట్టాలి. వ్యవసాయాన్ని పండుగ చేయాలి.

- అమిర్నేని హరికృష్ణ


పౌర చైతన్యమే రక్షా కవచం

'రోడ్డుభద్రత అంశం ఇప్పటికీ చర్చల దశలోనే ఉంది. ఇకనైనా చర్యల స్థాయికి చేరాలి. ఎప్పుడైనా, ఎక్కడైనా రాదారి భద్రత ఓ సామాజిక బాధ్యత. వాహనదారులు, పాదచారులు ఉమ్మడిగా పెంపొందించుకోవాల్సిన సంస్కృతి అది. దేశంలో ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు ఉంటుంది. దాని పరిధిలోకి రోడ్డుభద్రత హక్కూ వస్తుంది. పరిరక్షించాల్సిన విధి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలదే' అని ఇరవై నెలల క్రితమే సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించిన ధర్మాసనం ఆ వ్యాఖ్యలు చేయడంతోపాటు, పాతిక సూత్రాలతో మార్గదర్శక పత్రాన్ని వెలువరించింది. అన్ని ప్రభుత్వాలూ వాటిని విధిగా అమలుచేయాలంటూ, విధివిధానాల రూపకల్పనకు గడువు విధించింది. ఆ మేరకు రాష్ట్రాలు ఈ నెలాఖరులోగా సర్వసమగ్ర రీతిలో రోడ్డుభద్రత ప్రణాళికల్ని రూపొందించుకోవాలి. సంబంధిత మండళ్లను రాష్ట్రాలవారీగా ఏర్పాటు చేసుకోవాలి. రాష్ట్ర మండలికి సచివాలయం తరహాలో పనిచేసే 'లీడ్ ఏజెన్సీ' నిర్మాణానికీ చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు అప్పట్లోనే సూచించింది. రహదారి భద్రతపై పౌరుల అవగాహన పెరిగేలా వివిధ స్థాయుల్లో ప్రచార కార్యక్రమాలు సాగించాలనీ మార్గదర్శనం చేసింది. అన్ని పనుల నిర్వహణకూ మూడు వారాల వ్యవధి మిగిలి ఉంది. ఇదే తరుణంలో, ఈ నెల 17న ముగిసేలా 'జాతీయస్థాయి వారోత్సవాలు' నిర్వహిస్తున్నారు. మూడు దశాబ్దాలుగా ఏటా ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ప్రచారోత్సవాలే ఇవి. గత కాల అనుభవాలు, వర్తమాన స్థితిగతులు, భవిష్యత్ అవసరాల రీత్యా వీటికి ఇప్పుడు ఎనలేని ప్రాధాన్యం ఏర్పడింది.

పెచ్చరిల్లుతున్న ప్రమాదాలు

ఇతర దేశాలతో పోలిస్తే, రెండో అతి పెద్ద రహదారి వ్యవస్థ ఇండియాలోనే ఉంది. భారత్‌లో 47.2లక్షల కిలోమీటర్లకు పైగా రోడ్లు విస్తరించి ఉన్నాయి. వాటిలో జాతీయ రహదారుల వాటా 2.1 శాతం. వీటిపై దాపురిస్తున్న ప్రమాదాలు మాత్రం 28 శాతానికి పైమాటే! ఏటా ప్రపంచవ్యాప్తంగా రోడ్డుప్రమాదాల్లో చనిపోతున్నవారు 12.6 లక్షల పైచిలుకు ఉన్నారు. భారత్‌లో దుర్మరణం పాలవుతున్నవారు లక్షా యాభై వేలకు మించి ఉంటారు. క్షతగాత్రులు అంతకు నాలుగింతలు ఉండవచ్చని అంచనా. నిత్యం సగటున నాలుగొందల మంది ప్రాణాల్ని రోడ్డుప్రమాదాలు కర్కశంగా కబళిస్తున్నాయి. వీరిలో సగానికి పైగా యువతే. ఉత్పాదక శక్తి, క్రియాశీలత వెల్లివిరిసే వారి ప్రాణాలు అర్ధాంతరంగా గాలిలో కలిసిపోవడం వల్ల- ఆర్థికంగా దేశానికి వాటిల్లే వార్షిక నష్టం సుమారు రూ.61 వేల కోట్లు. అమూల్యమైన మానవ వనరుల్ని ఇలా కోల్పోయేకన్నా, రోడ్డుభద్రతపై పెట్టుబడులు పెంచాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు తెలుసుకొని మసలాలన్నదే ప్రపంచబ్యాంకు తాజా నివేదిక సారాంశం. మరో రెండేళ్లలో ప్రమాదాలను సగానికి సగం తగ్గించాలని భారత్ నిర్ణయించింది. అందుకోసం వచ్చే అక్టోబరు నుంచి అన్ని కార్లలో ప్రమాద సమయాల్లో తెరచుకునే గాలి సంచుల(ఎయిర్ బ్యాగులు) ఏర్పాటును తప్పనిసరి చేయబోతున్నారు. వాహనాల చోదక సామర్థ్య ధ్రువీకరణ పత్రాలు జారీచేసే ప్రక్రియను అత్యాధునిక సాంకేతికత ద్వారా నిర్వహించాలని భావిస్తున్నారు. ప్రమాదాల కారణంగానే దేశం ఏటా స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 3.5 శాతాన్ని నష్టపోతోంది. రహదారి వ్యవస్థను ఆమూలాగ్రం సంస్కరించకుండా, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించకుండా, ఏవో కొన్ని సాధారణ చర్యలతో రోడ్డుభద్రత సాధించాలనుకోవడం- నేల విడిచి సాము చేయడమే అవుతుంది. క్షేత్రస్థాయి వాస్తవాలు గ్రహించకుండా, ప్రజలకు తగినంత అవగాహన కల్పించకుండా ఏ ప్రభుత్వమూ రహదారి భద్రతా లక్ష్యాన్ని సాధించలేదు.

విపరీతమైన వేగం, మద్య ప్రభావం వంటి తప్పిదాల కారణంగానే రహదారులు నిత్యం రక్తమోడుతున్నాయి. వాహనాల్లో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడానికి ఆటోమొబైల్ సంస్థలే చొరవ తీసుకోవాలని 2016నాటి బిల్లులో



జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు

కేంద్రం స్పష్టీకరించింది. రోడ్డు నిర్మాణ పనుల నాణ్యత వల్ల ప్రమాదాల సంఖ్యను నియంత్రించవచ్చు. రాదారి ప్రమాదాలకు కారకులయ్యేవారిని అత్యంత కఠినంగా శిక్షించేలా చట్ట నిబంధనలుండాలి. అటువంటి చర్యలు కొరవడటం వల్లే, 87 శాతం రోడ్డుప్రమాదాలు చోటుచేసుకుంటున్న 13 రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వరసగా ఏడు, తొమ్మిది స్థానాలకు చేరాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలకన్నా వాహనాల సంఖ్య ఎక్కువగా ఉండే ఉత్తర్ ప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రల్లో ప్రమాదాలు అత్యధికంగా చోటుచేసుకుంటున్నాయి. దుర్ఘటనలకు మూలమయ్యే ప్రమాదకర మలుపుల్ని ప్రభుత్వాలు సకాలంలో గుర్తించడం లేదు. ప్రమాదాల్ని అదుపులోకి తెచ్చే చర్యల్ని వేగవంతం చేయడంపైనా శ్రద్ధ కనిపించదు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో జాప్యాన్ని ఎంతగా నివారిస్తే, అంతగా రోడ్డుభద్రత సాధ్యమవుతుంది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారి నుంచి జరిమానాల రూపంలో వసూలయ్యే మొత్తాల్ని రహదారి భద్రతకు వ్యయం చేయడమూ ప్రభుత్వ కర్తవ్యమే. ప్రతి ఏటా రూ.2,000 కోట్లు వెచ్చించి సురక్ష రహదారి పథకం అమలుచేస్తున్నారు. ఇవన్నీ ఒకెత్తు. బాల్యదశ నుంచే అవగాహన, సామాజిక స్పృహ పెంచడం ద్వారా రహదారి భద్రత సాధించగలగడం మరో కెత్తు. భద్రతాంశాల్ని ఒకటి నుంచి అయిదు; ఆరు మొదలు ఎనిమిది; అనంతరం తొమ్మిది, పది తరగతుల బాలబాలికలకు పాఠాలుగా ప్రవేశపెట్టేందుకు తెలంగాణ రహదారి భద్రతా మండలి ఇప్పటికే చర్యలు చేపట్టింది. 'సుప్రీం' మార్గదర్శక సూత్రాలు అనుసరించి, రోడ్డుభద్రతను వచ్చే ఏప్రిల్ నాటికి పాఠ్యాంశంగా చేర్చేలా ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. వీటితో పాటు- వాహనాల రాకపోకల నియమాలు, నిబంధనలు అందరికీ తెలిసేలా ప్రతి పట్టణ స్థాయిలోనూ జన అవగాహన శిబిరాలు నిర్వహించడం ప్రధానం. అందులో వివిధ ప్రభుత్వ శాఖల, స్వచ్ఛంద సేవాసంస్థల సమధిక భాగస్వామ్యమూ అనేక ప్రాణాలకు రక్షణనిస్తుంది.

నివారణ మార్గాలు

తరచుగా ప్రమాదాలు సంభవించే ప్రాంతాల్లో 'బ్లాక్‌స్పాట్ బోర్డుల' ఏర్పాటు; పోలీసు, రవాణా, రోడ్లు-భవనాల విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు పౌరుల ప్రాణాలకు భరోసా కల్పిస్తాయి. జాతీయ రహదారులపై గల నిర్ణీత 'బ్లాక్ జోన్'లలో రోజంతా ఆగి ఆగి వెలుగుతుండే (డిమ్ అండ్ డిప్) దీపాల అమరిక కూడా ప్రమాదాల్ని చాలావరకు అదుపుచేయగలుగుతుంది. 'వేగాన్ని తగ్గించు- ప్రమాదాన్ని నిరోధించు' అంటూ ప్రభుత్వాలు వాడుకలోకి తెస్తున్న నియంత్రణ పరికరాలపైనా పౌర అవగాహన పెరగాలి. రెండు టన్నులకు పైగా సామర్థ్యమున్న ప్రతి వాహనానికీ ఆ పరికరాల ఏర్పాటు తప్పనిసరి అనే చైతన్యం చోదకులతో పాటు ఇతరులకూ కలగాలి. వేగ నియంత్రణకు ఎంతమాత్రం ఉపకరించని నకిలీ పరికరాలు విపణిలో ప్రత్యక్షం కావడాన్ని ప్రశ్నించాలి. వాహనాల అతి వేగానికి అడ్డుకట్ట వేసే 'లేజర్ స్పీడ్ గన్లు', వాటి స్థానంలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్న 'సౌరశక్తితో నడిచే పరికరాల'పై పౌరుల అవగాహన విస్తృతం కావాలి. సమర్థ, సురక్షిత, సమీకృత, పారదర్శక భద్రతా వ్యవస్థలో వారి బాధ్యతలకు, హక్కులకు సమ ప్రాధాన్యముంది. కేంద్రం 2016లో ఆమోదించిన మోటారు వాహనాల చట్టం సవరణ బిల్లు వాటిని ప్రస్ఫుటం చేసింది. నడిరోడ్డు మీద ఇష్టానుసారం బండ్లు నడపటం, నిబంధనల్ని ఖాతరు చేయకుండా దూకుడుగా ప్రవర్తించడం ఎంత ప్రాణాంతకమో అందరికీ తెలుసు. శిరస్త్రాణం వాడకపోవటం, వాహనంమీద ఉన్నా చరవాణి వదలని స్వభావం, సీట్ బెల్టు ఊసే పట్టని తత్వం చోదకుడికే కాక ఇతరులకీ హానికరమే. తాగి బండెక్కితే, పిల్లలకు బండి చేతికిస్తే జరిగేదేమిటో తెలిసినప్పటికీ- పట్టించుకోని వైఖరి ప్రబలితే, అంతకు మించిన నేరపూరిత నిర్లక్ష్యం మరొకటి ఉండదు. ఈ ప్రాథమిక అంశాలతో పాటు చట్టసంబంధ, సాంకేతిక అంశాలపైనా వాహనదారులకు, బాటసారులకు అవగాహన కలిగించడం ప్రభుత్వ కర్తవ్యం. తెలుసుకున్నవాటిని ఆచరణకు తేవాలన్న పౌర చైతన్యమే అందరికీ క్షేమదాయకం!

- శరత్


జ్ఞాన సందేశం

అక్షసూక్తం పేరిట రుగ్వేదంలో పద్నాలుగు మంత్రాలు ఉన్నాయి. నిజానికి అవన్నీ ఒక జూదరి ఆత్మఘోషను సూచించేవి. ఓ సూక్తంలోని ఆ జూదరి మొర- ధర్మరాజు నిర్వేదానికి ప్రతీక. రుగ్వేదం ప్రస్తావించిన జూదరి కథాంశమూ అచ్చంగా ధర్మజుడి పరిస్థితిని తలపిస్తుంది. జూదంలో ఓడిపోయాక ఎలాంటి దయనీయమైన పరిస్థితి ఎదుర్కోవలసివస్తుందో ఆ జూదరి ముఖంగానే ప్రస్ఫుటమవుతుంది.

జూదరి అందరిలాంటి ఒక ఆశాజీవి. కాని, అడియాస వల్ల అతడి జీవితం కన్నీళ్లపర్యంతం అవుతున్నది. నేడు ఎదురైన ఓటమి రేపటి విజయానికి సోపానం అని అతడి నమ్మకం! ఆ నమ్మకానికి మూలకారణం, ఇదివరకు అనుకోకుండా అతడిని వరించిన విజయం. పదిసార్లు ఓటమి పాలైనా, ఒక్క పందెం గెలిస్తే చాలు వందరెట్లు లబ్ధి పొందవచ్చన్న విశ్వాసమే జూదరి పాలిట శాపమై ఎప్పటికప్పుడు అతడిని కట్టిపడేస్తుంది. అందుకే, అతడు చివరిదాకా ప్రయత్నిస్తుంటాడు. ఇల్లూ వాకిలి, నగా నట్రా, పొలమూ పుట్రా అన్నీ పోగొట్టుకున్నా ఆఖరికి కట్టుబట్టలను కుదువపెట్టడానికైనా వెనకాడడు. జూదమనే ఆ మత్తు అటువంటిది!

సప్త వ్యసనాల్లో జూదం ఒకటి. భుజంగం బుస్సుమని లేచి పడగెత్తినట్లు ఉంటుందది. సర్వస్వం పోయినా, జూదరిని మళ్ళీ పాచిక విసరమంటుంది. ఆ పాచికల గలగల- వందిమాగధుల స్తుతిలో సుప్రభాత గీతంలా జూదరికి వినిపిస్తుంది!

అప్పటికే పీకలవరకు అప్పుల్లో కూరుకుపోయిన జూదరి, ఓటమి తరవాత మరింత నిస్సహాయంగా నిలుస్తాడు. అప్పులవాళ్లు అతడిని, కుటుంబ



సభ్యులనూ అవమానిస్తారు. భారతంలో ధర్మజుడిని గుర్తుకు తెచ్చే పరిస్థితి అది. కృష్ణ పరమాత్మ ఆదుకోకపోతే అంతే!

జూదమనే ఆ పని వెనక ఉన్న గూఢమైన అర్థాన్ని వ్యాసుడు వివరించాడు. వేదానికి భాష్యం వంటి మహాభారతంలో సభాపర్వం అది. ఆ కావ్యం ద్వారా ఆయన చేసిన హెచ్చరిక జూదరులకు పాఠం. జూదం, దాని

అంతర్యామి

పర్యవసానం ఎంత భయానకమో భారతం ప్రస్ఫుటం చేస్తుంది. కురుపాండవ సంగ్రామమే జూద పరిణామానికి ప్రత్యక్ష సాక్ష్యంగా భావించవచ్చు.

ఒక అవస్థలో మనిషి జూదమనే పొరపాటు చేస్తాడు. దాన్ని వీడకుండా, ఒక అలవాటుగా పెంచి పోషిస్తే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. జూదం కారణంగానే ధర్మరాజుతో పాటు అతడి నలుగురు తమ్ముళ్లు, కట్టుకున్న ఇల్లాలు అడవిపాలయ్యారు.

జూదరి అసహాయ స్థితిని పదమూడో సూక్తం వెల్లడిస్తుంది. చివరిగా శరణాగతిని పద్నాలుగో మంత్రం బోధిస్తుంది.

భారతంలో ఉన్నదంతా పరమాత్మ తత్వమే! దుష్టులను శిక్షించడానికి, శిష్టులను రక్షించడానికి, హృదిలో జ్ఞానదీపం వెలిగించడానికి ఆయనే గతి.

మహాభారతానికి 'పంచమ వేదం' అని సార్థక నామధేయం. అందరూ నేర్చుకోవాల్సిన పాఠాల్ని అది వివరిస్తోంది. జూదం ఆడవద్దు, కష్టపడి పనిచేయి అని ప్రబోధిస్తోంది. 'ఆట మానుకోకపోతే- అందరికీ లోకువ కాక తప్పదు, అప్పుడు బతుకు దుర్భరం కాక మానదు' అని భారతం సందేశాత్మకంగా చెబుతోంది!

- ఉప్పు రాఘవేంద్రరావు

పుట్టగొడుగుల్లా అపార్టుమెంట్లు

- మౌలిక వసతుల్లేకుండా కట్టేస్తున్నారు..!
- ఏపీ రాజధానికి సమీపంలో భారీ నిర్మాణాలు
- తాడేపల్లి నుంచి ఏఎన్‌యూ వరకు
- తాగునీరు, డ్రైనేజీ, రహదారులు లేకుండానే వందల సంఖ్యలో భవనాలు
- అనుమతులిచ్చేసి ఊరుకుంటున్న సీఆర్‌డీఏ

ఈనాడు - అమరావతి

మూడేళ్ల కిందటి వరకు అవి పచ్చటి పంటపొలాలు..! రాజధాని రావడంతో ఇప్పుడా పొలాల్లో పంటలు మాయమై బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. ఇప్పటికే మూడు, నాలుగు వందల వరకు భవనాలను నిర్మించారు. అవసరాలను సొమ్ము చేసుకోడానికి నిర్మాణదారులు పోటీలు పడి మరీ భవనాలు కట్టేస్తున్నారు. భారీ భవన నిర్మాణ సంస్థలూ రంగంలోకి దిగాయి. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన పెత్తనమంతా తన చేతిలో పెట్టుకున్న రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) వచ్చిన దరఖాస్తుకు వచ్చినట్టే ఇష్టారాజ్యంగా అనుమతులిస్తోంది. రహదారులు, తాగునీరు, మురుగునీటి పారుదల, విద్యుత్ లైన్ల వంటి ప్రధాన మౌలిక వసతుల ప్రస్తావననే విస్మరిస్తోంది. ఇప్పుడు కడుతున్న భవనాలన్నీ చిన్న పురపాలికలు, గ్రామపంచాయతీల పరిధిలోనివి. భారీ ఎత్తున వస్తున్న భవనాలకు మౌలిక సౌకర్యాల కల్పన స్థోమత గానీ, యంత్రాంగంగానీ వాటికి లేవు. పురపాలికలు, పంచాయతీల్ని సంప్రదించకుండా సీఆర్‌డీఏ అనుమతులివ్వడం వసతుల లేమి, ఇతర పెనుసమస్యలకు తావిస్తోంది.

రాజధానితో మారిన సీన్..!

విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే మార్గంలో కనకదుర్గమ్మ వారధి నుంచి నాగార్జున విశ్వవిద్యాలయం వరకు జాతీయ రహదారికి పక్కనున్న స్థలం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత విలువైన ప్రాంతం ('మోస్ట్ హ్యాపెనింగ్ ప్లేస్'). రాజధానిని ఆనుకునే ఉండటం, ఎనిమిది వరుసల (సర్వీసు రోడ్లతో కలిపి) జాతీయ రహదారికి పక్కనే ఉండటం.. విజయవాడ, గుంటూరుకు సమీపంలోనే ఉండటంతో నిర్మాణదారులంతా ఈ ప్రాంతంపై దృష్టి పెట్టారు. రాజధాని ప్రకటన వెలువడేంత వరకు తాడేపల్లి పట్టణ పరిధిలోనే అపార్టుమెంట్లు ఎక్కువగా ఉండేవి. రెండు మూడేళ్లలో తాడేపల్లి నుంచి నాగార్జున విశ్వవిద్యాలయం మధ్యలో అపార్టుమెంట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. రాజధానికి సమీపంలో సొంతిల్లు కొనుక్కోవాలనుకున్నవారు, పెట్టుబడి పెట్టాలనుకున్నవారు ఈ ప్రాంతంలో ఫ్లాట్లు కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. ఒక్కో అపార్టుమెంట్‌లో 300 నుంచి 400 ఫ్లాట్లు నిర్మిస్తున్నవారూ ఉన్నారు. గేటెడ్ కమ్యూనిటీలూ వస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 8-10 వేల ఫ్లాట్లు అందుబాటులోకి వచ్చాయి.

పెత్తనానికే పరిమితం..!

సీఆర్‌డీఏ ఏర్పడకముందు ఈ ప్రాంతమంతా వీజీటీఎం-ఉడా పరిధిలో ఉండేది. అప్పట్లో తాడేపల్లి, మంగళగిరి పట్టణాల పరిధిలో జీ+2 వరకు పురపాలికలే అనుమతులిచ్చేవి. అంతకుమించిన భవనాల ప్రణాళికలు పురపాలికల ద్వారా ఉడాకు వెళ్లేవి. ఉడా వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం ఉంటే రుసుం కట్టించుకుని దస్త్రం మళ్లీ పురపాలికకు పంపేది. వారు అవసరమైన రుసుం కట్టించుకుని మౌలిక వసతులను పరిశీలించి అనుమతులిచ్చేవారు. గ్రామకంఠాల పరిధిలో పంచాయతీలు అనుమతులిచ్చేవి. వాటి వెలుపల కట్టే నిర్మాణాలు ఉడాకు వెళ్లేవి. వీజీటీఎం-ఉడా స్థానంలో సీఆర్‌డీఏ ఏర్పడ్డాక పెత్తనం దాని చేతిలోకి వెళ్లింది. పురపాలికలు, గ్రామకంఠాల పరిధిలోనూ భవన నిర్మాణాలకూ సీఆర్‌డీఏనే అనుమతిస్తోంది.

పట్టించుకోకపోతే అనర్థమే..!

- తాడేపల్లి, మంగళగిరి పురపాలికలు, కుంచనపల్లి, కొలనుకొండ, గుండిమెడ, ఆత్మకూరు, కాజ, చినకాని వంటి గ్రామాల పరిధిలోనూ నిర్మాణాలు వస్తున్నాయి. 2006లో రూపొందించిన వీజీటీఎం-ఉడా బృహత్ ప్రణాళిక ఆధారంగానే ఇక్కడ నిర్మాణాలకు సీఆర్‌డీఏ అనుమతిస్తోంది. భవనం నిర్మిస్తున్న చోట మాస్టర్‌ప్లాన్‌లో రోడ్డు ఉందా లేదా? నిర్మిస్తున్న భవనానికి అప్రోచ్ రోడ్డు ఉందా? లేదా? అన్న అంశాలనే సీఆర్‌డీఏ పరిశీలిస్తోంది.
- పొలాల్లో భవంతులు నిర్మిస్తున్నవారు నిర్మాణ ప్రాంతం వరకు ఏదో ఒక దారి చూపించి అనుమతులు పొందుతున్నారు. భవనాల నిర్మాణంపై ఆజమాయిషీ చేసేవారు లేరు.
- 2001లో జారీచేసిన జీవో-67 ప్రకారం చ.మీ.కు రూ.10 చొప్పున పంచాయతీకి నిర్మాణదారులు అభివృద్ధి సుంకం కట్టాలి. 2014లో తెచ్చిన జీవో-12 ప్రకారం దీన్ని రూ.20కి పెంచారు. నేరుగా సీఆర్‌డీఏ అనుమతివ్వడం మొదలుపెట్టాక పంచాయతీలకు ఒక్క రూపాయి కట్టడం లేదు.
- వందల సంఖ్యలో ఫ్లాట్లున్న అపార్టుమెంట్లలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటుచేస్తున్నారు. 90 శాతం అపార్టుమెంట్లలో మురుగు నీరు పొలాల్లోకి విడుస్తున్నారు. అపార్టుమెంట్లలో నివసిస్తున్నవారు రోజువారీ అవసరాలకు భూగర్భజలాల్నే వినియోగిస్తున్నారు. మురుగునీరు అక్కడికక్కడే ఇంకిపోవడం వల్ల భవిష్యత్తులో భూగర్భజలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. లోగడ మౌలిక వసతులను పురపాలిక కల్పించలేని పరిస్థితి ఉంటే సొంతంగా వసతులు కల్పించుకోవాలన్న షరతుపై అనుమతివ్వడమో, నిరాకరించడమో చేసేవి. ఇప్పుడా పరిస్థితి లేదు.
- తాడేపల్లి పురపాలిక 19 చ.కి.మీ.ల మేర విస్తరించింది. దీనిలో ఎక్కువభాగం పంట పొలాలున్నాయి. జాతీయ రహదారికి కుడి పక్కనే తాడేపల్లి విస్తరించి ఉంది. ఎడమ పక్కన ఉన్న పొలాలు కూడా పురపాలిక పరిధిలోనే ఉన్నప్పటికీ అక్కడ పెద్దగా నిర్మాణాలు వచ్చేవి కాదు. ఇప్పుడు జాతీయ రహదారికి ఎడమ పక్కన రెండు కి.మీ.దూరం వరకు అపార్టుమెంట్లు వస్తున్నాయి.
- తాడేపల్లి పురపాలిక పరిధిలో ఆస్తిపన్ను ఎక్కువ. అపార్టుమెంట్లలో చ.మీ.కు రూ.21, ఇతర భవనాలలో చ.మీ.కు రూ.14 చొప్పున పన్ను వేస్తున్నారు. పురపాలిక పరిధిలో ఎవరు ఫ్లాట్ కొన్నా వెంటనే పన్ను పడిపోతుంది. ఆ మేరకు మౌలిక వసతులు కల్పించే పరిస్థితి మాత్రం లేదు.
- తాడేపల్లి పురపాలిక పరిధిలో 16 వార్డుల్లో భూగర్భ జలాలనే వినియోగిస్తున్నారు. రూ.58 కోట్లతో పురపాలిక కోసం తాగునీటి ప్రాజెక్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అది కూడా లక్ష జనాభాను దృష్టిలో పెట్టుకుని చేశారు. పురపాలిక పరిధిలో ఇప్పటికే 70 వేల జనాభా ఉంది.
- తాడేపల్లి పురపాలిక పరిధిలో ఇప్పుడు డ్రెయిన్ల నిర్మాణానికి స్థల సమస్య ఏర్పడుతోంది. ప్రజలకు నచ్చజెప్పి టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి వస్తోంది. ఇప్పుడు జాతీయ రహదారికి పక్కనే ఎకరం రూ.పది కోట్ల వరకు పలుకుతోంది. మౌలిక వసతులకు ముందుగానే స్థలం కేటాయించి పెట్టుకోకుండా ముందే నిర్మించేస్తే భవిష్యత్తులో చాలా సమస్యలు రానున్నాయి.



తాడేపల్లిలో అరకొర వసతుల మధ్య చేపట్టిన నిర్మాణాలు

సిద్దిపేట ప్రభుత్వ వైద్యకళాశాలకు అనుమతి నిరాకరణ

కేంద్రానికి సిఫార్సు చేసిన ఎంసీఐ

ఈనాడు, హైదరాబాద్: సిద్దిపేట ప్రభుత్వ వైద్యకళాశాలకు భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) అనుమతి నిరాకరించింది. 2018-19 సంవత్సరంలో 150 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం చేసిన వినతిని ఎంసీఐ తోసిపుచ్చింది. 13.84 శాతం బోధనాసిబ్బంది కొరత ఉందనీ, అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల గదులు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయనీ, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీ చేసిన రోజున పెద్దాపరేషన్లేవీ జరగడంలేదనీ, ప్రసంగ గదులు, కేంద్ర గ్రంథాలయం, విద్యార్థుల వసతి గృహాలు, బోధన, బోధనేతర సిబ్బంది నివాస గృహాలు, తదితర నిర్మాణాలన్నీ ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొంటూ తనిఖీ బృందమిచ్చిన నివేదికను ఎంసీఐ కార్యనిర్వాహక మండలి పరిగణనలోకి తీసుకొంది. పలు లోపాలున్నందున ఎంబీబీఎస్ వైద్యవిద్య ప్రారంభానికి అనుమతి ఇవ్వలేమని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వానికి ఎంసీఐ కార్యనిర్వాహక మండలి సిఫార్సు చేసింది. అయితే ప్రభుత్వ వైద్యకళాశాల అయినందున కేంద్రానికి మరోసారి దరఖాస్తు చేసుకొని, లోపాలను నిర్దేశిత కాలపరిమితిలోపు చక్కదిద్దుతామని తెలంగాణ సర్కారు హామీ పత్రం ఇస్తే.. 2018-19 సంవత్సరానికే 150 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి లభించే అవకాశాలెక్కువగా ఉన్నాయని వైద్యవర్గాలు తెలిపాయి. ఆ దిశగా ఇప్పటికే కార్యాచరణను వేగవంతం చేశామనీ, మరోవైపు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయడంపై దృష్టిపెట్టామని పేర్కొన్నాయి.

అదనంగా 150 సీట్లు: 2018-19 వైద్యవిద్య సంవత్సరానికి తెలంగాణకు 150 సీట్లు కొత్తగా రానున్నాయి. రంగారెడ్డి జిల్లా కనకమామిడిలో అయాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు 150 ఎంబీబీఎస్ సీట్లకు ఎంసీఐ అనుమతించింది. అయితే తెలంగాణలో మరికొన్ని ప్రైవేటు వైద్యకళాశాలలకు మాత్రం ఎంసీఐ అనుమతి నిరాకరించింది. కొత్తగా ఏర్పాటుచేయాలని అనుమతులు కోరిన పట్నం మహేందర్‌రెడ్డి వైద్యకళాశాలకూ, సురభి వైద్యకళాశాలకు తిరస్కరణ ఎదురవగా.. మూడో ఏడాది ఎంబీబీఎస్ సీట్లకు ఆర్‌వీఎం వైద్యకళాశాలకు నిరాకరణ ఎదురైంది. ఎంఎన్‌ఆర్ వైద్యకళాశాలలో 100 ఎంబీబీఎస్ సీట్లను 150కు పెంచుకోవడానికి ఎంసీఐ అనుమతి నిరాకరించింది.

నేటి నుంచి శ్రీవారికి సుప్రభాత సేవ పునఃప్రారంభం

తిరుమల, న్యూస్‌టుడే: పవిత్ర ధనుర్మాసం ఆదివారంతో పరిసమాప్తమైంది. తిరుమల శ్రీవారికి సుప్రభాతం సేవ సోమవారం నుంచి పునఃప్రారంభంకానుంది. గత నెల 16నుంచి ధనుర్మాసం ప్రారంభంకాగా మరుసటి రోజు 17నుంచి సుప్రభాతం స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం చేశారు. ఆదివారం ధనుర్మాసం ఘడియలు ముగియడంతో యథాప్రకారం సుప్రభాత సేవ కొనసాగనుంది.

కమోడిటీస్ మార్కెట్‌లోకి గోరుచిక్కుడు

ప్రారంభించిన అరుణ్‌జైట్లీ

దిల్లీ: కమోడిటీస్ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులకు స్థానం లభించింది. ఎన్‌సీడీఈఎక్స్ కమాడిటీస్ మార్కెట్‌లో జిగురు ఇచ్చే గోరు చిక్కుడు గింజల (గౌర్ సీడ్/క్లస్టర్ బీన్స్) ఆప్షన్ల వ్యాపారం ఆదివారం ప్రారంభమయింది. వస్తువుల (కమాడిటీస్) మార్కెట్లో నమోదయిన తొలి వ్యవసాయ ఉత్పత్తి ఈ గింజలే కావడం విశేషం. కమోడిటీస్‌లో ఎంసీఎక్స్ తరువాత ఆప్షన్స్ వ్యాపారం చేస్తున్న సంస్థ ఎన్‌సీడీఈఎక్స్ కావడం ఇంకో విశేషం. దీనిని ప్రారంభించిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ రైతులకు ప్రయోజనాలు అందకపోతే స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) పెరుగుదలకు అర్థం లేదని అన్నారు. వ్యవసాయరంగానికి స్పష్టమైన, కచ్చితమైన ప్రయోజనాలు అందకపోతే ఆర్థిక ప్రగతి న్యాయబద్ధమైనది, సమధర్మమైనది కాదని అన్నారు. ఎన్‌సీడీఈఎక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సమీర్ షా మాట్లడుతూ ధరల హెచ్చు తగ్గుల నుంచి రైతులను కాపాడడానికి ఆప్షన్ ట్రేడింగ్ ఉపకరిస్తుందని చెప్పారు. గోరుచిక్కుడు గింజల వ్యాపారం ద్వారా 15 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు.

విమర్శలకు తావు లేకుండా హెరిటేజ్ పనితీరు

- కుటుంబసభ్యుల ఆదాయం కోసమే స్థాపించాం..
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఈనాడు, తిరుపతి: కుటుంబసభ్యులకు ఆదాయం ఉండాలనే ఉద్దేశంతో 25 ఏళ్ల కిందటే ఆలోచించి హెరిటేజ్ ఫుడ్స్ ఇండియా లిమిటెడ్‌ను ప్రారంభించామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. భుక్తి కోసం రాజకీయాలపై ఆధారపడకూడదన్న ఉద్దేశంతో అప్పట్లోనే ఈ నిర్ణయం తీసుకున్నామని, విమర్శలకు తావులేకుండా హెరిటేజ్ కొనసాగుతోందని వివరించారు. ఆదివారం చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కాశీపెంట్లలోని హెరిటేజ్ సంస్థలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థకు వచ్చిన అవార్డులను ముఖ్యమంత్రి తన మనవడు దేవాన్ష్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ సంస్థ ఏర్పాటు తొలిరోజుల్లో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని గుర్తు చేసుకున్నారు. రైతు ప్రయోజనాలు, వినియోగదారులకు సేవ, వందలాది మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా సంస్థను ప్రారంభించినట్లు వెల్లడించారు. సంస్థను మొదట్లో రెండు గంటలు చూసేవాడినని, మిగిలిన సమయం రాజకీయాలపైనే ఉండేదని వివరించారు. ఆ తర్వాత వచ్చిన ఎండీ భువనేశ్వరి సంస్థకు పూర్తిస్థాయిలో సేవలందించి ముందుకు తీసుకెళ్లారని కితాబునిచ్చారు. ఇబ్బందుల్లో ఉన్నప్పుడు లోకేష్ కృషి చేశారని, ఇప్పుడు బ్రాహ్మణి ఉన్నత స్థితికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. కంపెనీకి చాలా అవార్డులు వచ్చాయని, దాని పనితీరుకు ఇవి నిదర్శనమని తెలిపారు. తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలోనూ, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నా ఎప్పుడూ ఇక్కడికి రాలేదని.. ఇదే తొలిసారని వెల్లడించారు. 25 ఏళ్లుగా ఒక్క రోజు కూడా ఆలస్యం లేకుండా రైతులకు నగదు చెల్లింపులు చేస్తున్నారని వివరించారు. హెరిటేజ్‌కు తొమ్మిదేళ్లలో ఎనిమిది సార్లు జాతీయ ఇంధన పొదుపు అవార్డులు రావడం పర్యావరణ పరిరక్షణపై ఉన్న శ్రద్ధను తెలుపుతోందన్నారు. సంస్థ ఎండీ నారా భువనేశ్వరి మాట్లాడుతూ 2008 నుంచి గోకుల్ ప్లాంటుకు ఐదు అవార్డులు వచ్చాయన్నారు. మూడు దశాబ్దాలుగా చంద్రబాబు దార్శనికత, విలువలతో సేవలందిస్తున్నారని చెప్పారు. దీనివల్ల విజయాలతోపాటు కొన్ని అపజయాలు ఎదురయ్యాయని తెలిపారు. ఎన్ని ఎదురైనా హుందాగా పనిచేస్తున్నారని వివరించారు.



హెరిటేజ్ సంస్థకు వచ్చిన అవార్డుల ఆవిష్కరణ కార్యక్రమాన్నిభువనేశ్వరి సహకారంతో జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న నారా దేవాన్ష్.. చిత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. మంత్రి లోకేష్, బ్రాహ్మణి

ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

తిరుమల, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాలు.. నదుల అనుసంధానం, యువతకు ఉపాధి, ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు తనకు శక్తినివ్వాలని శ్రీవారిని ప్రార్థించినట్లు వివరించారు. ముఖ్యమంత్రి దంపతులు కుటుంబసభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట ముఖ్యమంత్రి విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి, భోగి పర్వదినాన కుటుంబసభ్యులతో కలిసి తమ ఇలవేల్పు శ్రీవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని. . ప్రజలకు సుఖసంతోషాలు, మెరుగైన జీవన ప్రమాణాలు ప్రసాదించాలని దేవదేవుణ్ని కోరుకున్నట్లు చెప్పారు. త్వరలోనే తితిదే ధర్మకర్తల మండలిని నియమిస్తామని పునరుద్ఘాటించారు.

దిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఏపీజే అబ్దుల్ కలాం సెంటర్ అందించే 'ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్ అవార్డు'కు ఏపీ ఐటీ, పంచాయతీరాజ్‌ల మంత్రి నారా లోకేష్ ఎంపికయ్యారు.

అధికారులా.. నేతలా..!

- సహకార సంఘాలకిక పర్సన్ ఇన్‌ఛార్జులే
- ఎన్నికల ఆలస్యంతో నియామకానికి ప్రతిపాదనలు
- 4 మార్గాలను సూచించిన సహకార శాఖ
- డీసీసీబీలకు నేతలొద్దని అంతర్గత విన్నపాలు

ఈనాడు - హైదరాబాద్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(ప్యాక్స్) పాలకవర్గాల స్థానంలో పర్సన్ ఇన్‌ఛార్జుల(పీఐసీ)ల నియామకానికి రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 31తో పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశాలు లేనందున పర్సన్ ఇన్‌ఛార్జులను నియమించాలని సహకారశాఖ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇందుకోసం 4 రకాల సూచనలు చేసింది. తక్షణం ఎన్నికలు నిర్వహించాలన్నది వాటిలో ఒకటి. కానీ ఈ నెలాఖరులోగా ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయడం సాధ్యం కాదని, పీఐసీల నియామకం తప్పదని తెలిపింది. ఇప్పుడున్న చట్టంతో రైతులకు పెద్దగా ప్రయోజనాలుండటం లేదని, మరింత సమర్థంగా సహకార చట్టాన్ని మార్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ చట్టం తెచ్చాక సంఘాలకు ఎన్నికలు పెడతారా లేక ప్రస్తుతమున్న చట్టంతోనే కొంతకాలం తర్వాత ఎన్నికలకు వెళతారా అన్నదానిపై స్పష్టత లేదు. పీఐసీల్లో పూర్తిగా అధికారులకే బాధ్యతలివ్వాలన్నది రెండో సూచన. ఇప్పుడున్న పాలకవర్గాలనే పీఐసీగా కొంత కాలం కొనసాగించడం మూడో సూచన. ఇది వద్దనుకుంటే.. .కొందరు అధికారులు, మరికొందరు రాజకీయ నాయకులతో మిశ్రమ పీఐసీ కమిటీని పాలకవర్గంగా నియమించాలని నాల్గవ సూచన. వీటిలో ఏదో ఒకదానికి ప్రభుత్వ అనుమతి రాగానే సహకార శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీచేయనుంది. పలు జిల్లాల ఎమ్మెల్యేల ద్వారా ప్యాక్స్ పాలకవర్గాల నేతలు తమనే పీఐసీలుగా నియమించాలని పైరవీలు చేయిస్తున్నట్లు సమాచారం. పూర్తిగా అధికారులనే పీఐసీలుగా నియమిస్తే... కొన్ని సంఘాల్లో గత ఐదేళ్లుగా జరిగిన అక్రమాలను తవ్వితీసే ప్రమాదముందని పాలకవర్గాల్లో ఆందోళన ఉంది. ఎన్నికలు జరిగేదాకా తామే పీఐసీగా కొనసాగితే...ఎన్నికల్లో ఎలాగోలా నెగ్గవచ్చని వారు భావిస్తున్నారు.

జిల్లాల కేంద్ర సహకార బ్యాంకులపై ప్రత్యేక దృష్టి

పాత పది జిల్లాల కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)ల పాలకవర్గాల స్థానంలో ఎవరిని నియమిస్తారనేది ఆసక్తికర అంశంగా మారింది. ఇప్పుడున్న పాలకవర్గాల్లో కొందరిపై అవినీతి ఆరోపణలున్నందున వారికి పీఐసీగా నియమించడానికి ప్రభుత్వం సుముఖత తెలుపుతుందా అని అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికే పాత వరంగల్ డీసీసీబీ పాలకవర్గాన్ని అవినీతి కారణంగా రద్దు చేశారు. వరంగల్ గ్రామీణ జిల్లా కలెక్టర్‌ను ఇంతకుముందే పీఐసీగా నియమించారు. నల్గొండ జిల్లా పాలకవర్గంపై గతంలో ఆరోపణలొచ్చాయి. తాజాగా ఖమ్మం పాలకవర్గంపై సమగ్ర విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ విచారణ కోసం తగు సూచనలివ్వాలని నాబార్డు, రిజర్వుబ్యాంకు, తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టీఎస్ బ్యాంకు)ను సహకార శాఖ కోరినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ బ్యాంకులిచ్చే నివేదికలపై ఈ జిల్లా పాలకవర్గం భవితవ్యం ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో అన్ని డీసీసీబీలకు ఇన్‌ఛార్జులుగా ఆయా జిల్లాల కలెక్టర్లకే బాధ్యతలు అప్పగించాలనే సూచనలు అంతర్గతంగా ప్రభుత్వానికి ఉన్నతాధికారులు చెబుతున్నట్లు తెలుస్తోంది. కానీ కలెక్టర్ రోజూవారీ వ్యవహారాలతో చాలా బిజీగా ఉంటారని, డీసీసీబీ రోజూవారీ వ్యవహారాలను వారు నిత్యం పర్యవేక్షించడం సాధ్యం కాదని.. నాబార్డు, సహకార శాఖ, ఇతర జిల్లాస్థాయి అధికారులతో డీసీసీబీలకు పీఐసీని నియమిస్తే కొంత మేలుగా ఉంటుందని ప్రధాన బ్యాంకు ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'కు చెప్పారు.

విదేశీ పర్యటనకు బయల్దేరిన కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ రెండు వారాల విదేశీ పర్యటనకు ఆదివారం తెల్లవారుజామున బయల్దేరి వెళ్లారు. ఆయన వెంట పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ ఉన్నారు. కేటీఆర్ మొదట దక్షిణకొరియా, ఆ తర్వాత జపాన్ వెళతారు. 23 నుంచి 26 వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొంటారు. 27న యూఏఈ వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తిరిగొస్తారు. ఈ పర్యటనలో ఆయన పారిశ్రామికవేత్తలతో భేటీ అవుతారు. పారిశ్రామిక పార్కులు, సెజ్‌లను సందర్శిస్తారు. తెలంగాణలో జౌళి, ఎలక్ట్రానిక్, ఔషధ రంగాల్లో పెట్టుబడుల కోసం ఒప్పందాలు కుదుర్చుకుంటారు. తన విదేశీ పర్యటన ఫలవంతమవుతుందని ఆశిస్తున్నానని కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

'పేదింటి ఆడపిల్లలకు మరింత భరోసా'

ముఖ్యమంత్రి కేసీఆర్ షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలకు సాయం రూ.1,00,116 పెంచడం వల్ల తెలంగాణలోని పేదింటి ఆడపిల్లలకు మరింత భరోసా కలుగుతుందని తెరాస రాష్ట్ర మైనారిటీ నాయకులు తెలిపారు. మైనారిటీ విభాగం రాష్ట్ర నేత మహ్మద్ ఖాజా బద్రుద్దీన్ తదితరులు ఆదివారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఈబీసీ పేద కుటుంబాలు తమ ఇంట్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని గుర్తించిన సీఎం వారికి ఆర్థిక సాయం అందించేందుకు రెండు పథకాలను చేపట్టారని, వాటిని విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు.

బీసీలకు అన్యాయం చేసిన కాంగ్రెస్:శ్రీనివాస్‌గౌడ్

దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోని బీసీలకు తీరని అన్యాయం చేసిందని, ప్రభుత్వంలో, పార్టీలో అన్ని రంగాల్లో వివక్షకు, అణచివేతకు పాల్పడిందని తెరాస శాసనసభ్యుడు వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. తెరాస ప్రభుత్వం బీసీలకు ప్రయోజనం కలిగించేలా పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే కాంగ్రెస్ అడ్డుకునేందుకు కుట్రలు చేస్తోందని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ గత ఎన్నికల్లో బీసీలకు అతి తక్కువ టికెట్లు ఇచ్చిందని, మంత్రివర్గంలోని తగిన చోటు కల్పించలేదని, బీసీ అధికారులకూ తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని అన్నారు.

పాకే రోబోను తయారుచేసిన శాస్త్రవేత్తలు

వాషింగ్టన్: శిశువులపై దుమ్ము, సూక్ష్మరేణువుల ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి పాకే రోబోను అమెరికాలోని పర్డ్యూ శాస్త్రవేత్తలు తయారుచేశారు. శిశువులు తమ మొదటి ఏడాదిలో ఎక్కువగా పాకుతుంటారనే సంగతి తెలిసిందే. ఈ దశలో నేలపై ఉండే దుమ్ము, ధూళి, సూక్ష్మరేణువుల ప్రభావం వారిపై ఎక్కువగా పడుతోంది. అదే నేలపై తిరిగే పెద్దవారితో పోలిస్తే నాలుగురెట్లు ఎక్కువగా దుమ్ము, ధూళి వారి ఊపిరితిత్తుల్లో చేరుతోంది. ఫలితంగా భవిష్యత్తులో ఆస్మా, అలర్జీలకు గురయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని అధ్యయనం చేయడం ద్వారా భవిష్యత్తులో ఆస్మా, అలర్జీలను వారికి సోకకుండా తప్పించడానికి ప్రస్తుత అధ్యయనం ఉపకరిస్తుందని పర్డ్యూ విశ్వవిద్యాలయానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసరు బ్రాండన్ బూర్ పేర్కొన్నారు.

నవజాత శిశు చికిత్సల్లోనూ గోల్‌మాల్

- 2500 గ్రా. బరువుతో పుట్టినా అత్యవసర వైద్యమే
- 37-42 వారాల్లోపు పుట్టిన శిశువులకూ ఇదే చికిత్స
- సాధారణ కామెర్లున్నా అత్యవసర వైద్యానికి సిఫార్సు
- ఆరోగ్యశ్రీ కింద చెల్లింపుల కోసం కక్కుర్తి..
- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఇదే తరహా దోపిడీ
- సర్కారు ఆసుపత్రుల్లో నవజాత శిశు సంరక్షణ విభాగాల పనితీరును తప్పుబట్టిన యునిసెఫ్ నివేదిక

ఈనాడు - హైదరాబాద్



తెలంగాణలో నవజాత శిశువుల చికిత్సల్లోనూ అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం కింద నవజాత శిశువులకు రూ.30 వేల నుంచి రూ.లక్షకు పైగా చికిత్స ధరలను చెల్లిస్తుండడంతో.. కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అవసరం లేకపోయినా నవజాత శిశు సంరక్షణ విభాగాల్లో (ఎస్ఎన్‌సీయూ) శిశువులకు వైద్యం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అవసరం లేకపోయినా.. 2500గ్రాముల కంటే అధిక బరువుతో పుట్టిన శిశువులకూ, 37-42 వారాల్లోపు పుట్టిన శిశువులకూ అత్యవసర వైద్యం అందిస్తూ.. ఆరోగ్యశ్రీ నిధులను దోచుకుంటున్నారనే విమర్శలున్నాయి. కొన్ని వారాల కిందట ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులు ఇదే విషయంపై ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల పిల్లల వైద్యనిపుణులతో సమావేశాన్ని నిర్వహించి, కచ్చితమైన మార్గదర్శకాలను జారీ చేసినట్లు తెలుస్తోంది. సరైన చికిత్స సమాచారాన్ని అందించని కొన్ని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులకు చెల్లింపుల్లో కోతపెట్టినట్లుగా ఆరోగ్యశ్రీ వర్గాలు తెలిపాయి. ఎంత కట్టుదిట్టంగా అమలు చేస్తున్నా.. పథకాన్ని దుర్వినియోగం చేస్తున్న ఆసుపత్రులు, వైద్యులున్నట్లుగా తాజాగా యునిసెఫ్ నివేదిక తేటతెల్లం చేస్తోంది.

పనితీరు లోపాలమయం

గతేడాది జనవరి 1 నుంచి అక్టోబరు 31 వరకూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ఎస్ఎన్‌సీయూల పనితీరుపై యునిసెఫ్ ఇటీవల ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్‌కు నివేదిక ఇచ్చింది. ఇందులో పలు అంశాలపై అభ్యంతరాలను వ్యక్తం చేసింది. సాధారణంగా 34 వారాల కంటే తక్కువ వయసుతో నెలలు నిండకుండా ముందస్తుగా పుట్టిన శిశువులకూ, 1800 గ్రా. కంటే తక్కువ బరువుతో పుట్టిన శిశువులకూ ఎస్ఎన్‌సీయూల్లో చేర్చి చికిత్స అందించాల్సి ఉంటుంది. అసాధారణ పరిస్థితుల్లో ఏమైనా అత్యవసర ఆరోగ్య సమస్యలుంటే మాత్రం.. పూర్తిగా నెలలు నిండిన తర్వాత పుట్టినా, పరిపూర్ణ బరువుతో పుట్టినా ఎస్ఎన్‌సీయూల్లో చేర్పించాల్సిందే! 2500 గ్రా. అంతకంటే ఎక్కువ బరువుతో పుట్టిన పిల్లల్లో ఎస్ఎన్‌సీయూల్లో చేర్పించాల్సిన పరిస్థితులు గరిష్ఠంగా 20 శాతానికి కంటే తక్కువేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఇందుకు విరుద్ధంగా ఎస్ఎన్‌సీయూల్లో చేరికలున్నట్లు యునిసెఫ్ తాజా నివేదికలోని వాస్తవాలు నివ్వెరగొల్పుతున్నాయి. దాదాపు అన్ని సర్కారు ఎస్ఎన్‌సీయూల్లోనూ కనిష్ఠంగా 31 శాతం.. గరిష్ఠంగా 77శాతం మంది 2500 గ్రా.కంటే బరువు ఎక్కువున్న నవజాత శిశువులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ఎస్ఎన్‌సీయూల్లో చికిత్స అందించినట్లు తేలింది. సాధారణ చికిత్సతో కోలుకునే అవకాశాలున్న కామెర్ల సమస్యకూ ఎస్ఎన్‌సీయూల్లో చేర్చి చికిత్స ఇవ్వడాన్ని యునిసెఫ్ తప్పుబట్టింది. ఎస్ఎన్‌సీయూల్లో చేరికల్లో హేతుబద్ధత లోపించిందనీ, ఆరోగ్యవంతులైన నవజాత శిశువులను అనవసరంగా చేర్చితే ప్రమాదకరమైన సెప్సిస్‌కు గురయ్యే అవకాశాలున్నాయనీ, ప్రాణాంతక పరిస్థితికి దారితీయొచ్చని హెచ్చరించింది. దీనిపై అత్యవసరంగా దృష్టిపెట్టాలని సూచించింది.

నివేదికలో ముఖ్యాంశాలు..

- గతేడాది పది నెలల కాలంలో మొత్తం 28,953 మంది నవజాత శిశువులు చికిత్స పొందగా.. 70.8 శాతం మంది శిశువులు 37-42 వారాల్లో పుట్టినవారే.
- సాధారణ ఫొటోథెరపీ చికిత్సతో తగ్గిపోయే కామెర్లకూ ఎస్ఎన్‌సీయూల్లోనే చేరుస్తున్నారు. సుల్తాన్‌బజార్ ప్రసూతి ఆసుపత్రిలోనైతే ఏకంగా 59 శాతం, గోదావరిఖనిలో 50శాతం, హన్మకొండ ప్రసూతి ఆసుపత్రిలో 45శాతం మంది శిశువులను కామెర్ల కారణంతోనే చేర్చడం గమనార్హం.
- మొత్తంగా 24.7 శాతం మంది ఈ అనారోగ్య సమస్యతోనే ఎస్ఎన్‌సీయూల్లో చికిత్స పొందారు.
- సిద్దిపేట, పెట్లబురుజు ఆసుపత్రుల్లో అనవసర చేరికలు ఎక్కువ. వీటిల్లో త్వరితగతిన ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్న కేసుల సంఖ్య కూడా ఎక్కువే.
- ఎస్ఎన్‌సీయూల్లో ఆక్సిజన్‌ను అధికంగా వినియోగిస్తున్నారని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తం నవజాత శిశు చికిత్సల్లో 13,252 (45.8శాతం) మంది శిశువులు ఆక్సిజన్ చికిత్స పొందారు.
- ఆక్సిజన్‌ను కూడా ఔషధం మాదిరిగానే వినియోగించాలనీ, మోతాదుకు మించి వినియోగిస్తే శిశువుల్లో కంటి సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయని పిల్లల వైద్య నిపుణులు చెబుతున్నారు.
- అత్యధికంగా 98 శాతం ఆక్సిజన్ చికిత్స అందిస్తున్న ఆసుపత్రి మహబూబాబాద్.
- 2500 గ్రా.కంటే ఎక్కువ బరువున్న శిశువులకు చికిత్స అందించిన ఆసుపత్రుల్లో ఏటూరునాగారం(77శాతం) ముందుండగా.. ఆ తర్వాత మహబూబాబాద్(76శాతం), సిద్దిపేట(69శాతం), గోదావరిఖని(66శాతం), సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి(64శాతం), సీకేఎం వరంగల్(60శాతం), హన్మకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రులు(60 శాతం) ఉన్నాయి.

డబ్ల్యూహెచ్‌వో 2018 క్యాలెండర్‌పై భారతీయురాలు



మంచుకొండల్లో గీతావర్మ

సిమ్లా: 'నువ్వేంటో నువ్వు చేసే పనులే చెబుతాయి' అని ఆర్యోక్తి. చేసేపనిలో చూపే అంకిత భావం, కష్టపడే తత్వం హిమాచల్‌ప్రదేశ్‌లోని కర్సోగ్ తహసీల్ సప్నోత్ గ్రామానికి చెందిన గీతావర్మ అనే మహిళకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిపెట్టింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) 2018 క్యాలెండర్‌లో చోటు సంపాదించింది. ఒక ఆరోగ్య కార్యకర్తగా స్థానిక మారుమూల గ్రామాల్లోని చిన్నారులకు టీకాలు వేయడానికి ఎంతో కష్టించింది. అందుకు మంచుకొండల్లో నడిచింది. పర్వతాలు ఎక్కిదిగింది. ఎట్టకేలకు నూరుశాతం టీకాలు వేయగలిగింది. ఆమె రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఆదర్శప్రాయురాలని హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి జైరాంఠాకుర్ కూడా అభినందించారు.

పాడి రైతుల ఎదురుచూపులు

- ముఖ్యమంత్రి హామీ అమలులో యంత్రాంగం వైఫల్యం

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న విజయా డెయిరీ, మాక్స్ సహకార చట్టం కింద పనిచేస్తున్న నార్ముల్ డెయిరీ (మదర్ డెయిరీ), కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ (కరీంనగర్ డెయిరీ), ముల్కనూరు మహిళా డెయిరీల పరిధిలో పాలు పోస్తున్న రైతులకు లీటరు పాలపై రూ.4 ప్రోత్సాహకం ఇస్తామంటూ ముఖ్యమంత్రి ఇచ్చిన ఆ హామీని నెరవేర్చడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. ప్రభుత్వం ఇస్తుందనే నమ్మకంతో కొంతకాలం సొంత నిధులతో ప్రోత్సాహకం చెల్లించిన విజయ, నార్ముల్ డెయిరీలు చివరకు విరమించుకుని..రైతుల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో జాప్యం కారణంగానే చెల్లింపులు ఆలస్యమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం కాగా..ఆ మేరకు అధికారిక సమాధానం రాకపోవడంతో అటు డెయిరీ అధికారులు, ఇటు రైతులూ అయోమయానికి గురవుతున్నారు.

మదర్ డెయిరీ బకాయి రూ.1.85 కోట్లు: ప్రభుత్వ హామీ మేరకు మదర్ డెయిరీ తమ రైతులకు అక్టోబర్ నెలాఖరు వరకు(37 రోజులు) రూ.1.85 కోట్లు చెల్లించింది. 'తమ రైతుల వివరాలతోపాటు..ప్రోత్సాహకం చెల్లించేందుకు ప్రతినెలా రూ.2 కోట్లు అవసరమంటూ పాలకవర్గం ద్వారా ప్రభుత్వానికి లేఖ రాశాం. అక్కణ్నుంచి స్పందన రాకపోవడంతో చెల్లింపులు నిలిపివేశాం. ఇప్పటికే చెల్లించిన నగదు కోసం ఎదురుచూస్తున్నాం.' అని ఆ డెయిరీ ఎండీ రమేష్ పేర్కొనడం పరిస్థితికి నిదర్శనం.

అయోమయంలో విజయా రైతులు: రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు 4.50 లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్న విజయా డెయిరీ కొన్నేళ్లుగా లీటరుపై రూ.4 ప్రోత్సాహకాన్ని అందిస్తూ వస్తోంది. ప్రభుత్వ ప్రకటన వెలువడిన నాటి నుంచి ప్రోత్సాహకాన్ని ఉపసంహరించుకుంది. 'ప్రోత్సాహకాల చెల్లింపునకు నెలకు రూ.5-6 కోట్లు అవసరమవుతాయిని ప్రభుత్వానికి నివేదించాం. అక్కణ్నుంచి స్పందన లేకపోవడంతో రైతులకు సమాధానం చెప్పలేకున్నాం' అని ఆ డెయిరీ అధికారులు చెబుతున్నారు. నిత్యం 1.20 లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్న కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ, 50 వేల లీటర్లు సేకరిస్తున్న ముల్కనూరు మహిళా డెయిరీ, రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో రోజుకు 1.20 లక్షల లీటర్ల పాలు రైతుల నుంచి తీసుకుంటున్న నార్ముల్ డెయిరీలు రైతులకు నచ్చజెబుతూ కాలం నెట్టుకొస్తున్నాయి.

ఈ నెల 20న గవర్నర్ కాళేశ్వరం పర్యటన!

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఈ నెల 20న కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై నివేదిక ఇచ్చారు. ఈ ప్రాజెక్టును సందర్శించాలని కోరారు. దీనికి గవర్నర్ అంగీకరించినట్లు సమాచారం. 20న కాళేశ్వరం సందర్శనలో ఆయన పథకం పనులను పరిశీలిస్తారు. మంత్రి హరీశ్‌రావు ఈ పర్యటనలో గవర్నర్ వెంట ఉంటారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా దీనిని నిర్మిస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ఈ పథకం పనులను పరిశీలించారు. దీనిపై తరచూ సమీక్షలు జరుపుతున్నారు. మంత్రి హరీశ్‌రావు నిరంతరం సమీక్షలు చేస్తూ ఎప్పటికప్పుడు పనులను స్వయంగా పరిశీలిస్తున్నారు. ఇటీవలే కేంద్ర బృందం ఈ ప్రాజెక్టును సందర్శించి, నిర్మాణం అద్భుతమని ప్రశంసించింది.

26 నుంచి కమల్ హాసన్ పర్యటన

చెన్నై, న్యూస్‌టుడే: రాజకీయ ప్రవేశం నేపథ్యంలో ఈ నెల 26వ తేదీ నుంచి తమిళనాడులో పర్యటన చేపట్టనున్నట్లు నటుడు కమల్ హాసన్ ప్రకటించారు. చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ విషయం వెల్లడించారు. పూర్తి వివరాలను 18వ తేదీన చెబుతానని తెలిపారు. పార్టీ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలను నేరుగా కలిసిన తర్వాతే పార్టీ పేరు ప్రకటిస్తానని కొద్ది రోజుల క్రితమే ఆయన వెల్లడించారు.

కంది రైతుకు నగదు ఇబ్బంది!

- లక్ష క్వింటాళ్లు మద్దతు ధరకు కొని పైసా ఇవ్వని నాఫెడ్
- తప్పక ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతున్న రైతులు
- మద్దతు ధర కన్నా రూ.వెయ్యి దాకా తగ్గింపుతో నష్టం

ఈనాడు, హైదరాబాద్



తాండూరు మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన కందులు

కంది రైతులను కష్టాలు వీడటంలేదు. మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకుందామంటే ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధరకన్నా బాగా తగ్గించి కొంటూ దెబ్బతీస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే సకాలంలో నగదు చేతికి రాక అవస్థలు పడుతున్నారు. కంది పంట ఈ సీజన్‌లో 6.50 లక్షల ఎకరాల్లో సాగవ్వగా 16.50 లక్షల క్వింటాళ్ల దిగుబడి రావచ్చని వ్యవసాయ శాఖ అంచనా. మార్కెట్‌లో ఈఏడాది కంది మద్దతు ధర క్వింటాకు రూ.5450 కాగా వ్యాపారులెవ్వరూ రూ.5 వేలు కూడా ఇవ్వడం లేదు. రాష్ట్రంలో కందులకు పెద్దదైన తాండూరు మార్కెట్‌లో క్వింటాకు రూ.3900 నుంచి 4600 వరకూ ఇస్తున్నారు. రూ.4200 కన్నా ఎక్కువ ధర ఇచ్చిన కందులు స్వల్పంగా ఉంటున్నాయి. ఈ పట్టణంలో 'జాతీయ సహకార మార్కెటింగ్ సమాఖ్య' (నాఫెడ్) తరఫున మార్క్‌ఫెడ్ ఇటీవలే కొనుగోలు కేంద్రం ప్రారంభించింది.

సకాలంలో రైతులకు అందని సొమ్ము

రాష్ట్రంలో 4 లక్షల క్వింటాళ్ల కందులను మద్దతు ధరకు కొనాలని మార్కెటింగ్‌శాఖ గత నవంబరులో కేంద్రాన్ని అభ్యర్థించింది. కేంద్రం తరఫున నాఫెడ్ ముందుకొచ్చి హాకా, మార్క్‌ఫెడ్‌లను నోడల్ ఏజెన్సీలుగా నియమించింది. హాకా గతనెల 23 నుంచి 8 జిల్లాల్లో 47 కొనుగోలు కేంద్రాలు తెరిచి లక్ష క్వింటాళ్లను మద్దతు ధరకు కొంది. నాఫెడ్ నుంచి నిధులొస్తే వెంటనే రైతుల ఖాతాల్లో వేస్తామని చెబుతోంది. హాకా లేదా మార్క్‌ఫెడ్ కొన్న తరవాత కందులను గోదాములకు తరలించి అక్కడ నిల్వ రసీదులు తీసుకుని నాఫెడ్ హైదరాబాద్ కార్యాలయంలో అందజేయాలి. వాటిని దిల్లీలోని కేంద్ర కార్యాలయానికి నాఫెడ్ పంపాక నిధులు విడుదలవుతాయి. ఇప్పటికే హాకా రైతులకు రూ.54 కోట్ల దాకా బకాయి పడింది. ఇందులో రూ.25 కోట్లను తక్షణం విడుదల చేయాలని నాఫెడ్‌ను కోరింది. రాష్ట్రప్రభుత్వం ముందుగా కొన్ని నిధులిచ్చి హాకా, మార్క్‌ఫెడ్‌ల వద్ద పెడితే పంటను కొన్న వెంటనే రైతుల ఖాతాల్లో వేయడానికి సాధ్యమవుతుంది. నాఫెడ్ నుంచి వచ్చిన తరవాతే ఇస్తామని చెబుతున్నందున వారాల తరబడి జాప్యం జరుగుతోంది. ఇదంతా భరించలేక రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్మేసుకుంటున్నారు. క్వింటాకు రూ.వెయ్యిదాకా తక్కువ ఇస్తున్నా వెంటనే నగదు వస్తుందని వ్యాపారులకు ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. కిలో కందులకు రూ.40 వరకే రైతులకు ఇస్తున్నా పప్పు ధర మాత్రం చిల్లర మార్కెట్‌లో కిలో రూ.80కిపైగా ఉంటోంది.

మహిళా సమానత్వం లక్ష్యంగా సైకిల్ యాత్ర



రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: మహిళలు అన్నింటా సమానమేనని నిరూపించేందుకే సైకిల్ యాత్ర చేపట్టామని నేపాల్ నుంచి బయల్దేరిన యువతుల బృందం సమన్వయకర్త జిమిహిసే తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మీదుగా వెళ్తూ స్థానిక హుకుంపేటలో శనివారం బసచేసిన వీరంతా ఆదివారం ఉదయం తిరిగి విశాఖపట్నంవైపుగా బయల్దేరారు. ఆ సందర్భంగా జిమిహిసే మాట్లాడుతూ.. 200 మందితో బయల్దేరిన తమ యాత్ర అన్ని రంగాల్లో మహిళలకు దక్కుతున్న ప్రాధాన్యం గురించి తెలుసుకునేందుకేనని చెప్పారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లోని ప్రజల నుంచి సామాజిక అంశాలు, పాలిథిన్ తదితర కాలుష్య కారకాలు, మహిళా సాధికారత గురించి తెలుసుకున్నామని వివరించారు. రోజుకు 70 కిలోమీటర్ల చొప్పున ప్రయాణం చేస్తున్నామని, నేపాల్ నుంచి డిసెంబరు 23న మొదలుపెట్టిన యాత్ర డార్జిలింగ్ చేరుకోవడంతో పూర్తవుతుందన్నారు.

అపహరించిన పులిచర్మం



అపహరించిన పులిచర్మాన్ని చూపిస్తున్న నిందితుడు వెంకటస్వామి

మాయమైన పులిచర్మం లభ్యం

బెజ్జూరు, కాసిపేట గ్రామీణం, న్యూస్‌టుడే : బెజ్జూరు రేంజిలోని అటవీ బీట్ అధికారి క్వార్టర్ నుంచి మాయమైన పులిచర్మం ఎట్టకేలకు కాసిపేట మండల కేంద్రంలో ఆదివారం లభ్యమైంది. 2016 నవంబరు 21న గూడెం ప్రాంతం నుంచి ఇద్దరు వ్యక్తులు పులిచర్మాన్ని ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా బెజ్జూరు రేంజి పరిధిలోని హేటిగూడ సమీపంలో అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. బెజ్జూరు ఇన్‌ఛార్జి సెక్షన్ అధికారి వేణుగోపాల్‌రావు స్వాధీనం చేసుకుని, ఆ చర్మాన్ని సులుగుపల్లి బీట్ అధికారి బిజ్జూరి రవీందర్ క్వార్టర్‌లో భద్రపరిచారు. అయితే అది మాయమైనట్లు వెల్లడయింది. అటవీ శాఖ ఆధికారులు వేణుగోపాల్‌రావు, రవీందర్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన బెజ్జూరు పోలీసులు బీట్ అధికారి రవీందర్ భార్య బిజ్జూరి సౌందర్య, ఆమె సోదరుడు దుర్గం వెంకటస్వామి పులిచర్మం తీసికెళ్లినట్లు తేల్చారు. కాసిపేటలోని వారి బంధువు ఇంట్లో దాచిన పులిచర్మాన్ని స్వాధీనం చేసుకుని, విచారణ జరుపుతున్నారు.

నాగరాజు మృతికి ఔషధ ప్రయోగాలతో సంబంధం లేదు

కరీంనగర్ పోలీసు కమిషనర్ వెల్లడి

కరీంనగర్, న్యూస్‌టుడే: వివిధ శాస్త్రీయ పరిశోధనల ఫలితాల తుది నివేదికల ప్రకారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన వంగర నాగరాజు మృతికి ఔషధ ప్రయోగాలతో సంబంధం లేదని కరీంనగర్ పోలీసు కమిషనర్ వి.బి.కమలాసన్ రెడ్డి స్పష్టం చేశారు. గత సంవత్సరం జూన్ 2న జమ్మికుంట మండలం నాగంపేటకు చెందిన నాగరాజు మృతి చెందాడు. నాగరాజు కుమారుడు వంగర శ్రీనివాస్ తన తండ్రిపై ఔషధప్రయోగాలు చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయగా జమ్మికుంట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాకతీయ మెడికల్ కళాశాల, వరంగల్ ఫోరెన్సిక్ విభాగానికి చెందిన ఇరువురు ఆచార్యులు సమక్షంలో జూన్ 19న నాగరాజు మృతదేహాన్ని ఖననం చేసిన స్థలం నుంచి వెలికి తీసి శవ పరీక్షలు చేయించామని తెలిపారు. హిస్టోపెథాలజీ పరీక్షల నిమిత్తం పంపామన్నారు. ఆయా పరీక్షలు, అధికారులిచ్చిన నివేదికల ప్రకారం శరీరంలో ఎలాంటి విషపూరిత పదార్థాలు కనిపించలేదని నిర్ధారణకు వచ్చినట్లు పోలీసు కమిషనర్ వెల్లడించారు. ఈ కేసులో ఎలాంటి ఆధారాలు దొరకనందున కేసు తదుపరి పరిశోధన నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

పరోక్ష ఎన్నికలతో బలహీనవర్గాలకు అన్యాయం

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం

ఈనాడు, హైదరాబాద్ :తెలంగాణలో కొత్త పంచాయతీరాజ్ చట్టం కోసం రూపొందించిన నివేదికలో సర్పంచిని పరోక్షంగా ఎన్నుకోవాలని మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీని ద్వారా బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం పేర్కొంది. సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఇతర నేతలు ఆదివారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ పరోక్ష విధానం వస్తే డబ్బున్న ఉన్నత వర్గాల వారే పదవులను పొందే వీలుంటుందని తెలిపారు. పంచాయతీల్లో మళ్లీ దొరల రాజ్యం వస్తుందన్నారు.

ట్యాంకరు మునిగిన ఘటనలో 32 మంది దుర్మరణం!

- వారం రోజుల నుంచీ ఆరని మంటలు
- సాగరజలాల్లో విరజిమ్మిన చమురు



బీజింగ్: దాదాపు వారం రోజులుగా భగ్గున మండిపోతూనే ఉన్న ఇరాన్‌కు చెందిన భారీ చమురు ట్యాంకర్ ఆదివారం తూర్పుచైనా వద్ద సముద్రంలో నిలువునా మునిగిపోయింది. అందులో ఉన్న 32 మంది సిబ్బంది జీవించి ఉన్న ఆనవాళ్లే లేవు. వీరిలో 30 మంది ఇరాన్ దేశస్తులు కాగా...ఇద్దరు బంగ్లాదేశ్‌కు చెందినవారు. కడపటి వార్తలందేవరకూ సాగర జలాల నుంచి కేవలం మూడు మృతదేహాలు మాత్రమే అధికారులు స్వాధీనం చేసుకోగలిగారు. ఆదివారం మధ్యాహ్నం మూడుగంటల ప్రాంతంలో మునిగిపోయిన ఈ ట్యాంకర్ నుంచి విరజిమ్మిన చమురు సాగరజలాల ఉపరితలంపై భగ్గున మండిపోతూనే ఉన్నట్లు చైనాకు చెందిన ప్రభుత్వ సాగర పాలనాయంత్రాంగం(ఎస్‌వోఏ)ఆదివారం తెలిపింది. ఇరాన్ నుంచి ముడిచమురుతో బైలుదేరిన ఈ భారీ ట్యాంకరు ...తూర్పు చైనా సాగరజలాల్లో ఈనెల ఆరున హాంకాంగ్‌కు చెందిన సరకు రవాణా ఓడను ఢీకొంది. అప్పటి నుంచీ ఎడతెగని మంటల్లో చిక్కుకుపోయిన విషయం గమనార్హం.

పాత పంటకు కొత్త పాట!



బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి వారు చేస్తున్నది ఆహార భద్రత ఉద్యమం.

పంట పండించి కేవలం మన కడుపు నిండితే చాలదనే ఆలోచన వారిది. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలనే ఆరాటం వారిది. భూతల్లిని విషతుల్యంగా మార్చుతుంటే తట్టుకోలేక తల్లడిల్లే మనసులు వారివి. చేనుకొచ్చిన తమ పిల్లలు కడుపునిండా తినేందుకు అవసరమైన పంటలుండాలనే తలంపు వారిది. అందుకే 19 ఏళ్లుగా పాత పంటల జాతరను నిర్వహిస్తున్నారు.

అందరికీ పౌష్టికాహారం అందాలన్నా, భూసారాన్ని పరిరక్షించుకోవాలన్నా ఈ పంటలే శరణ్యమని చెబుతూ ఏటా వీరు ఊరూరా తిరుగుతారు. ఈ ఆదివారం మరోసారి జాతర మొదలైంది.

'మన చేలల్లో పాతపంటలేసుకోవాలె. యాపాకు బూడిద కలిపి ఈత గంపల్లో ఇత్తనాలు దాచుకోవాలే. పంటలకు పెంటెరువులు, జెర్రెల ఎరువులు ఎయ్యాలే.. పురుగులకు ఆకు కషాయాలు కొట్టాలే. దీంతో మనకు మస్తుగ లాభాలుంటాయి.. మనుషులకూ, పశువులకూ మంచి గ్రాసం దొరుకుతది.

Dwaraka

... (కలుషితం) కాకుండా మంచి గాలి వస్తది.. మన భూములు కరాబు (నిస్సారం) కావు' అంటూ వారు ఊరూరా ప్రచారం చేస్తారు. తమ చుట్టు పక్కల పత్తి పంట విస్తరిస్తున్నా వారు మాత్రం పాత పంటల సాగుకే జై కొడుతుంటారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం పస్తాపూర్‌లో వెలసిన దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) అండగా కొన్నేళ్లుగా ఈ ప్రాంత మహిళలు సేంద్రియ పంటల సాగుకే ప్రాధాన్యమిస్తున్నారు. కొర్రలు, సామలు, సజ్జలు, జొన్నలు, అవిసెలు, ఉలవలు, బొబ్బర్లు, రాగులు... ఇలా ఒక్కో మహిళా రైతు ఏడాదికి 40 వరకు పాత పంటలను తమ కమతాల్లో పండిస్తూ, ఈ పంటల సాగు ప్రాముఖ్యతను అందరికీ తెలియజేస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంతో పాటు రాయికోడ్ మండలం పరిధిలోని

అందంగా అలకరించిన పశువులు, చిరుధాన్యాల కంకులు, భద్రంగా దాచిన విత్తనాలు, కోలాటాలతో ఆకట్టుకునే పురుషులు, పాత పంటల సాగు ఆవశ్యకతను చెప్పేలా పాటలు పాడుతూ బండ్లకు తోవ చూపే మహిళలు... సంక్షిప్తంగా చెప్పాలంటే 28 రోజుల పాటు ఏడు మండలాల పరిధిలోని 38 గ్రామాల్లో కొనసాగే జాతర తీరిది. ఈనెల 14న ఝరాసంగం మండలం మాచనూరులో ప్రారంభమైన ఈ పండగ ఫిబ్రవరి 10న ఇక్కడే ముగుస్తుంది.యాత్ర సాగినన్ని రోజులు మహిళలు చిరుధాన్యాల సాగుపై చైతన్యం తెచ్చేలా పాటలు పాడుతారు. ఏ కాలంలో ఏ పంట వేయాలి. జెర్రెల ఎరువులు ఎలా సిద్ధం చేసుకోవాలి. ఎలాంటి కషాయాలు వాడాలి. ఇలా వీరు ఒక్కో అంశాన్ని పాట రూపంలోనే అందరికీ అర్థమయ్యేలా చెబుతారు. ఇలా దాదాపు 500 రకాల పాటలు అల్లేశారు.

గ్రామాల్లోని మహిళా రైతులు తమ చిన్న కమతాల్లో ఏటా దాదాపు 40 రకాల విభిన్న పంటలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తుంటారు. పంట కోతకొచ్చిన సమయంలో మేలైన విత్తనాలను గుర్తించి వాటిని భద్రపరుస్తుంటారు. ఇలా కొందరు మహిళా రైతులు ఏకంగా 80 రకాల విత్తనాలను దాస్తున్నారంటే ఆశ్చర్యమేస్తుంది. విత్తనాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఇక్కడ కనిపిస్తుంది. తమ పొలంలో ఎక్కువ రకాల చిరుధాన్యాల పంటలను సాగు చేసిన రైతులను గుర్తిస్తారు. వారికి బహుమతులు అందించడంతో పాటు సాగుకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తారు. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ మనం నడచుకోవాలనేది సంక్రాంతి పండగలో అంతర్లీనంగా ఉన్న సందేశం. వీరు ఇదే పండగ సందర్భంగా పాత పంటల జాతరను నిర్వహిస్తుంటారు.

– రాజేందర్ సురకంటి, ఈనాడు, సంగారెడ్డి

27 లక్షల కళ్లల్లో సంకురాత్రి!

సేవామృతం



❖ గ్రామీణ ప్రాంతాల నుంచి పేదలు నేరుగా శ్రీకిరణ్ కంటి ఆస్పత్రికి వచ్చేందుకు ఇబ్బంది లేకుండా ప్రాథమిక పరీక్షలు వారికి సమీప ప్రాంతంలోనే అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకోసం 10 శాఖల్ని ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో మండపేట, తుని, ద్రాక్షారామం, జగన్నాయక్‌పూర్, భానుగుడి, ముమ్మడివరం, పశ్చిమగోదావరి జిల్లాలో జువ్వలపాలెం, విశాఖ జిల్లాలో నర్సీపట్నం, నక్కపల్లి ప్రాంతాల్లో ఈ కేంద్రాలు సేవలందిస్తున్నాయి.

❖ తీవ్రమైన కంటి సమస్య ఉంటే వారిని ఉచితంగా వాహనాల్లో కాకినాడలోని శ్రీకిరణ్ కంటి ఆసుపత్రికి తరలిస్తారు. ఇక్కడకు వచ్చే రోగులకు వైద్యంతోపాటు వసతి, భోజన సదుపాయాలను ఫౌండేషనే చూసుకుంటుంది. 2001లో ఒకే ఏడాది 17,000 కంటి ఆపరేషన్లు నిర్వహించారు.

❖ శారదా విద్యాలయం పేరుతో ఇప్పటికీ పేదవారికి ఉచిత విద్య అందిస్తున్నారు. తెలుగు,ఆంగ్ల మాధ్యమాల్లో ఇక్కడ బోధన జరుగుతోంది. 192 మంది విద్యార్థులు ఇప్పుడు చదువుతున్నారు. ఇక్కడ చదువుకున్న ఒక విద్యార్థి ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేస్తుండగా మరికొంత మంది ఐటి రంగంలో రాణిస్తున్నారు. వీరు ఈ పాఠశాలలో చేరేనాటికి అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలకు చెందినవారే

❖ స్పందన పేరుతో ఎక్కడ ప్రకృతి వైపరీత్యం జరిగినా అభాగ్యులకు తాము అండగా ఉంటూ ఫౌండేషన్ తరుపున సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామాలకు వెళ్లి అక్కడ వైద్యం, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. దిల్లీ కేంద్రంగా ఉన్న గూంజ్ అనే సంస్థకు సంకురాత్రి ఫౌండేషన్ ద్వారా వాడేసిన వస్త్రాలను అందిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు ఇచ్చే బట్టలు ఈ సంస్థ సేకరించి ఢిల్లీకి పంపుతోంది. వారు అక్కడ రీసైకిల్ చేసి వాటిని నిరుపేదలకు పంపిణీ చేస్తుంటారు.

❖ చంద్రశేఖర్ సేవలకు గుర్తింపుగా దేశ, విదేశాల్లో ఎన్జీవోల నుంచి ఎన్నో అవార్డులు వచ్చాయి. ఐదేళ్ల క్రితం జాతీయ న్యూస్ ఛానెల్ సిఎన్ఎన్-ఐబిఎన్ ప్రకటించిన ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సీనియర్ సిటిజన్ అవార్డును అమితాబ్ చేతుల మీదుగా అందుకున్నారు. 2008లో సిఎన్ఎన్ రియల్ హీరోస్ కి భారత దేశం నుంచి నామినేట్ అయిన తొలి వ్యక్తి కూడా చంద్రశేఖరే.

❖ చిన్న పిల్లలకు ఇక్కడ ప్రత్యేక వైద్యం అందుతోంది. కంటికి సంబంధించి పిడియాట్రిక్ ఆప్తల్మాలజీలో సేవలందించేందుకు మహారాష్ట్రకి చెందిన డాక్టర్ అవినాష్ మహీంద్రకర్ ఇక్కడే ఉండి సేవలందిస్తున్నారు.

❖ దూరప్రాంతాల్లో ఉండే వారికి వైద్య సహాయం అందించేందుకు టెలి ఆప్తల్మాలజీ సర్వీసు ఉంది. నిపుణులైన వైద్యులతో శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి నుంచే గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రోగులకు వైద్య సేవలను అందిస్తున్నారు.

❖ కంటికి సంబంధించి జన్యుపరమైన సమస్యలు... నయం కాని మొండి వ్యాధుల మీద అధ్యయనం చేసేందుకు ఇటీవల పరిశోధన అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇలాంటి సమస్యలతో ఇబ్బంది పడే వారికి జన్యుపరమైన వైద్యం అందించేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేస్తున్నారు.

ఆరుగురు సిబ్బందితో మొదలైన శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి నేడు వందల మంది సాంకేతిక సిబ్బంది, వైద్యులతో పలు విభాగాల్లో సేవలందిస్తోంది. ఇక్కడ శిక్షణ పొందిన వైద్యసహాయకులు నేడు ప్రపంచమంతా సేవలందిస్తున్నారు. 392 మందికి కంటికి సంబంధించిన చికిత్సల్లో శిక్షణ ఇవ్వగా, 78 మంది నేత్ర వైద్యులను సంకురాత్రి ఫౌండేషన్ తయారు చేసింది. నిరుపేద కుటుంబాల్లో ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులను శ్రీకిరణ్ కంటి ఆసుపత్రికి తీసుకొచ్చి వారికి స్టైఫండ్, వసతి ఇచ్చి శిక్షణ నేర్పించే వారు. ప్రస్తుతం ఆప్తల్మాలజీలో పీజీ కోర్సును కూడా ఇక్కడ అందిస్తున్నారు.

- **27.71 లక్షల మందికి కంటి వైద్యం..**
- **2,44,293 మందికి కంటి శస్త్రచికిత్సలు...**
- **3,77,195 మంది స్కూలు పిల్లలకు వైద్య సేవలు...**
- **2685 మందికి విద్యా సదుపాయలు...**
- **568 మందికి ఉపకార వేతనాలు.**
- **2581 గ్రామాల్లో శిబిరాల ద్వారా సేవలు**

ఇది ఓ సేవా సంస్థ విశ్వరూపం...

విమాన ప్రమాదంలో మరణించిన తన భార్య, పిల్లల జ్ఞాపకార్థం చంద్రశేఖర్ తన ఇంటిపేరుతో ఏర్పాటు చేసిన సంకురాత్రి ఫౌండేషన్ ఎందరో జీవితాలను వెలిగిస్తోంది... సరిగ్గా 25 ఏళ్ల క్రితం ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన శ్రీకిరణ్ కంటి వైద్యాలయం లక్షల మంది కంటి దీపమైంది.

ఓ వ్యక్తి విషాదంలో నుంచి ఉద్భవించిన సేవా కుసుమం కథ ఇది...



☛ 1985.. జూన్ 23... కెనడాలోని మాంట్రియల్ ఎయిర్‌పోర్టు...

న్యూఢిల్లీ వెళ్లే విమానం కనిష్క బయలుదేరడానికి సిద్ధంగా ఉందని అనౌన్స్ చేయడంతో టెర్మినల్ అంతా సందడి...

'డాడీ త్వరగా రావాలి మరి'...అప్పటిదాకా సందడిగా ఎయిర్‌పోర్టు అంతా కలియ తిరుగుతున్న శ్రీకిరణ్, శారద ముఖాల్లో తెలియని దిగులు

వచ్చేస్తాన్రా... త్వరగానే వచ్చేస్తాగా... మంజరీ పిల్లలు జాగ్రత్త... కాకినాడ వెళ్లగానే ఫోన్ చెయ్యి.. అమ్మ వాళ్లను అడిగానని చెప్పు...

అందరినీ సముదాయించి విమానం ఎక్కిస్తున్నాడేగానీ, చంద్రశేఖర్‌కు కూడా చెప్పలేనంత ఆవేదన.

విమానం గాల్లోకి లేస్తుంటే ఏదో బాధ... ఎంత తొందరగా తాను కూడా కాకినాడ వెళ్లి వాళ్ల ముందు వాలిపోతానా అనే ఆలోచనలు మనసు నిండా... చంద్రశేఖర్ చాలా పట్టుదల ఉన్న మనిషి. సామాన్య మధ్య తరగతి కుటుంబంలో పుట్టిపెరిగినా అంచలంచెలుగా ఎదిగారు..

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల జువాలజీ లెక్చరర్‌గా పనిచేస్తూనే ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లారు. పీహెచ్‌డీ పూర్తి చేసి అక్కడ ఆరోగ్య మంత్రిత్వశాఖలో సైంటిఫిక్ ఎవాల్యుయేటర్ (శాస్త్రవేత్తగా) ఉద్యోగం సాధించారు..

బంగారంలాంటి కుటుంబం... మంచి ఉద్యోగం... ఇంటాబయట కావాల్సినంత పేరు ప్రతిష్ఠలు. ఎప్పటికైనా నా దేశం వెళ్లాలి... అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు నేను సైతం కృషి చేయాలన్న తపన.

... కాకినాడలో ఒక వివాహం కోసం భార్య మంజరి, కుమారుడు శ్రీకిరణ్, కుమార్తె శారదలను 1985 జూన్ 23న ఎయిర్ ఇండియా విమానం(కనిష్క) ఎక్కించారు. అటునుంచి అటే ఆఫీసుకు బయలుదేరిన చంద్రశేఖర్‌కు మనసంతా ఇవే ఆలోచనలు, జ్ఞాపకాలు...

విమానం బయల్దేరి నాలుగు గంటలైంది... ఈపాటికి లండన్ దరిదాపులకు చేరుకుని ఉంటారు...చంద్రశేఖర్ ఆలోచనలను భగ్నం చేస్తూ, ట్రింగ్.. ట్రింగ్...మంటూ ఫోన్... ఈ టైంలో ఎవరబ్బా...

'ఆర్ యూ మిస్టర్ చంద్రశేఖర్... ఉయ్ ఆర్ ఫ్రం ఎయిర్ ఇండియా'... అవతలి వారి గొంతులో ఏదో ఆందోళన...

'టెల్ మీ ప్లీజ్'...

అవతలి వ్యక్తి చెప్పిన విషయం విన్న చంద్రశేఖర్ గొంతు పూడుకుపోయింది. కాళ్లకింద భూమి కదలినట్లయింది...

లండన్‌కు చేరుకోవాల్సిన కనిష్క విమానం ఐర్లాండ్ సమీపంలో కూలిపోయింది. దుర్ఘటనలో విమానంలో ఉన్న 329 మంది దుర్మరణం పాలయ్యారు... వారిలో తన భార్యబిడ్డలు కూడా ఉన్నారు. ఇదీ అవతలి వ్యక్తి చెప్పిన విషయం...

☛ **1988... మూడేళ్లయింది వాళ్లు నా నుంచి దూరమై... ఇక ఎవరి కోసం చేయాలీ ఉద్యోగం...**

అసలెందుకీ జీవితం... ఇప్పుడు తల్చుకున్నా చంద్రశేఖర్‌కు కన్నీళ్లు ఆగడం లేదు. ఏం పాలుపోవడం లేదు... అయినవాళ్లు, స్నేహితులు ఎంతమంది చెప్పినా ఆవరించిన నైరాశ్యం ఏ కొంచెం కూడా తగ్గడం లేదు. అదుగో ఏదో అదృశ్యవాణి పిలుస్తోంది. అదే దైవ వాక్కా? లేదా అంతరాత్మ పిలుపా?

కెనడాలో ఉండి నేను చేసేదేం లేదు...

మంజరితో ఎప్పుడూ చెబుతుండే వాణ్ణి కొన్నాళ్ల తర్వాత సొంతూరు వెళ్లాలి... అక్కడి ప్రజలకు ఏదో చేయాలని...

అదే నా సంకల్పం...

ఇప్పుడు దారి దొరికింది... గుండె దిటవవుతోంది...

☛ 1989.. కాకినాడ దగ్గర్లో సంకురాత్రి ఫౌండేషన్ ప్రారంభోత్సవం...

'ఇలాంటివి ఎందుకు?'... 'ఆ డబ్బులన్నీ తగలేసేలా ఉన్నావ్'... చాలామంది కుటుంబ సభ్యులు ఎన్ని విమర్శలు చేసినా చంద్రశేఖర్ మారలేదు...

గుండెల్లో భార్యపిల్లలు... కళ్లల్లో పేదలకు సేవా కాంతులు... పెనుమర్తి రహదారిలో ఐదు ఎకరాల స్థలం కొనుగోలు చేసి 1989లో ఫౌండేషన్ స్థాపించారు.

అలా ఓ సదాశయానికి తొలిఅడుగు పడింది.

ఆ ఐదెకరాల్లో తనకో ఇల్లు, ఒక అనాథశరణాలయం ఇదీ ఆలోచన.

ఆ ప్రయత్నాల్లో చుట్టుపక్కల తరచి చూస్తే పేదలు, వారి పిల్లలు. పొలాల్లో పని చేస్తూ చిక్కిశల్యమైపోతున్న ఆ బాల్యానికి కాసింత ఆసరా కల్పిస్తే...

ప్లాన్ మారింది అనాథ శరణాలయం బదులు ఓ స్కూల్... చదువు, పుస్తకాలు, ఫీజులు అన్ని బాధ్యతలు తనవే...

రాజమహేంద్రవరంలో చిన్ననాటి స్నేహితుడుండేవాడు... వాడ్రేవు కామరాజు అని... అప్పటికే అమెరికాలో కంటి వైద్యనిపుణుడిగా పనిచేస్తున్నారు. ఆయన అప్పుడప్పుడూ ఇండియాకు వచ్చి కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తుంటారు... దీనికోసం ప్రత్యేక పరికరాలు కొనుగోలు చేయడం, వాటిని ఎక్కడో ఒక చోట పెట్టి అమెరికా వెళ్లి మళ్లీ వచ్చాక అవి పనికి రాకుండాపోవడం, పాడైపోవడం లాంటివి జరిగేవి. ఇదే విషయాన్ని ఒక సందర్భంలో చంద్రశేఖర్‌తో ప్రస్తావించారు.

☛ **1993 జనవరి 21న అనాథ శరణాలయ భవనం కాస్తా శ్రీకిరణ్ కంటి ఆసుపత్రిగా మారింది.**

అప్పట్లో కాకినాడ ఇప్పుడున్నంత అభివృద్ధి చెందలేదు. ఫౌండేషన్ ఉన్న ప్రాంతమంతా దూరంగా విసిరేసినట్లుండేది.


అక్కడ ఆస్పత్రి ఉందని, ఉచితంగా వైద్యం చేస్తారని ఎవ్వరికీ తెలియదు.

కానీ ఎలాగైనా అందరికీ చేరువవ్వాలి. సాధ్యమైనంత ఎక్కువ మందికి సేవ అందాలి...

ఈ పరిస్థితులను సవాలుగా తీసుకున్న చంద్రశేఖర్ గ్రామాల్లో వైద్య శిబిరాలు పెట్టారు. కంటి చూపుతో ఇబ్బందిపడుతున్న వారికి అన్నీ తానై ఉచిత వైద్యం అందివ్వడం ఆనోటా ఈనోటా ప్రాచుర్యంలోకి తెచ్చారు.

ఇప్పుడు మనం చూస్తున్న ఈ సేవా ప్రపంచం వెనకున్న మానవతా మూర్తి కథ ఇది...

–నాదెళ్ల తిరుపతయ్య, ఈనాడు, కాకినాడ



ఈ 25 సంవత్సరాలు ప్రయాణంలో ఎంతో మంది సహాయం చేశారు. రోగులు ఎంతో నమ్మకంతో వచ్చి మాసేవలు తీసుకున్నారు. ఎంతో మంది వైద్యులు, మిత్రులు, సిబ్బంది పనిచేశారు. ఫౌండేషన్‌తో అనుబంధం ఉన్న వారిని ఒకసారి గుర్తు చేసుకునేందుకు ఈనెల 19,20,21 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రతి నిరుపేదకు ప్రాథమిక కంటి వైద్యం అందేలాచూడటం, పరిశోధన ఫలాలు తరువాతి తరాలకు అందించడం, నైపుణ్యం ఉన్న సిబ్బందిని తయారు చేయడం నా లక్ష్యాలు.

– చంద్రశేఖర్, సంకురాత్రి ఫౌండేషన్



1.50 కోట్ల చేపల ఖజానా!





చేపలను అక్వేరియంలో పెంచుతారు... అందం కోసం... పెద్దఎత్తున చెరువుల్లో పెంచుతారు... వ్యాపారం కోసం.. ఆయన మాత్రం ఇంట్లో ఓ మత్స్య ప్రపంచాన్ని సృష్టించారు... కేవలం అభిరుచితో.. అదీ లక్షలు ఖర్చు చేసి... ఇది విశాఖపట్టణానికి చెందిన రాజాబాబు సరదా కథ... ఇప్పుడాయన ఇల్లు ఖరీదైన చేపల ఖజానా

విశాఖ నగరానికి చెందిన రాజాబాబు రొయ్యల హేచరీలు నిర్వహించేవారు. అందులో భాగంగా పలు రొయ్యలు, చేపల జాతులపై అధ్యయనం చేయడం, పలు మ్యాగజీన్లలో అందమైన చేపలెన్నిటినో చూడడంతో తాను కూడా మంచి జాతుల చేపలను పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడాయన దగ్గరున్న చేపలన్నీ కలిపి రూ.1.50 కోట్లకు పైగా ఖరీదు చేస్తాయని అంచనా. మరింత ఖరీదైన చేపలు ఎక్కడబడితే అక్కడ పెరగవు కదండీ... ఒక్కో జాతి చేపలకు ఒక్కో రకమైన వాతావరణ పరిస్థితులు, ఆహారం, నీటిలో ఆక్సిజన్ శాతం అవసరమవుతాయి. దీంతోపాటు వాటిని ఉంచిన తొట్లను కూడా పరిశుభ్రంగా ఉంచకపోతే వ్యాధుల బారిన పడే అవి చనిపోయే ముప్పు పొంచి ఉంటుంది. ఇందుకోసం ఆయన సమస్త జాగ్రత్తలు తీసుకున్నారు. అధునాతన ఆటోమేటిక్ క్లీనింగ్ యంత్రాలను ఏర్పాటుచేశారు. యు.వి.సి. అయనైజర్లు ఏర్పాటుచేసి వైరస్ పెరగకుండా చర్యలు తీసుకున్నారు. చేపల విసర్జితాలను ఆహారంగా ఉపయోగించుకుని ఎదిగే మొక్కలను పెంచుతున్నారు. ఒక్కోజాతి చేపలకు ఒక్కో తొట్టెను నిర్మించారు

ఇందుకోసం సుమారు రూ.50లక్షల వరకు వెచ్చించారు. సుమారు 20 జాతులకు చెందిన ఆరువేల చేపలు ప్రస్తుతం ఆయన వద్ద కొలువు దీరాయి.

- చైనీయులు లక్కీఫిష్‌గా పరిగణించే ఆరొవనా రకం చేపను చైనా నుంచి ఒకొక్కటి రూ.2.5లక్షల చొప్పున 13 చేపలను కొనుగోలు చేశారు. అనంతరం అవి పిల్లలు పెట్టడంతో వాటి సంఖ్య 21కి చేరింది. నీటి ఉపరితలం నుంచి ఆరడుగుల ఎత్తు వరకు ఎగరగలగడం ఈ చేప విశిష్ఠత. లక్కీఫిష్ చేప బొమ్మలను కూడా పలువురు ఇళ్లలో పెట్టుకునే సంప్రదాయం ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో ఉంది.
- రంగురంగుల రూపాల్లో అత్యంత అందంగా కనిపించడమే కాకుండా పళ్లు లేకుండా ఉండే కొయికార్ప్ చేపలను జపాన్ నుంచి తెప్పించారు. ఈ చేపలకు అందించే ఆహార గుళికల్ని చేతులతో పట్టుకుని నీళ్లలో పెడితే అవి చక్కగా వచ్చి తింటాయి.
- ఎలక్ట్రిక్ ఈల్ అనే చేపను దక్షిణమెరికా నుంచి ఒకొక్కటి రూ.40వేల ధర వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ చేప 600వాట్స్ విద్యుత్‌షాక్ సమానమైన షాక్‌ను విడుదల చేస్తుంటుంది.
- ఊసరవెల్లి తరహాలో రంగులు మార్చుకునే జాతి చేపల్లో కూడా ఉంది. ఆస్కార్ పేరున్న ఈ చేపలను దక్షిణఅమెరికా నుంచి తెప్పించారు.
- పట్టుకున్న వెంటనే ముళ్ల బాలు తరహాలో మారిపోయే పఫర్ చేప, మొసళ్లను తలపించేలా ఉండే అరాపిమా చేపలు, మొసలి నోటిని తలపించేలా ఉండే అలిగేటర్‌గేర్ చేపలు, గుంపులుగా వాయువేగంతో ప్రయాణించే టిన్‌ఫాయిల్‌బార్బ్ చేపలు, మనుషుల్ని గుర్తుపట్టే గొరామీ చేపలు, పైనుంచి చూస్తే రాయి రూపంలో ఉండే చేపలు, అత్యధిక వేగంతో నీటిని కీటకాలపై విసిరి వాటిని చంపే ఆర్చర్ చేపలు, తోక భాగంలో విషం ఉండే స్టింగ్రే చేపలు తదితరాలెన్నింటినో ఆయన పెంచుతున్నారు.

–బి.ఎస్.రామకృష్ణ, ఈనాడు, విశాఖపట్టణం

పండగ వేళ...చంద్రకళ



మహారాష్ట్రలో సంక్రాంతిని కాస్త విభిన్నంగా జరుపుకొంటారు. మన దగ్గర నలుపు రంగును అశుభం అనుకుంటాం. కానీ అక్కడ కొన్ని ప్రాంతాల్లో నలుపు రంగు దుస్తులు ధరిస్తే అశుభానికి వీడ్కోలు చెప్పి, శుభాన్ని ఆహ్వానిస్తున్నట్లుగా భావిస్తారు. అందుకే పండగ రోజు చంద్రకళ పేరుతో నలుపు రంగు చీరలు ఎక్కువగా కట్టుకుంటారు. వాటి మీద సాధారణంగా నక్షత్రాలూ, నెలవంక ఆకారాలు తెలుపు రంగులో ముద్రించి ఉంటాయి. అలాగే ఈ పండగ చలికాలంలో వస్తుంది కాబట్టి నలుపు రంగు దుస్తులు వేసుకోవడం వల్ల శరీరానికి వెచ్చదనం అందుతుందని కూడా అనుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో సుగాడ్ పేరుతో మరో వేడుక ఉంటుంది. మట్టి కుండల్లో చెరకుముక్కలూ, రేగుపండ్లూ, బియ్యం, పసుపు వేసి చుట్టుపక్కలవారికి ఇస్తారు. అలాగే కొత్త పెళ్లికూతురు కోసం ప్రత్యేకంగా ఓ కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. నువ్వులూ, పంచదార పాకం కలిపి చేసిన ఆభరణాలతో ఆ వధువును ముస్తాబు చేస్తారు. వారికి స్వాగతం పలుకుతున్నట్లుగా భావిస్తారు.

నట్టింట పూలరెక్కలూ... రంగురాళ్లు!

పండగరోజు వాకిట్లో ముగ్గులు పెట్టడమే కాదు ఇంటిలోపల కూడా అక్కడక్కడా చిన్న చిన్న ఏర్పాట్లు చేస్తే ఇంటికి కొత్త కళ వస్తుంది. మన దగ్గరున్న వస్తువులతోనే ఆ ఏర్పాట్లు ఎలా చేసుకోవచ్చో చూద్దాం.



- గాజు గ్లాసులో నీరు పోసి అందులో ఫ్లోటింగ్ క్యాండిల్ పెట్టండి. ఇప్పుడు కాస్త మందంగా ఉండే తాడు తీసుకొని దానికి రంగులు అద్దండి. దీన్ని గ్లాస్ చుట్టూ చుట్టి అంటించాలి. ఇలాంటివి నాలుగైదు తయారు చేసి అక్కడక్కడా పెడితే అందంగా కనబడతాయి.
- ఇంట్లో గది మూలల్ని కూడా ఖాళీగా వదిలేయాలని లేదు. అక్కడ ఆకర్షణీయంగా కనబడే ఒక పళ్లెం తీసుకొని దాంట్లో నీరు పోసి పూలరెక్కలు వేయండి. మధ్యలో ఒక చిన్న దీపం పెడితే రాత్రివేళల్లో ముచ్చటగా ఉంటుంది.
- పళ్లెంలో ముగ్గు వేసి నీరు పోయాలనుకుంటున్నారా.. అది చెదిరిపోకుండా ఉండటానికి చిన్న చిట్కా తెలిస్తే చాలు. మొదట స్టీలు ప్లేటు తీసుకొని దానికి కాస్త నెయ్యి, లేదంటే నూనె రాయాలి. ఇప్పుడు దానిమీద ముగ్గు వేయాలి. కాసేపయ్యాక నెమ్మదిగా నీరు పోసి చూడండి. అసలు చెదిరిపోదు. కావాలనుకుంటే ఇందులోనూ కొవ్వొత్తి అమర్చుకోవచ్చు.
- వాడని గోళ్ల రంగు ఉంటే దాన్ని కూడా అలంకరణకు ఉపయోగించొచ్చు. సరైన ఆకారం లేని రాళ్లు కొన్ని తీసుకొని వాటికి గోళ్ల రంగు వేయాలి. ఇవి చూడటానికి మెరుస్తుంటాయి. వీటిని ముగ్గులోనో, లేదంటే ఇంట్లో అక్కడక్కడా వరుసలా పెట్టుకోవచ్చు.
- రంగురంగుల గాజు కప్పుల్లో రకరకాల పూలరెక్కలు నింపి.. అక్కడక్కడా అమర్చినా చూడ్డానికి బాగుంటుంది. లేదా నవధాన్యాలను సీసాలో పోసి.. భోజనాలబల్లపై పెట్టినా చాలు.

నజరానా

పొంగలి లేదా తీపిపదార్థాల తయారీలో బెల్లం పాకం పడుతున్నారా... అందులో కొద్దిగా నెయ్యి వేయండి. రుచే కాదు.. సువాసనా ఉంటుంది.

మన జీవితం ఎంతగా నగరమయమైనా.. సంక్రాంతి మాత్రం తన సంప్రదాయాన్ని ఎంతోకొంత నిలుపుకొంటూనే ఉంది. దాన్నలా నిలుపుతున్న ఘనత మహిళలదే! పరికిణీ ఓణీ రెపరెపలూ, హరివిల్లు వర్ణాల ముగ్గులు లేనిదే సంక్రాంతికి అందమెక్కడిది? దుస్తులపై మక్కువలో ఎప్పుడూ ఎక్కువతక్కువలుంటాయి. మారుతుంటాయి. కానీ ముగ్గులపై మొగ్గు ఎన్ని తరాలైనా చెక్కు చెదరడంలేదు. ఇప్పుడే కాదు అనాదికాలం నుంచి వాటిని తెలుగు స్త్రీలు ఎంతగా కాపాడుకుంటూ వస్తున్నారో, ఒకప్పుడు జీవితంతో వాటిని ఎంత వైవిధ్యంగా మేళవించారో ఓ పెద్ద పరిశోధనే చేశారు రావి ప్రేమలత! మన ముగ్గులపై ఆమె రాసిన 'తెలుగు స్త్రీల చిత్రలిపి' పుస్తకం.. తెలుగులో అపూర్వమైందే కాదు అపురూపమైంది కూడా! సంక్రాంతి సందర్భంగా ఆ పరిశోధనా అనుభవాలని వసుంధరతో ప్రత్యేకంగా పంచుకున్నారామె..



...అందుకే ముగ్గేయమంటోంది సంక్రాంతి!

మాది భువనగిరి దగ్గర ఓ చిన్నపల్లెటూరు. అందరి పిల్లల్లాగే అమ్మ, పిన్నీ, అత్తయ్యలు ముగ్గులు వేయడం చూస్తూ పెరిగినదాన్ని. పెద్దయ్యాక కూడా ఆ ముగ్గులపై అంతగా దృష్టిపోలేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పని చేస్తున్న రామాచంద్ర కాలేజీలో అధ్యాపకురాలిగా ఉండేదాన్ని. 1990లలో దాదాపు జీవితం నగరానికే పరిమితమయ్యాక.. ఒక్కసారిగా నా దృష్టి ముగ్గులపై పడింది. పరిశోధకురాలిని కాబట్టి వాటి ఆవిర్భావం, విభిన్నతపై దృష్టిపెట్టాను. తెలంగాణా, ఆంధ్రాప్రాంతాల్లో విరివిగా పర్యటించాను. హైదరాబాద్‌లోని ఇతర దక్షిణాదివారూ, మరాఠీలూ, బెంగాలీల ముగ్గులనీ చూసే అవకాశం వచ్చింది. ఆరునెలల నా పరిశీలనలనే పుస్తకంగా రాశాను!

ఎన్నెన్ని విచిత్రాలో..

ఇప్పుడైతే మనకి క్యాలెండర్‌లూ, గడియారాలు వచ్చాయి. అవన్నీ లేని సమయంలో స్త్రీలు వేసే ఈ ముగ్గులే కాలసూచికగా ఉండేవి! మన తెలుగుప్రాంతంలో వారంలో ఏడురోజులకి ఏడురకాల ముగ్గులుండేవి. పూజాగదిలో వాటిని చూసే ఇంట్లోని మగవారు.. వారాలని గుర్తుపెట్టుకునేవారట. అంతేకాదు.. ప్రతిరోజూ సూర్యోదయం, మధ్యాహ్నం, సాయంత్రాన్ని సూచించేలా కూడా వీటిని వేసేవారు. సూర్యోదయాన్ని సూచిస్తూ ఉదయం వేళ పొడవాటి ముగ్గునే వేసేవారు. దానిపై పడే సూర్యుడి నీడని బట్టి సమయంపై అంచనాకి వచ్చేవారు. సాయంత్రం వేళ సూర్యుడు చిన్నబోతాడు గనుక చిన్నముగ్గు వేసేవారు. నిజానికి.. అప్పటి నుంచి ఇప్పటిదాకా స్త్రీలు ప్రతిముగ్గులోనూ సూర్యుడికి ఏదోరకంగా ప్రాతినిధ్యం కల్పిస్తూనే ఉన్నారు. మనం వేసే పద్మం, స్వస్తిక్ ఆకారాలు ఆయనకి సూచనలే. వాటన్నింటికీ పరాకాష్ఠ సంక్రాంతికి వేసే రథం ముగ్గు. సూర్యుడి రాక, పోకని సూచించే చిత్రలిపి వైభవం ఇది. ఆ తర్వాత మన స్త్రీలు ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చింది చంద్రుడికి! చంద్ర కాంత హెచ్చుతగ్గుల్ని సూచించే అన్ని ముగ్గులూ మనకున్నాయి.. ఒక్క అమావాస్యకి తప్ప! తర్వాత శివుడూ.. మన తెలుగమ్మాయిల ముగ్గుల్లో పాము రూపంలో కనిపిస్తుంటాడు. ఇక వృత్తిపరమైన ముగ్గుల్లో ప్రధాన పాత్ర వ్యవసాయానిదే. గుమ్మడి పువ్వు, చెరకుగడల ద్వారా ముగ్గుల్లో వ్యవసాయం ఇప్పటికీ తన ఉనికిని చాటుకుంటూనే ఉంది.

సుఖప్రసవానికీ..

కాలాలకి సంబంధించిన విషయాలకే కాదు.. ఇంట్లోని సుఖదుఃఖాలనీ ముగ్గులతో సూచించారు మనవాళ్లు. ఇంట్లో ఉన్న గర్భవతికి సుఖప్రసవం కావాలని పద్మవ్యూహం ముగ్గు వేస్తారు. అంటే అభిమన్యుడికి సూచనగానన్నమాట! పద్మవ్యూహంలాంటి కాన్పు దశ దాటుకుని.. బిడ్డ అభిమన్యుడిలా కాకుండా బయటకు రావాలనే కోరిక అది. దుష్టశక్తులని పారదోలే బ్రహ్మముడి ముగ్గులూ మనకున్నాయి. మా చిన్నప్పటి దాకా కూడా తెల్ల ముగ్గులు వేసేవారు. ఎందుకండీ అంటే.. ఇంట్లో కష్టాలు తీరడానికని చెప్పేవారు! చదరంగం ముగ్గులూ, తాడాట ముగ్గులూ మామూలుగా కనిపించేవి. ఇవన్నీ ఒకెత్తయితే యోగశాస్త్ర, వాస్తుశాస్త్ర ముగ్గులు మరొక ఎత్తు. వాటి వెనక ఎంతో గణితం ఉండేది! కానీ అక్షరాలు కూడా నేర్వని ఆడవాళ్లు అలవోకగా దాన్ని వేయడం చూస్తే.. 'ఔరా' అనిపిస్తాయి! నిజానికి.. యజ్ఞవాటికల ముందు వేసే మండల గుర్తులే ఇలా ముగ్గులుగా మారి ఉంటాయనీ ఓ వాదన ఉంది. ఇంటి శుభ్రత, సంక్షేమం బాధ్యత స్త్రీలదే కాబట్టి వాళ్లే దాన్ని సొంతం చేసుకున్నారని చెప్పాలి! అవే చుక్కల ముగ్గులుగా, ముత్యాల ముగ్గులుగా, గీతలుగా మారాయి.

– జె. రాజు



ఉన్న ప్రాంతాన్నిబట్టే..

మీరో విషయం గమనించారో లేదో! మహారాష్ట్ర వాళ్ల ముగ్గులు ఎక్కువగా జ్యామెట్రికల్‌గా ఉంటాయి. బెంగాల్‌వాళ్లవి అలల్లా కనిపిస్తాయి. కారణమేంటీ? మహరాష్ట్ర ప్రాంతంలో కొండలెక్కువ కాబట్టి ముగ్గులూ వాటినే ప్రతిరూపాలుగా మార్చుకున్నాయి. బెంగాల్‌లో సుదూరం వరకూ సముద్రం కదా! అందుకే ఆ అలలు. మన దక్షిణాది ప్రాంతంలో ఇవి రెండూ ఉంటాయి.

రోజూ వేయండి..!

మీకో విషయం తెలుసా? పాశ్చాత్యదేశాల్లో స్త్రీలు, పురుషులనే తేడాలేకుండా ముగ్గులు వేస్తున్నారిప్పుడు! కాకపోతే నేలపై కాదు.. పుస్తకాల్లో. ఇలాంటి ముగ్గులు ఏకాగ్రతతో వేయడంవల్ల ఎంతో మానసిక ప్రశాంతి ఉందని వాటిని సిఫారసు చేస్తున్నారు అక్కడి మానసిక శాస్త్రవేత్తలు. మానసిక నిపుణులకి ఆదిగురువుల్లో ఒకరైన సీజీ యుంగ్ చేసిన సూచన ఇది! ఎవరీ యుంగ్? ప్రఖ్యాత మానసిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ శిష్యుడు. మన దేశంలోని పతంజలి యోగ సూత్రాలపై దృష్టిసారించినవాడు. అప్పుడే ఆయనకి చైనా, భారతదేశాల్లోని 'మండలాల' గురించి తెలిసింది. మన పూజల్లో వాడే యంత్రాలూ, రేఖలు ఇవన్నీ కూడా మండలాలకిందే వస్తాయి. విశ్వస్వరూపమైన బ్రహ్మని.. ఇలా మండలాలుగా మార్చుకుని భారతీయులు దాన్ని తమ అచేతనలోకి(సబ్‌కాన్షియస్) తీసుకెళ్తున్నారని ప్రపంచానికి తొలిసారి చెప్పింది సీజీ యుంగే! ఆయన శిష్యప్రశిష్యులు ఆ మండలాలపై చాలా పరిశోధన చేసి.. ఇప్పుడు మానసిక ప్రశాంతతకి వాటినే గీయాలని సిఫారసు చేస్తున్నారు. ఈ సంక్రాంతి నుంచి రోజూ ఏదోరకం ముగ్గు వేసి చూడండి.. అదే ఓ ధ్యానంలా మారుతుంది!!

కరవు ప్రాంతంలో... జెర్బరాలవాన!

పెళ్లిళ్లూ, శుభకార్యాలూ, సమావేశాలు.. ఇలా ఏ వేడుకయినా.. పూల అలంకరణకు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. దాన్ని గుర్తించిన సంధ్యారాణి జెర్బరా పూలను పెంచుతూ ఆదాయం పొందుతోంది. మరికొందరికీ ఉపాధీ కల్పిస్తోంది.







సంధ్యారాణిది జనగామ జిల్లా లింగాలఘణపూర్ మండలం సిరిపురం. చదివింది బీఎస్సీ. భర్త నీటిపారుదలశాఖలో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా చేసి పదవీవిరమణ పొందారు. కొన్నాళ్లక్రితం నెదర్లాండ్స్ వెళ్లిన ఆమె అక్కడ జెర్బరా పూల సాగు గురించి తెలుసుకుంది. అలా తానూ పెంచాలనుకుంది. కానీ జనగామ కరవు ప్రాంతం. ఉన్న రైతులే బతుకుతెరవు కోసం నగరాలకు వెళ్లిపోతున్న పరిస్థితి. అయినా కూడా బిందుసేద్యం పద్ధతిలో ఆ పూలను పెంచాలనుకుంది. ఆలోచన వచ్చాక ఆ పూల పెంపకంపై కాస్త అవగాహన పెంచుకున్న ఆమె.. తనకున్న ఇరవై ఎకరాల్లో భూసార, నీటి పరీక్షలు చేయించింది. పూల సాగుకు అవసరమైన ఎర్రమట్టిని తెప్పించింది. అలాగే జెర్బరా మొక్కల్ని పుణె నుంచి తెప్పించి ఎకరం స్థలంలో పెంచడానికి సిద్ధమైంది. పూల మొక్కల కోసం అవసరమైన బెడ్‌లను, పాలీహౌస్‌నూ ఏర్పాటు చేసుకుంది. ఎకరం పాలీహౌస్‌కి నలభై లక్షల రూపాయలు ఖర్చయితే అందులో డెబ్భైఅయిదు శాతం ప్రభుత్వం రాయితీ ఇవ్వగా, మిగిలిన డబ్బును రుణంగా తీసుకుని ఆ పూలను పెంచడం మొదలుపెట్టింది.

వాడిపోయేవి... పూలు వచ్చి కోసిన తరవాత చాలా తక్కువ సమయంలోనే వాడిపోయేవి. ఈ సమస్యను గుర్తించాక వాటికి ప్లాస్టిక్ కవర్లు వేసి ఎనిమిది లేదా పది పూల చొప్పున కట్టడం మొదలుపెట్టింది. మొదట్లో వాటిని ఎక్కడ అమ్మాలో తెలిసేది కాదు. క్రమంగా ఆ మెలకువలూ నేర్చుకుంది సంధ్యారాణి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌కు ఈ పూలను అందిస్తోంది. అయితే ఈ మొక్కలకు చీడపీడలు కాస్త ఎక్కువే. వాటి నివారించేందుకు రసాయన ఎరువులతోపాటూ గోమూత్రాన్నీ వాడుతుంది. 'సీజను ఉన్నప్పుడు ప్రతి పువ్వు ఎనిమిది నుంచి పది రూపాయల వరకూ ఉంటుంది. లేనప్పుడే తక్కువకు అమ్మాల్సి వస్తుంది. ప్రస్తుతం నెలకు దాదాపు మూడున్నర లక్షల రూపాయల ఆదాయం వస్తోంది. ఒక్క కోతకు ఎనిమిది వేల పూలు తెంపుతాం. వాటిని అట్టపెట్టెల్లో సర్దేందుకు రోజూ పదిహేను మంది పనిచేస్తారు. వారిలో మహిళలే ఎక్కువ. నా వల్ల మరికొందరికి ఆదాయం అందుతున్నందుకు ఆనందంగా ఉంది...' అని చెబుతుంది సంధ్యారాణి.

– **జ్యోతికిరణ్,** ఈనాడు పాత్రికేయ పాఠశాల.

రంగవల్లిక



ఈ చుక్కల్ని గోపురంలా వచ్చేలా పెట్టుకోవాలి కాబట్టి.. అడుగునుంచీ మొదలు పెట్టాలి.

అడుగున 29 చుక్కలు పెట్టాలి.

సరిచుక్క పద్ధతిన రెండువైపులా 27, తరువాత 25 చుక్కలు పెట్టాలి.

ఇప్పుడు మొదటి 3 చుక్కలు కాకుండా తరవాతి 3 చుక్కల్ని II వరుసలు పెట్టాలి.

ఇదేవిధంగా ఇంకోవైపు చేయాలి.

ఇప్పుడు కొద్దిగా వదిలేసి మళ్లీ 29- 27- 25 చొప్పున సరిచుక్కలు రెండువైపులా పెట్టాలి.

తరువాత గోపురంలా రావడానికి పైభాగాన I చుక్క వచ్చేవరకు సరిచుక్కలు పెట్టుకుంటూ వెళ్లాలి.



అన్ని అర్హతలు, అద్భుత పర్సంటేజీలు ఉన్నాయి. అలా అప్లై చేస్తే ఇలా జాబ్ అనుకున్న నితిన్‌కు అన్ని చోట్లా నో రెస్పాన్స్. ఎక్కడ లోపమో ఎంతకీ తేలక నిపుణులను సంప్రదించాడు. నీ గురించి నువ్వు సరిగా చెప్పుకోవడం లేదని వాళ్లు తేల్చేశారు. అంటే రెజ్యూమే వీక్ అని వివరించారు. అభ్యర్థులందరి గురించి అంతా ఆరా తీసే సమయం సంస్థలకు ఉండదు. అప్లై చేసిన ఉద్యోగానికి మీరు ఎంత సూటబుల్ అనేది మీరే మార్కెట్ చేసుకోవాలి. మీరు రెజ్యూమే సంధిస్తే ఆఫర్ లెటర్ అంతే స్పీడ్‌తో వచ్చేయాలి.

సరిగా సంధిస్తే విజయమే!



సర్వేష్ అగర్వాల్
సీఈఓ, ఇంటర్న్‌శాల

ఉద్యోగం లేదా ఇంటర్న్‌షిప్‌ను కోరుకునేవారిపై సంస్థలకు 'ఫస్ట్ ఇంప్రెషన్' ఏర్పరిచేది.. రెజ్యూమేనే! సాధారణంగా ఆ మొదటి ముద్రే చివరివరకూ కొనసాగుతుంది కూడా. పరిమిత ఉద్యోగాలూ.. భారీ పోటీ ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో రెజ్యూమేనూ, ఫలానా సంస్థలో పని చేయడానికి తమకున్న ఆసక్తిని తెలిపే కవర్ లెటర్‌నూ మెరుగ్గా రాయటం చాలా అవసరం.

ఇంటర్న్‌షిప్‌లకూ, ఉద్యోగాలకూ దరఖాస్తు చేసుకోవడానికి కావాల్సిన అతి ముఖ్యమైన డాక్యుమెంట్లలో రెజ్యూమే ఒకటి. ఇది 1-2 పేజీల్లో అభ్యర్థి చదువు, ఉద్యోగానుభవం, సాధించిన విజయాలు, స్కిల్స్, ప్రాజెక్టుల వివరాల సారాంశం తెలుపుతుంది. ఒకరకంగా అభ్యర్థికి సంబంధించిన కీలక సమాచారాన్ని అందిస్తూ, ఫలానా స్థానానికి అతడు ఎంతవరకూ అర్హుడో సంస్థకు తెలియజేయడంలో ఇది సాయపడుతుంది.

ప్రభావపూరిత రెజ్యూమే తయారీలో కింది మార్గదర్శకాలు సాయపడతాయి.

1 ఫస్ట్‌లుక్ అదిరిపోవాలి!

సరాసరిన ఒక రెజ్యూమేను చూడటానికి నియామక సంస్థ ప్రతినిధులు కేటాయించే సమయం పది సెకన్లు మాత్రమే. అభ్యర్థి సంబంధిత ఉద్యోగానికి గొప్ప అర్హతలు కలిగివున్నా, సరిగ్గా ప్రెజెంట్ చేయకపోతే దాన్ని సమగ్రంగా చూసే అవకాశాలు తక్కువ.

- సరళంగా, స్పష్టంగా ఉండే టైమ్స్ న్యూ రోమన్, ఏరియల్ వంటి ఫాంట్లను ఎంచుకుంటే మంచిది. అక్షరాలు నలుపు రంగులో, సైజు 12 ఉండేలా చూసుకోవాలి. ● చదివేవారి దృష్టిని ఆకర్షించేలా బోల్డ్, ఇటాలిక్‌లను కొన్ని ముఖ్యమైనచోట్ల ఉపయోగించడం లాభిస్తుంది.
- ఫ్యాన్సీ ఫాంట్‌లు, షేడింగ్, హైలైటింగ్ లాంటి స్పెషల్ ఎఫెక్ట్‌లను వాడొద్దు. ఇలాంటి పనులు సమాచార లోపాలను కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారనే అభిప్రాయాన్ని కలిగించే ప్రమాదముంది.
- విశేషణాలతో కూడిన అతిశయోక్తుల భాషకు దూరంగా ఉండాలి. అవసరమైతే తప్ప పెద్ద పదాలను ఉపయోగించకపోవడమే మేలు.
- మరింత స్పష్టత కోసం సమాచారాన్ని జాబితాగా, బుల్లెట్ పాయింట్ల రూపంలో అందిస్తే బావుంటుంది.

2 ఇవి ఉండాల్సిందే!

దరఖాస్తు చేసుకునే పరిశ్రమను బట్టి రెజ్యూమే మారుతుంది. అయినప్పటికీ.. ఈ కింది అంశాలను మాత్రం రెజ్యూమేలో తప్పనిసరిగా చేర్చాల్సి ఉంటుంది. ● సంప్రదింపు వివరాలు: ఈమెయిల్ చిరునామా, ఫోన్ నంబరు ● విద్యార్హతలు ● సాంకేతిక/ సాఫ్ట్‌వేర్/ సంబంధిత నైపుణ్యాల జాబితా ● గత ఉద్యోగ వివరాలు/ వాలంటీరింగ్/ వర్క్ ప్లేస్‌మెంట్లు ● వ్యక్తిగత లక్షణాలు/ విజయాలు


ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయమేంటంటే.. ఉద్యోగానికి సంబంధించిన లక్షణాలను ముందు చేర్చాలి. ఉదాహరణకు ఎంపిక చేస్తున్న ఉద్యోగానికీ, మీరు చదివిన చదువుకూ పొంతన లేకపోతే దానికి సంబంధించిన అంశాలను జాబితా చివర్లో చేర్చాలి.

3 లేటెస్ట్ విజయాలు ముందు

కాలానుగుణంగా కాకుండా ఇటీవల సాధించిన విజయాలను ముందుగా చేర్చాలి. అంటే.. స్కూల్ సమయంలో సాధించిన విజయాలకంటే కళాశాల స్థాయిలో సాధించినవాటికి ప్రాధాన్యమివ్వాలి. అలాగే ప్రతి వివరణలోని సమాచారాన్ని క్లుప్తంగా, ప్రాధాన్యక్రమంలో ఉండేలా చూసుకోవాలి.

4 మంచి ముద్రకు మార్గం!

మీ గురించిన సమాచారాన్ని అంకెలు, గణాంకాల రూపంలో తెలియజేయాలి. సాధారణ అంశాలు, అప్రామాణిక భాష సంస్థ అధికారులకు మీ రెజ్యూమేపై ఆసక్తిని తగ్గించే అవకాశముంది. అలాంటి సమయంలో క్లుప్తంగా నంబర్ల రూపంలో ఇచ్చే సమాచారం రెజ్యూమేను ఆసాంతం చదివేలా చేయడమే కాకుండా, మీపై మంచి ముద్రను వేయడంలోనూ సహకరిస్తుంది.



5 కీ వర్డ్‌లు కీలకం

అవసరమైనచోట సంబంధిత కీ వర్డ్‌లను ఉపయోగించడం ద్వారా తక్కువ సమయంలో అధికారులకు మీ గురించి ఎక్కువ సమాచారాన్ని తెలుసుకునే వీలును కల్పించవచ్చు. చాలావరకూ పెద్ద సంస్థలు రిక్రూట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నాయి. ఈ సాఫ్ట్‌వేర్ అభ్యర్థుల దరఖాస్తుల్లోని కీవర్డ్‌లను స్కాన్ చేసి, వారిని ప్రాథమిక పరీక్షలకు ఎంపిక చేస్తోంది. కాబట్టి ఆ కీలక పదాలు రెజ్యూమేలో ఉండే విధంగా చూసుకోవాలి. కానీ అతిగా ఉపయోగించకూడదు. ఉదాహరణకు- రాతకు సంబంధించిన ఉద్యోగానికి మీరు దరఖాస్తు చేస్తున్నారనుకోండి. మీరు గతంలో రాసిన కథనాలు, వ్యాసాల అనుభవాలను పంచుకోవచ్చు.

6 మీ మార్కెటింగ్ మీదే

పరిశ్రమకు మీరు ఎంతవరకూ తగినవారో చూపించడం ద్వారా మీ ఎంపిక తప్పనిసరయ్యేలా చూసుకోండి. ఉదాహరణకు మీరు మైక్రోసాఫ్ట్ సంస్థకు ఇంటర్వ్యూకు వెళితే.. ఒకవేళ తాము తీసుకోకపోతే గూగుల్ మిమ్మల్ని ఎగరేసుకుపోతుందేమో! పరిశ్రమలో తరువాతి గొప్ప ఆలోచన మీ నుంచే వస్తుందేమో! అన్నంతగా మార్కెట్ చేసుకోవాలి. అంటే ఎంపిక చేసుకోకపోతే నష్టపోతామేమో అన్న భావనను మైక్రోసాఫ్ట్‌కు కలిగించాలన్నమాట.

7 స్పష్టంగా నైపుణ్యాల వివరాలు

పేరు, చిరునామా, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ మినహా మిగతా అన్ని వ్యక్తిగత వివరాలను (పెళ్లి, కుటుంబ వివరాలు లాంటివి) వదిలేయవచ్చు. పదాల సంఖ్య విషయంలో పరిమితి విధించుకుని, స్థలాన్ని వీలైనంత జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. మీ నైపుణ్యాల గురించి సూటిగా, స్పష్టంగా రాయండి.

8 భాష బాగుండాలి

టెన్స్‌లు, విరామచిహ్నాలను తప్పుగా ఉపయోగించడం, అసందర్భ వెర్బ్ ఫ్రేజ్‌లు ప్రమాదకరం. వాటి పట్ల జాగ్రత్త తప్పనిసరి. అలాగే వ్యాకరణ దోషాలు మీ నిర్లక్ష్య వైఖరిని ప్రతిఫలించేలా చేస్తాయి. అందుకే రెజ్యూమే పూర్తయిన తరువాత మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలి.

9 ఆన్‌లైన్ టూల్స్‌తో..

సీవీ మేకర్, విజువల్ సీవీ, ఆన్‌లైన్ రెజ్యూమే జనరేటర్ మొదలైన ఎన్నో ఆన్‌లైన్ సైట్లు అందుబాటులో ఉన్నాయి. ఒక మంచి రెజ్యూమేకు అవసరమైన ఎన్నో రకాల లేఅవుట్లు, టెంప్లేట్లను ఇవి అందిస్తున్నాయి. వీటిని ఉపయోగించి రెజ్యూమేను తయారు చేసుకోవచ్చు. వీటిల్లో చాలావరకూ ఉచితసేవలను అందిస్తున్నాయి. అలాగే రెజ్యూమే పూర్తయ్యాక సేవ్ చేసుకోవచ్చు. అవసరమైన మార్పులను చేసుకునే వీలునూ కల్పిస్తున్నాయి.

ఉద్యోగానికి తగిన కవర్ లెటర్

ప్రతీ సంస్థ ప్రత్యేకమే. కాబట్టి మీ కవర్ లెటర్ నిర్దిష్టంగా, దరఖాస్తు చేస్తున్న సంస్థ ఉద్యోగ విధులకు తగ్గట్టుగా ఉండాలి. దరఖాస్తు చేస్తున్న సంస్థకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడానికి సమయాన్ని కేటాయించాలి. అలాగే కాపీ- పేస్ట్‌లు చేయవద్దు. సంస్థ గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకున్న తర్వాతే రాయడం ప్రారంభించాలి.

పేరాలవారీగా..

మీ కవర్ లెటర్‌ను మూడు పేరాలుగా విభజించుకుని రాస్తే, సంస్థ యాజమాన్యానికి కూడా చదవడానికి అనుకూలం. మొదటి పేరాలో మీ పని గురించి సారాంశాన్ని ఇస్తూ, సంబంధిత ఉద్యోగానికి/ ఇంటర్న్‌షిప్‌కు మీరెంతవరకూ అర్హులో వివరించాలి. రెండో పేరాలో మీ గత అనుభవం, ప్రాజెక్టులు, ఈ కొత్త ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను వివరించాలి. మూడో పేరాలో ప్రత్యేకంగా ఆ సంస్థలో పనిచేయడానికి ఎందుకు ఆసక్తి చూపుతున్నారో తెలియజేయండి. అవసరమైన చోట సంబంధిత స్థానానికి అవసరమైన కీవర్డ్‌లనూ ఉపయోగించాలి.

క్లుప్తంగా.. తప్పులు లేకుండా

సరళమైన భాషను ఉపయోగిస్తూ, వాక్య నిర్మాణం సరిగా ఉండేలా చూసుకోవాలి. అలాగే సమాచారం క్లుప్తంగా ఉండాలి. ఎలాంటి వ్యాకరణ దోషాలూ ఉండకూడదు. అందుకుగానూ.. ముందే ఒకసారి తప్పులు సరిచూసుకుని, అవసరమైన ఎడిటింగ్ చేసుకుని పంపాలి. ప్రభావశీలమైన కవర్ లెటర్‌ను తయారు చేసుకోవడంలో ఆన్‌లైన్ టెంప్లేట్ల సాయాన్నీ తీసుకోవచ్చు.

ఒక పేజీ చాలు

ఒక ఇంటర్న్‌షిప్ లేదా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంటున్నప్పుడు రెజ్యూమేతోపాటుగా కవర్ లెటర్‌నూ జోడించి పంపాల్సి ఉంటుంది. ఇది ఒక పేజీలో మాత్రమే ఉండాలి. ఈ కవర్ లెటర్ ద్వారా సంస్థ మిమ్మల్ని ఎందుకు నియమించుకోవాలో వివరించాల్సి ఉంటుంది. ఫలానా ఉద్యోగానికి, సంస్థకు మీరే తగిన అభ్యర్థి ఎలా అవుతారో వివరించే అవకాశం మీకు దీని ద్వారా లభిస్తుంది.

ఈ-మెయిల్‌లో ఇలా..

ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగాలకు ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేస్తున్నప్పుడు ప్రత్యేకంగా కవర్ లెటర్‌ను అటాచ్ చేయాల్సిన అవసరం లేదు. కవర్ లెటర్‌లోని సమాచారాన్ని ఈ-మెయిల్ బాడీలో పొందుపరవచ్చు. తద్వారా మీ ఆసక్తులను రిక్రూటర్లు సులభంగా తెలుసుకోగలిగే వీలుంటుంది.

ఒక మంచి రెజ్యూమే, కవర్ లెటర్ ఇంటర్న్‌షిప్/ ఉద్యోగ వేటలో ఒక మంచి పునాది వేయడానికి తోడ్పడతాయి. ఎన్నో ఉద్యోగ ప్రయత్నాల్లో రెజ్యూమే అవకాశాల తలుపులు తెరుస్తుంది. కాబట్టి, దాన్ని సరైన రీతిలో మలిచేలా జాగ్రత్త వహించండి.

• మాదిరి కవర్ లెటర్ •

Here is an example of a cover letter:

"Hope you are doing well. I have used the Nxtby previously and was impressed by how a small idea of connecting local merchants, with customers can create one of the largest deal-buying company in the world.

I am interested in Marketing and have worked on different domains including blogging, product marketing and demographic survey. Recently, I volunteered with an NGO in Delhi where I helped in raising funds for the education and healthcare of children through offline marketing. This experience has taught me skills like interpersonal communication, leadership abilities, and helped me become a team player.

In Cool Cloth, I worked on designing and developing clothing and marketing it through social media, eFlyers, and other modes. Both these experiences helped me develop my interest in marketing. Apart from this, I happen to blog for Better World which focuses on issues faced by youth.

Also, I happened to notice that Nxtby has a great work culture and I would love to be a part of your team. I have an active extra curricular record as I am a member of my college's Art Society, Women Development Cell and NSS.

Thank you so much for your time. Look forward to your reply.

Thanks, XYZ"

సివిల్ సర్వీసెస్ మెయిన్స్ ఫలితాలు వెలువడ్డాయి. దీనిలో నెగ్గినవారికి పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)ని త్వరలో నిర్వహించబోతున్నారు. సివిల్స్ మొత్తం 2025 మార్కుల్లో ఇంటర్వ్యూ మార్కులు 275 (13.5 శాతం) మాత్రమే. కానీ మెరిట్‌ను నిర్ణయించటంలో దీని ప్రభావం 30 శాతానికి పైగానే! ముఖాముఖిలో అభ్యర్థి వాస్తవ స్వభావాన్ని అంచనా వేసేందుకు పలు రకాల ప్రశ్నలు వేస్తున్నారు. అందుకు తగిన విధంగా సిద్ధం కావడం చాలా అవసరం. సివిల్స్ ఎంపిక ప్రక్రియలో చివరిదైన ఈ ఇంటర్వ్యూకు ముందస్తుగా తయారయ్యేందుకు.. ఇవిగో సూచనలు!



పర్సనాలిటీకి పదునైన పరీక్ష!



వి. గోపాలకృష్ణ
డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ

టాపర్ల మార్కులను పరిశీలిస్తే వారు మెయిన్స్‌తోపాటు ఇంటర్వ్యూలోనూ అత్యధిక మార్కులు సాధించటం కనిపిస్తుంది. ఇంటర్వ్యూలో కొద్దిపాటి అదనపు మార్కులు కనీసం 10 ర్యాంకుల కంటే ముందుండేలా చేస్తాయి. మరో రకంగా చూస్తే... ఇంటర్వ్యూలో 2-3 మార్కులు తక్కువ వస్తే 3-4 ర్యాంకులు తగ్గి తక్కువ సర్వీసుతో సరిపెట్టు కోవాల్సి రావచ్చు.

ముందస్తు సన్నద్ధత ఎలా?

అభ్యర్థి వ్యక్తిగతమైన, విద్యాపరమైన, సివిల్స్ ఆప్షనల్‌కు సంబంధించిన ప్రశ్నలను ఇంటర్వ్యూలో అడుగుతారు. ఇంకా వర్తమాన అంశాలు, అభిరుచులపై ప్రశ్నలను కూడా సంధిస్తారు.

✦ బయోడేటా ఆధారంగా అడిగే ప్రశ్నలను ఒక కాగితం మీద రాసుకొని, వాటికి జవాబులు సిద్ధం చేసుకోండి. 'సివిల్ సర్వీసుల్లో చేరాలని ఎందుకు కోరుకుంటున్నారు?' లాంటి ప్రశ్నలకూ; మీ అభిరుచి పుస్తక పఠనమైతే... 'ఏ పుస్తకం చదివారు?' లాంటివాటికీ సిద్ధం కావాలి. ✦ వర్తమానాంశాలను ఒక జాతీయ పత్రిక నుంచీ, మరో ప్రాంతీయ పత్రిక నుంచీ సేకరించండి. జనవరి 2017 నుంచి అత్యంత ముఖ్యమైన పరిణామాలను కాలక్రమానుగుణంగా రాయండి. వార్తాపత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో చర్చలు జరిగిన అంశాలను ఆ జాబితాలోంచి గుర్తించండి. ✦ ఒక్కో సమస్యను తీసుకుని, దాని అనుకూల, ప్రతికూల కోణాలను రాయండి. తర్వాత దానికి సంబంధించిన ప్రశ్నలు ఊహించి సమాధానాలు చెప్పటానికి ప్రయత్నించండి. ✦ బయోడేటాపైనా, వర్తమాన అంశాలపైనా నమూనా ఇంటర్వ్యూలకు హాజరుకండి. ✦ వాటిలో మీరు మెరుగుపరచుకోవాల్సిన అంశాలను గుర్తించండి. ✦ వీలైతే- అదే బోర్డు నిర్వహించే నమూనా ఇంటర్వ్యూకు హాజరుకండి. మీ సమాధానాల్లో మెరుగుదల కనిపించిందేమో అడిగి సలహాలు తీసుకోండి. ✦ రెండు మూడు నమూనా ఇంటర్వ్యూలు సరిపోతాయి. ✦ సలహాలు తీసుకోవటం గానీ, నమూనా ఇంటర్వ్యూలకు హాజరవడం గానీ వాస్తవ మౌఖిక పరీక్షకు ఐదు రోజుల ముందు ఆపివేయడం మంచిది. ఆపై ప్రశాంత వాతావరణంలో సొంతంగా సిద్ధమవటంపై దృష్టిపెట్టాలి.

తెలుగులో జవాబులు చెప్పొచ్చా?

1. మెయిన్స్ ఇంగ్లిష్‌లో రాశాను. ఇంటర్వ్యూ తెలుగులో చేయవచ్చా?

✦ గతంలో అయితే మెయిన్స్ పరీక్షను ప్రాంతీయభాషలో రాసినప్పుడు మాత్రమే ఆ సదుపాయం ఉండేది. కానీ బి.బి. భట్టాచార్య కమిటీ సిఫార్సుల మేరకు 2011 నుంచీ మెయిన్ పరీక్షలో రాసిన మీడియంతో సంబంధం లేకుండా ఇంటర్వ్యూ మీడియాన్ని ఎంచుకోవటానికి వీలవుతోంది. కాబట్టి మెయిన్స్‌ను ఇంగ్లిష్‌లో రాసినప్పటికీ ఇంటర్వ్యూను తెలుగులో చేయవచ్చు.

2. కనీస అర్హత మార్కులుంటాయా?

✦ ఇంటర్వ్యూలో అలాంటివేమీ లేవు. సాధారణంగా అభ్యర్థి ప్రతిభా ప్రదర్శన ఎలా ఉన్నప్పటికీ కనీసం 35 శాతం మార్కులను బోర్డు వేస్తుంటుంది.

3. ఇటీవలికాలంలో సివిల్స్ ఇంటర్వ్యూ పద్ధతిలో మార్పు ఏమైనా వచ్చిందా?

✦ కొద్ది సంవత్సరాలుగా ప్రశ్నల స్వభావంలో మార్పు కనిపిస్తోంది. నిగ్వేకర్ కమిటీ సిఫార్సుల ఫలితంగా.. అభ్యర్థి వాస్తవ స్వభావాన్ని వెలికితీసే పదునైన ప్రశ్నలు అడుగుతున్నారు. సాంప్రదాయిక అంశాలతోపాటు అభ్యర్థి స్వభావం, ధోరణి, విలువలను గ్రహించేలా ప్రశ్నలను సంధించి పరీక్షిస్తున్నారు.

అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ చేస్తే?

■ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ చదివితే భవిష్యత్తు ఎలా ఉంటుంది? దానిలో ప్రవేశం పొందడం ఎలా? - *కీర్తి,* నర్సీపట్నం

జ: మనది వ్యవసాయాధారిత దేశం. కాబట్టి ఈ రంగంలో అపార విద్య, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయానికి సాంకేతిక నైపుణ్యాన్ని జోడించి ఆహారోత్పత్తిలో, ప్రాసెసింగ్‌లో అభివృద్ధిని సాధించడమే అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ ఉద్దేశం. ఇంటర్‌లో మ్యాథ్స్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ చదివినవారు ఈ కోర్సును చదవడానికి అర్హులు. దీనికి తెలుగు రాష్ట్రాల్లో ఎంసెట్ ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది.



ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, డా. వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్, గుంటూరు; విజ్ఞాన్ యూనివర్సిటీ, ఇతర అనుమతి పొందిన అనుబంధ కళాశాలలు ఈ కోర్సును అందిస్తున్నాయి. బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజినీరింగ్) కోర్సు కాలవ్యవధి 4 సంవత్సరాలు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్‌వారు ఆల్ ఇండియా ఎంట్రెన్స్ పరీక్ష ద్వారా జాతీయ స్థాయిలో ప్రవేశాన్ని కల్పిస్తున్నారు.

ఈ కోర్సు పూర్తిచేసినవారు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఫుడ్ సూపర్‌వైజర్, ఆగ్రో ఎకనమిస్ట్, సాయిల్ సైంటిస్ట్, ఫార్మ్ షాప్ మేనేజర్, రిసెర్చర్, ప్లాంట్ ఫిజియాలజిస్ట్, సర్వే ఇంజినీర్ ఇన్ అగ్రికల్చర్ వంటి ఉద్యోగాలు పొందుతారు. జేఈఈ ద్వారా కూడా కొన్ని విద్యాసంస్థలు అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌లో ప్రవేశాన్ని కల్పిస్తున్నాయి.

యానిమేషన్ రంగం ఎలాఉంది?

■ యానిమేషన్ రంగంలో చేరాలంటే ఏ అర్హతలుండాలి? అందులో ఏ కోర్సులుంటాయి? ఉపాధి అవకాశాలు బాగుంటాయా? ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వివరాలను తెలపండి. - *మధు,* నూజివీడు



జ: యానిమేషన్ రంగంలో చేరాలనుకునే వారికి కనీస కంప్యూటర్ అవగాహన, వైవిధ్యంగా ఆలోచించే ధోరణి, సృజనాత్మకత వంటి ప్రధాన నైపుణ్యాలుండాలి. మల్టీమీడియా రంగం అభివృద్ధి చెందడంతో యానిమేషన్ నిపుణులకు డిమాండ్ ఏర్పడింది. ఈ రంగంలో గేమింగ్ డిజైన్, వీఎఫ్ఎక్స్, 3డీ యానిమేషన్, మిక్సింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, విజువల్ ఆర్ట్స్ వంటి వివిధ విభాగాలుంటాయి. అభ్యర్థులు ఆసక్తిని బట్టి కోర్సునూ, రంగాన్నీ ఎంచుకోవచ్చు. ఈ కోర్సుల్లో చేరాలంటే 10+2 పూర్తిచేసి ఉండాలి.

ప్రభుత్వ సంస్థలు ఈ కోర్సును అందించడం లేదు. మాయ అకాడమీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సినిమాటిక్స్ (ఎంఏఏసీ), ఎరీనా అకాడమీ, షాప్ట్ యానిమేషన్ సంస్థలు ప్రైవేటు రంగంలో ట్రెయినింగ్, ప్లేస్‌మెంట్లను అందిస్తున్నాయి. ఉపాధిపరంగా గ్రాఫిక్ డిజైనర్, వీఎఫ్ఎక్స్ స్పెషలిస్ట్, గేమింగ్ గ్రాఫిక్స్ ఇంజినీర్, యానిమేషన్ ఎక్స్‌పర్ట్ వంటి అవకాశాలుంటాయి.

● ***ప్రొ. బి. రాజశేఖర్,*** కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ఫెలోషిప్స్

ఐఐటీ మద్రాసు

ప్రోగ్రామ్: ఐఐటీఎం సమ్మర్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ - 2018
కాలవ్యవధి: 2 నెలలు (2018 మే 16 నుంచి 2018 జులై 15 వరకు) **స్టైపెండ్:** నెలకు రూ. 6000
విభాగాలు: ఇంజినీరింగ్, సైన్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్.
అర్హత: 1) బీఈ/ బీటెక్/ బీఎస్సీ (ఇంజినీరింగ్)/ ఇంటిగ్రేటెడ్ ఎంఈ/ ఎంటెక్ మూడో సంవత్సర అభ్యర్థులు
2) ఎంఈ/ ఎంటెక్/ ఎంఎస్సీ/ ఎంఏ/ ఎంబీఏ ప్రథమ సంవత్సర అభ్యర్థులు అర్హులు. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ **చివరితేది:** 28.02.2018
వెబ్‌సైట్: https://sfp.iitm.ac.in

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్, ఆనంద్

కోర్సు: ఫెలో ప్రోగ్రామ్ ఇన్ రూరల్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఆర్ఎం) (గుజరాత్ రాష్ట్రం ఆనంద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్‌లో)
కాలవ్యవధి: 4 సంవత్సరాలు
ఫెలోషిప్: నెలకు రూ. 25,000 - రూ. 28,000 తోపాటు కంటింజెన్సీ గ్రాంటు కింద ఏడాదికి రూ. 20,000.
అర్హత: సంబంధిత సబ్జెక్టులో పీజీ లేదా డిప్లొమా ఉత్తీర్ణత. క్యాట్/ గ్మాట్/ జీమ్యాట్/ జీఆర్ఈ/ గేట్/ యూజీసీ - నెట్/ సీఎస్ఐఆర్ - నెట్ స్కోరు ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్. **చివరితేది:** 15.02.2018
వెబ్‌సైట్: www.irma.ac.in

ప్రవేశాలు

ఇఫ్లూ - హైదరాబాద్

కోర్సులు ఆఫర్ చేస్తున్న వర్సిటీ ప్రాంగణాలు: హైదరాబాద్, లఖ్‌నవూ, షిల్లాంగ్ (2018- 19 విద్యా సంవత్సరం).
1) యూజీ 2) పీజీ 3) టీచర్ ట్రెయినింగ్ 4) పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్/ డిగ్రీ/ పీజీ/ ఎంఫిల్ ఉత్తీర్ణత. **ఎంపిక:** ప్రవేశపరీక్ష, ఇంటర్వ్యూ
దరఖాస్తు: ఆన్‌లైన్ **చివరితేది:** 07.02.2018
వెబ్‌సైట్: www.efluniversity.ac.in

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్, భోపాల్

కోర్సు: పీజీ డిప్లొమా ఇన్ ఫారెస్ట్రీ మేనేజ్‌మెంట్ (పీజీడీఎఫ్ఎం)
సీట్ల సంఖ్య: 120 **కాలవ్యవధి:** 2 సంవత్సరాలు
అర్హత: ఏదైనా డిగ్రీ. క్యాట్/ గ్మాట్ స్కోరు ఉండాలి.
ఎంపిక: ప్రవేశపరీక్ష, ఇంటర్వ్యూ
దరఖాస్తు: ఆన్‌లైన్ **చివరితేది:** 30.06.2018.
వెబ్‌సైట్: http://iifm.ac.in/admission/

పూర్తి వివరాలు, మరినిత్న నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

వనదేవతలకు ఆదివాసీ కళాహారతి

- కళ్లకు కట్టినట్లుగా సమ్మక్క సారలమ్మల వీరగాథలు
- అబ్బురపరిచేలా సకినె రామచంద్రయ్య బృందం ప్రదర్శనలు
- వెలుగులోకి తెచ్చిన జయధీర్ తిరుమలరావు బృందం

ఈనాడు - హైదరాబాద్


కథాగానంలో రామచంద్రయ్య (మధ్యలో) బృందం

వనదేవతల కథలను హృద్యంగా ఆలపించే అడవి బిడ్డలు వారు. సమక్క-సారలమ్మల చరితను జనానికి చేరవేసే ఆదివాసీ ప్రతినిధులు.. కంచుమేళం, తాళం, డోలు వాయిద్యంతో అందరినీ కట్టిపడేసే కళ వారి సొంతం. మణుగూరు మండలం కూనవరానికి చెందిన ఆదివాసీ గేయకళాకారుడు సకినె రామచంద్రయ్య శ్రావ్యంగా పాడుతుంటే మరో కళాకారుడు గొర్రె రంగయ్య తన గాత్రాన్ని అందిస్తుంటారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా ఇతర జిల్లాల్లోని గిరిజన గూడేల్లో గానామృతంతో వారు ఆకట్టుకుంటున్నారు. ఆచార్య జయధీర్ తిరుమలరావు నేతృత్వంలోని పరిశోధకుల బృందం అయిదు సంవత్సరాలు పరిశోధన చేసి రామచంద్రయ్య బృందం కళను వెలికి తీసింది. మేడారంలో సమ్మక్క, సారలమ్మల జాతర ఈ నెల 31 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆదివాసీ కళాకారులపై ప్రత్యేక కథనమిది.

మేడారం సమ్మక్క సారలమ్మలు గిరిజనుల ఇలవేల్పులు. కోట్ల మంది గిరిజనేతరుల ఇష్ట దైవాలు. ఈ వీరనారుల అసలు, సిసలు కథ వినాలంటే రామచంద్రయ్య బృందం నోటి నుంచే వినాలి. ఏటా జాతర సమయంలో వీరు కథలు చెబుతారు. జాతర ప్రాంతాల్లో రాత్రి ఏడు గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఇవి సాగుతాయి. సమ్మక్క, సారలమ్మ, పడిగిద్ద రాజు, జంపన్న ఇలా.. మేడారం వనదేవతల వంశవృక్షానికి సంబంధించిన అందరి కథలను చెబుతారు. వీరు చెప్పే మేడారం కథల్లో ప్రేక్షకుల పాత్రనూ కళాకారులు పోషిస్తారు. 'ఏం అడుగుతున్నావు' అంటూ వారికివారే ప్రశ్నించుకొని జవాబు చెబుతుంటారు.

తొమ్మిదిమందితో బృందం..

ప్రధాన కథకుడైన రామచంద్రయ్య డోలు వాయిస్తూ కథ చెబుతుంటే.. సహ గాయకులు గాత్రం కలుపుతారు. దాదాపు తొమ్మిది మందితో బృందం ఉంటుంది. కథ చెప్పడానికి వారికి పగిడె(వస్త్రం) ఉంటుంది. సమ్మక్క సారలమ్మల జననం, వివాహాలు, ఆచార వ్యవహారాలు, పోరాట పంథా.. కాకతీయ సార్వభౌములతో యుద్ధం... ఇలా అన్ని అంశాలపై వారి కథలు సాగుతాయి.

పగిడె అంటే..: పగిడె అంటే రెండున్నర గజాల పొడవు, గజం వెడల్పు గల వస్త్రం. ఇందులో ఆరేడు వరసల్లో ఆదివాసీ చిత్రాలుంటాయి. ముందుగా వస్త్రాన్ని నేస్తారు. కథలకు సంబంధించిన బొమ్మల ఆకారాన్ని చిత్రించి వస్త్రంపై కుడతారు. ఆకుపచ్చ, కాషాయం, పసుపుపచ్చ, తెలుపు వంటి కూరగాయల రంగులను తయారు చేసి అందులో వస్త్రాలను ముంచుతారు. వాటిని మనుషులు, పులులు ఇతర వన్యప్రాణులు, చెట్లు, ఇతర ఆకారాల్లో కత్తిరించి కథలో ఉపయోగిస్తారు.

అంతరించిపోయే ప్రమాదం..: సకినె రామచంద్రయ్య సమ్మక్క సారలమ్మ, ముసలమ్మ, నాగులమ్మ, సడాలమ్మ, బాపనమ్మ వంటి గిరిజన వీరనారులు, పడిగిద్దరాజు, జంపన్న, గోవిందరాజుల వంటి వీరుల కథలు చెప్పడంలో దిట్ట. ప్రస్తుతం ఆయన బృందం మాత్రమే ఈ కథలు చెబుతోంది. ఏడు పదుల వయస్సు గల ఆయన కోయభాషతోపాటు తెలుగులోనూ కథాగానం చేస్తారు. తరచూ అనారోగ్యానికి గురవుతున్నా... కళే ప్రాణంగా జీవిస్తున్నారు. పగిడెలు తయారుచేసేందుకు దాదాపు లక్ష రూపాయల వరకు ఖర్చవుతుంది. వీటిని స్వయంగా తయారుచేసుకొని ఆదివాసీ కళాకారులు కథలు చెబితే వారికి వచ్చే కట్నాలు, కానుకలు అతి తక్కువే. వనదేవతల కథలు చెప్పే ఆదివాసీల గాన కళ చివరి దశలో ఉంది. రామచంద్రయ్య తర్వాతి నేటి తరం దీన్ని పుణికి పుచ్చుకోలేదు. దీంతో మున్ముందు ఈ కళ అంతరించిపోయే ప్రమాదం పొంచిఉంది.

ఈ కళను బతికించాలి: సకినె రామచంద్రయ్య

మేం కోయరాజుల వారసులం. ఎన్నో ఏళ్ల నుంచి కథలు చెబుతున్నాం. మా తాత, నాయినల నుంచి దీన్ని నేర్చుకున్నా. నాకు ఆరోగ్యం సహకరించకున్నా కథలు చెబుతున్నా. ప్రభుత్వం నుంచి మాకు సహకారం కావాలి. ఈ కళను బతికించేందుకు చర్యలు చేపట్టాలి.

చరిత్ర, సంస్కృతులను కాపాడుకోవాలి



ఎంతో శ్రమించి గిరిజన కళాకారుల ఘనతను బయటి ప్రపంచానికి తెలియజెప్పాం. వారితో పాటు గొప్ప చరిత్ర, సంస్కృతిని కాపాడుకోవాలి. రామచంద్రయ్య గొప్ప కళాకారుడు. మేడారం జాతర ఆస్థాన కథకుడిగా ఆయనను నియమించి గౌరవించాలి. సమ్మక్క సారలమ్మ జాతర స్ఫూర్తిని కొనసాగించాలి. కోయల మూల సంస్కృతికి పట్టం గట్టాలి. దేవాదాయ (ఎండోమెంట్స్) లక్షణాలను అక్కడ పరిహరించాలి. ఆదివాసీల సాహిత్యంపై గిరిజన సంక్షేమ శాఖ అధ్యయనం సాగడం లేదు. ఇక నుంచైనా రామచంద్రయ్య లాంటి వారిని కనిపెట్టాలి. ఇందుకోసం శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయాలి. ఇప్పటికే రెండు కథలను దృశ్య శ్రవణ విధానంలో మేం డాక్యుమెంటేషన్ చేశాం. మార్చి, ఏప్రిల్ లోపు మరో ఎనిమిది కథలను డాక్యుమెంటేషన్ చేస్తాం. రామచంద్రయ్య చరిత్రనూ ముద్రిస్తున్నాం.


- ఆచార్య జయధీర్ తిరుమలరావు, రచయిత, పరిశోధకులు

పచ్చిమాంసం పెంపుడు జంతువులకు హాని!




లండన్: పచ్చిమాంసం తినిపించడం వల్ల పెంపుడు జంతువుల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలున్నాయని తాజా అధ్యయనంలో తేలింది. హానికర పరాన్న జీవులు, బ్యాక్టీరియాలు వాటి శరీరంలోకి చేరే ఆస్కారముందని వెల్లడైంది. నెదర్లాండ్స్‌లోని ఆట్రెక్ట్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. పచ్చిమాంసం, అవయవాలు, మాంసంతో కూడిన ఎముకల్లో.. ఇ-కోలి, సాల్మనెల్లా తదితర బ్యాక్టీరియాలు, ఏలికపాముల వంటి పరాన్నజీవులు ఉంటున్నట్లు వారు గుర్తించారు. వీటిని ఇళ్లలోకి తేవడం వల్ల మనుషులు కూడా ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే అవకాశముందని పరిశోధకులు పేర్కొన్నారు. పచ్చిమాంసంతో కూడిన ఆహారం తీసుకున్న కుక్కలు కలరా, డయేరియా వంటి రోగాలకు గురవుతున్నాయని.. పిల్లులూ ప్రాణముప్పు కలిగించే సాల్మనెల్లా ఇన్‌ఫెక్షన్ బారినపడుతున్నాయని తెలిపారు. తగినన్ని పోషకాలు కూడా ఈ ఆహారంలో ఉండవని.. ఫలితంగా తక్కువ వయసున్న జంతువుల్లో ఆరోగ్యసమస్యలు తలెత్తొచ్చని వివరించారు.

యోగాతో మెదడుకు నవయవ్వనం!



దిల్లీ: వయసు పైబడటంతో మెదడుపైపడే దుష్ప్రభావాలను యోగాతో దూరం చేసుకోవచ్చని తాజా అధ్యయనంలో తేలింది. డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకాలజీ అండ్ అలైడ్ సైన్సెస్(డీఐపీఏఎస్) నిపుణులు దీన్ని చేపట్టారు. 20 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న 124 మంది ఆరోగ్యవంతులు దీనిలో పాల్గొన్నారు. వీరిని వయసుకు అనుగుణంగా మూడు వర్గాలు(20-29, 30-39, 40-50)గా విభజించారు. మూడు నెలలపాటు రోజూ గంట చొప్పున యోగా చేయమని వీరికి సూచించారు. దీంతో 20-29 ఏళ్ల వయసున్న వర్గంలో రక్తపోటు 122/69 నుంచి 119/68కు తగ్గినట్లు తేలింది. 40-50 ఏళ్ల వయసున్న వారిలోనూ ఇది 134/84 నుంచి 124/79కు తగ్గినట్లు బయటపడింది. యోగాకు ముందు ఒత్తిడికారక హార్మోన్ కార్టిజాల్ స్థాయిలు వీరిలో 95 శాతముండగా.. ఇవి 72.7 శాతానికి తగ్గినట్లు వెల్లడైంది. అంతేకాదు ఏకాగ్రత, భావోద్వేగాలను నియంత్రించే డోపమైన్, సెరోటోనిన్ లాంటి హార్మోన్ స్థాయిలూ నియంత్రణలోకి వస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఇవన్నీ మెదడుపై వృద్ధాప్య ప్రభావాన్ని దూరం చేయడానికి తోడ్పడతాయని పరిశోధనలో పాలుపంచుకున్న రామేశ్వర్ పాల్, సోమనాథ్ సింగ్, అభిరూప్ చటర్జీ తెలిపారు.

మనో వ్యాకులత పెరుగుతుంటే.. అల్జీమర్స్‌కు చేరువవుతున్నట్లే!



బోస్టన్: తీవ్రమైన మనో వ్యాకులతతో బాధపడే వృద్ధులు అల్జీమర్స్ వ్యాధిబారినపడే ముప్పుందని తాజా అధ్యయనమొకటి తేల్చింది. అల్జీమర్స్ అనేది నాడీ సంబంధిత రుగ్మత. తీవ్ర మతిమరుపునకు అది కారణమవుతుంది. ఈ వ్యాధిబారినపడ్డ వ్యక్తులు రోజువారీ కార్యకలాపాలను కూడా మర్చిపోతుంటారు. అమెరికాలోని 'బ్రిఘమ్, మహిళల ఆస్పత్రి' పరిశోధకులు అల్జీమర్స్‌పై తాజాగా విస్తృత పరిశోధనలు నిర్వహించారు. అల్జీమర్స్‌కు మనో వ్యాకులత ముందస్తు హెచ్చరికగా పనిచేస్తుందని వారు గుర్తించారు. సాధారణంగా మెదడులో తంతుయుత అమైలాయిడ్లు(ప్రోటీన్ ముక్కలు) ఎక్కువగా పోగుపడటం అల్జీమర్స్‌కు దారితీస్తుంది. అయితే, అమైలాయిడ్లు పేరుకుపోవడం ప్రారంభమైనప్పటి నుంచే వృద్ధులు మనో వ్యాకులతకు గురవుతుంటారని తాజా పరిశోధనలో తేలింది. కాబట్టి దీర్ఘకాలంలో వారు అల్జీమర్స్‌తో బాధపడే ముప్పుందని ముందుగానే అంచనా వేయొచ్చునని పరిశోధకులు వెల్లడించారు. తద్వారా వారికి మరింత మెరుగైన చికిత్స అందించవచ్చునని వివరించారు.

విశ్వంలో అత్యంత సుదూర గెలాక్సీ



వాషింగ్టన్: విశ్వంలో ఇప్పటివరకూ గుర్తించిన వాటిలో అత్యంత సుదూర గెలాక్సీని అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇది.. కేవలం 50 కోట్ల ఏళ్ల వయసున్న తొలినాటి తారా మండలమని వారు పేర్కొన్నారు.

నాసాకు చెందిన హబుల్, స్పిట్జర్ అంతరిక్ష టెలిస్కోపులు జరిపిన సర్వేలో ఎస్‌పీటీ0615-జేడీ అనే ఈ గెలాక్సీ వెలుగు చూసింది. ఇప్పటికే ఇలాంటి తొలినాటి గెలాక్సీలను గుర్తించినప్పటికీ అవన్నీ ఎర్రటి మచ్చల్లా దర్శనమిచ్చాయి. చాలా దూరంలో ఉండటమే కాక, వాటి పరిమాణం కూడా చిన్నగా ఉండటమే ఇందుకు కారణం. అయితే ప్రస్తుత గెలాక్సీని 'గురుత్వాకర్షణ లెన్సింగ్' విధానం ద్వారా గుర్తించారు. ఇందులో ముందువైపున్న ఒక భారీ తారామండలానికి సంబంధించిన గురుత్వాకర్షణ శక్తి.. వెనుకవైపున్న గెలాక్సీ కాంతిని పెద్దదిగా చేసే, చూపింది. "ఇంత దూరంలో ఉన్న గెలాక్సీకి సంబంధించి ఇంత వివరంగా ఎప్పుడూ డేటాను సేకరించలేదు. గురుత్వాకర్షణ లెన్సింగ్ ప్రభావాన్ని నిశితంగా విశ్లేషించడం ద్వారా ఈ గెలాక్సీ పరిమాణాన్ని, ఆకృతిని నిర్ధరించవచ్చు" అని పరిశోధనలో పాల్గొన్న బ్రెట్ సాల్మన్ పేర్కొన్నారు. ప్రాథమిక విశ్లేషణ ప్రకారం దాని వెడల్పు 2500 కాంతి సంవత్సరాలు కాగా, బరువు.. 300 కోట్ల సూర్యుళ్లకు సమానంగా ఉండొచ్చని వెల్లడైంది.

'సంఘటిత' ఉద్యోగులకు పన్ను లేకుండా

రూ.20లక్షల గ్రాట్యుటీ!

బిల్లుకు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం

దిల్లీ: రాబోయే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో.. గ్రాట్యుటీ చెల్లింపు సవరణ బిల్లు-2017కు ఆమోదముద్ర పడే అవకాశం ఉంది. దీనికింద సంఘటితరంగ కార్మికులు ఎలాంటి పన్ను లేకుండా రూ.20 లక్షల వరకూ గ్రాట్యుటీని పొందవచ్చు. ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారం.. ఐదేళ్ల కన్నా ఎక్కువ సర్వీసు కలిగిన సంఘటిత రంగ కార్మికులు ఉద్యోగం వీడేటప్పుడు కానీ పదవీ విరమణ పొందేటప్పుడు కానీ.. ఎలాంటి పన్ను లేకుండా రూ.10 లక్షల వరకూ గ్రాట్యుటీని పొందవచ్చు. అయితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో సంఘటిత రంగ కార్మికులకూ రూ.20లక్షల గ్రాట్యుటీని అందించాలని ప్రభుత్వం భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. గ్రాట్యుటీ చెల్లింపు సవరణ బిల్లును పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టారు. దీనికి ఆమోద ముద్ర పడ్డాక, పన్నురహిత గ్రాట్యుటీ పరిమాణాన్ని నిర్ణయించడానికి ప్రభుత్వం మరోసారి పార్లమెంటుకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. గ్రాట్యుటీ పరిమాణం, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవు కాలం వంటి వాటిని నిర్దేశించి, నోటిఫికేషన్ జారీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని ఈ బిల్లు చెబుతోంది. గ్రాట్యుటీ చెల్లింపు చట్టం-1972 ప్రకారం కర్మాగారాలు, గనులు, చమురు క్షేత్రాలు, తోటలు, పోర్టులు, రైల్వే కంపెనీలు, దుకాణాలు లేదా ఇతర సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు గ్రాట్యుటీని చెల్లించాల్సి ఉంటుంది. పది మంది కన్నా ఎక్కువ మంది ఉద్యోగులున్న సంస్థలో కనీసం ఐదేళ్ల నిరాటంక సర్వీసును పూర్తిచేసినవారికి ఈ చట్టం వర్తిస్తుంది.

తుదిదశలో నకిలీ చలానాల కుంభకోణం దర్యాప్తు

ఈనాడు, హైదరాబాద్: చలానాలలో చేతివాటం ప్రదర్శించి ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించిన బోధన్ వాణిజ్య పన్నుల కుంభకోణం కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంది. దాదాపు రూ.230 కోట్ల ఈ కుంభకోణంలో మధ్యవర్తులతోపాటు వాణిజ్య పన్నుల శాఖకు చెందిన అనేక మంది ఉద్యోగుల ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు లభించిన సంగతి తెలిసిందే. సేకరించిన చలానాల పరిశీలన తుది దశకు చేరుకోవడంతో ఇందులో వెల్లడైన అంశాల ఆధారంగా దర్యాప్తు అధికారులు తగు చర్యలు తీసుకోనున్నారు. బోధన్ వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో జరిగిన కుంభకోణం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. శివరాజ్ అనే మధ్యవర్తి ప్రభుత్వ ఉద్యోగులతో కుమ్మక్కై ఈ కుంభకోణానికి తెరతీశాడు. వాణిజ్య సంస్థలు అసలు పన్నులు చెల్లించకపోయినా చెల్లించినట్లు తప్పుడు చలానాలు సృష్టించాడు. కొన్ని చలానాలను తారుమారు చేసి కట్టిన దానికంటే ఎక్కువ చూపించి మోసం చేశాడు. ఇలా రకరకాల పద్ధతుల్లో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను నొక్కేశారు. ఇందుకుగాను తనకు సహకరించిన ప్రభుత్వ అధికారులకూ శివరాజ్ వాటాలు పంచాడు. అంతర్గత ఆడిట్‌లో ఇది వెలుగులోకి రావడంతో ప్రభుత్వం సీఐడీ దర్యాప్తునకు ఆదేశించింది. దీనికి సంబంధించి శివరాజ్‌తోపాటు మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఇందులో వాణిజ్య పన్నుల శాఖ సిబ్బంది కూడా ఉన్నారు.

దర్యాప్తంతా చలానాల కేంద్రంగానే జరిగింది. కొన్ని చలానాలను ఫోర్జరీ చేయగా మరికొన్ని తప్పుడు చలానాలు సృష్టించారు. ఇలా రకరకాల పద్ధతుల్లో ప్రభుత్వానికి టోపీ పెట్టారు. దర్యాప్తులో భాగంగా దీన్ని నిర్ధరించాల్సి ఉండటంతో సీఐడీ అధికారులు నమూనాగా అప్పటి 5500 చలానాలను సేకరించారు. వాటిని ఖజానా అధికారులకు పంపి.. అవకతవకలను తేల్చాలని కోరారు. నిజమైన చలానాలు, పాక్షికంగా నిజమైనవి, పూర్తిగా నకిలీవి, ఒకే చలానాను వేర్వేరు సంస్థల పేరిట చూపడం.. ఇలా నాలుగు రకాలుగా వర్గీకరించి విశ్లేషిస్తున్నారు. ఈ ప్రక్రియ దాదాపు పూర్తికావొచ్చింది. దీనికి సంబంధించిన నివేదిక అందిన తర్వాత సీఐడీ అధికారులు మళ్లీ రంగంలోకి దిగనున్నారు. ఈ మొత్తం వ్యవహారంతో సంబంధమున్న వారందరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. మరో పది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నారు.

జయేంద్ర సరస్వతికి తీవ్ర అస్వస్థత

కాంచీపురం, న్యూస్‌టుడే: తమిళనాడులోని కాంచీపురంలో ఉన్న ప్రఖ్యాత కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను చెన్నై పోరూరు రామచంద్ర ఆసుపత్రికి తరలించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం రాత్రి ఉన్నట్లుండి కంచి మఠంలోనే అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే అక్కడున్న సహాయకులు, భక్తులు గుర్తించి హుటాహుటిన కారులో రామచంద్ర ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు మెరుగైన వైద్యం అందించడానికి ఆసుపత్రి వైద్యులు కృషి చేస్తున్నారు. ఆయన పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఢాకా చేరుకున్న ప్రణబ్‌ముఖర్జీ

ఢాకా: భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ఆదివారం ఢాకా వచ్చారు. బంగ్లాదేశ్‌లో ఆయన నాలుగురోజులపాటు పర్యటించనున్నారు. ఆదివారం ఇక్కడికి చేరుకున్న ప్రణబ్‌ముఖర్జీకి ఢాకాలో భారత హై కమిషనరు హర్షవర్ధన్ ష్రింగ్లా విమానాశ్రయంలో సాదరంగా స్వాగతం పలికారు.


చిరుతదాడిలో గాయపడ్డ యువకుడు సంతోష్

యువకుడిపై చిరుత దాడి..

పెంబి (ఖానాపూర్ గ్రామీణం), న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా పెంబి మండలం అక్షోనిమాడ గ్రామానికి చెందిన యువకుడు ఆత్రం సంతోష్‌పై చిరుతపులి దాడిచేసి గాయపర్చింది. ఆదివారం ఉదయం సంతోష్ చేను నుంచి ఇంటికి వెళుతుండగా చిరుతపులి ఒక్కసారిగా దాడి చేసింది. వెంట ఉన్నవారు పరుగెత్తుతూ గట్టిగా కేకలు వేయడం, కుక్కలు అరవడం, సంతోష్ ప్రతిఘటించడంతో వదిలేసి వాగు ఒడ్డున చెట్ల వేర్లలో నక్కింది. సంతోష్‌కు కాళ్లు, చేతులు, నడుం భాగంలో స్వల్ప గాయాలయ్యాయి. పెంబి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. అటవీశాఖ అధికారులు బాధితుడి కుటుంబ సభ్యులకు తక్షణ సాయం కింద రూ.ఐదు వేలు అందజేశారు. చిరుతను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాలవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వాగు నుంచి బయటికొచ్చి చెట్టెక్కి కూర్చున్న చిరుతను అడవిలోకి పంపేందుకు అటవీ అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించారు.

క్షిపణి ప్రయోగ హెచ్చరికలతో హవాయి బెంబేలు

వాషింగ్టన్, హొనలులు: అమెరికాలో భాగమైన హవాయి ద్వీప సముదాయాన్ని లక్ష్యంగా చేసుకొని క్షిపణి ప్రయోగిస్తున్నారంటూ హెచ్చరికలు రావడంతో ఇక్కడి ప్రజలు బెంబేలెత్తారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు అన్ని చరవాణులకూ అత్యవసర సందేశాలు వచ్చాయి. 'హవాయికి బాలిస్టిక్ క్షిపణి ముప్పు పొంచివుంది. ఇది విపత్తు నిర్వహణ సన్నాహక కసరత్తు కాదు. వెంటనే ఎక్కడివారు అక్కడి పరిసరాల్లోని భవనాల్లో తలదాచుకోండి'అని వీటి సారాంశం. దీంతో అందరూ భయంతో పరుగులుతీశారు. పదేపదే క్షిపణి ప్రయోగాలతో అమెరికాకు ఉత్తర కొరియా కునుకులేకుండా చేస్తున్న సమయంలో తాజా ఘటన చోటుచేసుకుంది. అయితే 8.45 గంటలకు మళ్లీ సందేశాలు వచ్చాయి. 'క్షిపణి ముప్పేమీ లేదు. పొరపాటున ఆ హెచ్చరికలు జారీఅయ్యాయి'అని వీటిలో పేర్కొన్నారు. మరోవైపు మానవ తప్పిదం వల్లే హెచ్చరికలు అందరికీ వెళ్లిపోయాయని, ఓ ఉద్యోగి పొరపాటున తప్పు మీట నొక్కారని హవాయి గవర్నర్ డేవిడ్ ఇజ్ వివరణ ఇచ్చారు. అమెరికా పసిఫిక్ మహాసముద్ర విభాగం సైతం క్షిపణి ముప్పేమీలేదని స్పష్టీకరించింది.

లోపాలను అధిగమిస్తాం..!

- దీర్ఘకాలిక సెలవుపై వెళితే ఆ స్థానంలో మరో ఉపాధ్యాయుడు
- ఉన్నత పాఠశాలల్లో వృత్తి విద్య
- కేంద్రానికి విద్యాశాఖ దార్శనిక నివేదిక

ఈనాడు - హైదరాబాద్

సర్కారు బడులకు సంబంధించి పలు సమస్యలు.. లోపాలు ఉన్నాయని అంగీకరిస్తూనే వాటిని అధిగమించేందుకు వ్యూహాలను రూపొందించింది. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ నీతి ఆయోగ్ సూచన మేరకు పాఠశాల విద్యాశాఖ దార్శనికత-2024 పేరిట నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపింది. విద్య నాణ్యతను పెంచేందుకు పాటించే చర్యలను నివేదికలో పేర్కొంది. నివేదికలోని అంశాలిలా ఉన్నాయి.

లోపాలివీ..

- ఏకీకృత సర్వీసు నిబంధనల సమస్య న్యాయస్థానంలో ఉంది. దీనివల్ల ఉపాధ్యాయ విద్య, ఎంఈఓ, ఉప విద్యాశాఖాధికారి తదితర ఉద్యోగాలు భారీగా ఖాళీగా ఉన్నాయి. ఇది పరిపాలనాపరంగా.. పర్యవేక్షణపరంగా ప్రతికూల ప్రభావం చూపుతోంది.
- కేంద్ర ప్రభుత్వం సర్వ శిక్ష అభియాన్ కింద ఆమోదించిన నిధుల్లో కేవలం 30-40 శాతమే విడుదల చేస్తోంది. దీనివల్ల ప్రణాళికను అమలు చేయలేకపోతున్నాం. పాఠశాలల నిర్వహణ కింద సున్నం వేయాలన్నా.. మరమ్మతులు చేయాలన్నా, పారిశుద్ధ్య నిర్వహణ, కార్మికుల నియామకం, గ్రంథాలయం, ప్రయోగశాలలకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు లేవు.
- పాఠశాలల్లో తగినంతగా మౌలిక వసతుల్లేవు.
- 15-20 శాతం ఉపాధ్యాయులు, 25-30 శాతం విద్యార్థుల గైర్హాజరు ఉంటోంది.
- ఎస్సీ,ఎస్టీ, బాలికల్లోడ్రాపౌట్లు ఎక్కువ ఉంటున్నాయి.

అధిగమించే వ్యూహమిదీ..

- పట్టణ, నగర ప్రాంతాలకు వలస వచ్చే కుటుంబ పిల్లలకు పాఠశాలలు అందుబాటులో ఉంచేందుకు, ముఖ్యంగా మురికివాడల్లో బడుల సంఖ్యను పెంచుతారు. వీలుకాకుంటే రవాణా సౌకర్యం కల్పిస్తారు. ఉన్న పాఠశాలల్లో అదనపు సెక్షన్లు ప్రారంభిస్తారు.
- దీర్ఘకాలిక సెలవుపై వెళితే ఆ స్థానంలో మరో ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకుంటారు.
- అర్థంతరంగా చదువు మానేయకుండా ఆడుతూ పాడుతూ చదువుకునేలా ఆటలు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌ను ప్రవేశపెడతారు.
- డిజిటల్ తరగతి గదులను అభివృద్ధి చేస్తారు. దశల వారీగా అన్ని ఉన్నత పాఠశాలలకు అంతర్జాల సౌకర్యం కల్పిస్తారు. పాఠ్యపుస్తకాలను, డిజిటల్ పాఠశాలలను వెబ్‌సైట్లో పెడతారు.
- ఉన్నత పాఠశాలల్లో దశల వారీగా వృత్తివిద్య కోర్సులను ప్రవేశపెట్టి ఉద్యోగ నైపుణ్యం పెంచుతారు.

ఆరో మృతదేహం లభ్యం

- ఓఎన్‌జీసీ ఉద్యోగుల హెలికాప్టర్ ప్రమాదం

ముంబయి: ఓఎన్‌జీసీ (చమురు, సహజవాయువు సంస్థ) ఉద్యోగులు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కూలిపోయిన ఘటనకు సంబంధించి.. బాధితుల్లోని మరొకరి మృతదేహం ఆదివారంలభ్యమైంది. హెలికాప్టర్‌లోని సంభాషణల నమోదు పరికరం (వాయిస్ డేటా రికార్డర్)ను కూడా తీరగస్తీ దళం గుర్తించింది. శనివారం ముంబయి తీరంలోని అరేబియా సముద్రంలో ఈ ప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో హెలికాప్టర్‌లో ఐదుగురు ఓఎన్‌జీసీ ఉద్యోగులతోపాటు ఇద్దరు పైలెట్లు ఉన్నారు. వీరిలో ఐదుగురి మృతదేహాలు శనివారమే లభ్యమయ్యాయి. ఇప్పటివరకూ మొత్తం ఆరు మృతదేహాలను వెలికితీశారు. మిగిలిన మరో వ్యక్తిని గుర్తించేందుకు గాలింపు కొనసాగుతున్నట్లు ఓఎన్‌జీసీ తాజాగా పేర్కొంది. ఇటు వెలికితీసిన మృతదేహాలను.. బాధితుల కుటుంబాలకు అప్పగించినట్లు తెలిపింది. హెలికాప్టర్‌కు సంబంధించిన మిగతా శిథిలాలను వెలికితేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తీరగస్తీ దళం పేర్కొంది. ఐఎన్ఎస్ తారాస, ఐఎన్ఎస్ తేజ్ నౌకలతోపాటు తీరగస్తీ దళానికి చెందిన సముద్ర ప్రహారి, ఆచూక్, అగ్రిమ్ తదితర నౌకలు, ఓఎన్‌జీసీ నౌకలు కూడా గాలింపు చర్యల్లో పాల్గొంటున్నాయి.

ప్రవేశం పొందిన విద్యార్థినులకు ప్రత్యేక జాబితాను రూపొందించాలి!

ఐఐటీలకు కేంద్రం ఆదేశం

కోల్‌కతా: విద్యార్థినులకు ప్రత్యేకంగా మెరిట్ జాబితాను 2018-19 విద్యా సంవత్సరం నుంచీ తయారు చేయాల్సిందిగా ఐఐటీలను కేంద్రమానవ వనరుల అభివృద్ధి శాఖ ఆదేశించింది. ప్రతి ఐఐటీలోనూ విద్యార్థినులు 14% ఉండేలా చూడాలన్నదే కేంద్రం ఉద్దేశంగా ఉంది. ఉమ్మడి మెరిట్ జాబితా ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థినుల సంఖ్యను చూసిన తర్వాతే అధికారులు వారి వివరాలతో ప్రత్యేక జాబితాను ప్రకటిస్తారు. ఈ క్రమంలో ఏదైనా ఐఐటీలోని ఉమ్మడి మెరిట్ జాబితాలో విద్యార్థినుల సంఖ్య ఉన్నట్లు గుర్తించిన సందర్భాల్లో సదరు ఐఐటీ ఎక్స్‌ట్రా గర్ల్స్ - ఓన్లీ మెరిట్ జాబితాతో ముందుకు రావలసి ఉంటుంది.

సంకరజాతి పశువులే అధికమా!

- పశుగణనకు రంగం సిద్ధం



ఈనాడు, హైదరాబాద్ : దేశంలో సంకరజాతి పాడి పశువుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్లు ప్రాథమిక అంచనాల్లో వెల్లడైంది. నూతన పశుగణనకు ఏర్పాట్లు చేయాలని కేంద్రం తాజాగా ఆదేశాలు జారీచేసింది. ఏ తేదీల్లో నిర్వహించాలనేది త్వరలో వెల్లడిస్తామని తెలిపింది. దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో ఒకేసారి పక్షం రోజుల్లో పూర్తిచేయాలని సూచించింది. దేశంలో తొలిసారి 1919లో సమగ్రంగా పశుగణన జరిగింది. ఇంతకుముందు 2012 అక్టోబరులో 19వ సారి దేశవ్యాప్తంగా పశుగణన చేశారు. అప్పుడు మొత్తం 51.20 కోట్ల మూగ జీవాలున్నట్లు తేలింది. వాటిలో పాలు ఇచ్చే ఆవులు, గేదెలు 21.44 కోట్లు. ప్రతి ఐదేళ్లకోమారు ఇది పూర్తిచేయాలి. ఈ నిబంధన ప్రకారం 2017 అక్టోబరుకల్లా 20వ పశుగణన జరగాలి. కానీ ఈ సారి అంతా ఆన్‌లైన్‌లోనే నమోదు చేయాలనే ఉద్దేశంతో జాప్యం జరుగుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పాడి పశువులే కాకుండా కుక్కలు, పిల్లులు, ఒంటెలు, కోళ్లు, మేకలు...ఇలా మానవ సమాజంలో తిరిగే ప్రతీ జంతువును పశుసంవర్ధకశాఖ గణకులు లెక్కిస్తారు. ఇప్పటికే గ్రామాల్లో గణన ఎలా చేయాలన్నదానిపై గణకులకు శిక్షణ సైతం పూర్తిచేశారు. ఇంతకుముందు పశుగణన చేసినప్పుడు దేశవ్యాప్తంగా 2007తో పోలిస్తే 2012 నాటికి అన్ని పశువుల సంఖ్య 3.33 శాతం తగ్గింది. కానీ సంకరజాతి పాడి ఆవులు ఏకంగా 34 శాతం పెరిగాయి. ఇప్పుడూ తెలుగు రాష్ట్రాల్లో సంకరజాతి పాడి పశువులే అధికమవుతున్నాయని పశుసంవర్ధకశాఖ వర్గాలు వెల్లడించాయి. దేశవాళీ ఆవులు, గేదెలు పాలు అధికంగా ఇవ్వడం లేదని సంకరజాతి పెంపకానికే రైతులు మొగ్గుచూపుతున్నారు. దేశవాళీ నాటు ఆవుల సంఖ్యను పెంచాలని కేంద్రం ఇటీవల గోకుల్ మిషన్ పథకాన్ని ప్రత్యేకంగా ప్రారంభించింది. కనీసం 500 నాటు ఆవులున్నచోట వాటి సంరక్షణకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయాలన్నది ఈ పథకం ఉద్దేశం. నిజామాబాద్ జిల్లాలో ఇటువంటి కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దేశంలో ఉన్న గొర్రెల్లో 40.57 శాతంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నట్లు 2012లో తేలింది. ఈసారి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే 40 లక్షల గొర్రెలను కొని రాయితీపై పేదలకివ్వడంతో వీటి సంఖ్యలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానానికి చేరినట్లు అంచనా. త్వరలో పశుగణన చేపడతామని, అధికారికంగా గణాంకాలు వెల్లడించడానికి ఏడాది సమయం పట్టవచ్చని రాష్ట్ర పశుసంవర్ధక సంచాలకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు 'ఈనాడు'కు చెప్పారు.

ఆగిఉన్న ఆటోను ఢీకొట్టిన ట్రాలీ

నలుగురి మృతి

ఇల్లెందు పట్టణం, న్యూస్‌టుడే : వేగంగా వెళ్తున్న ట్రాలీ అదుపు తప్పి ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టడంతో నలుగురు మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బేతంపూడి సమీపంలో ఆదివారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం పంతుల్‌నాయక్‌తండాకు చెందిన మాలోతు మోతీలాల్, భార్య లత, తన ఇద్దరు పిల్లలతో కలిసి పాల్వంచలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి ఆటోలో వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఆటోలో మొత్తం ఎనిమిది మంది వరకు ఉన్నట్లు సమాచారం. బేతంపూడి గ్రామ సమీపంలోకి రాగానే మోతీలాల్ భార్య, పిల్లలు మూత్రవిసర్జన కోసం ఆటోను రహదారి పక్కనే నిలిపారు. మాలతి ఇద్దరు పిల్లలు ఆటో దిగి కొంత దూరం వెళ్లిన క్షణాల్లోనే ఇల్లెందు నుంచి కొత్తగూడెం వైపు వస్తున్న ట్రాలీ అతివేగంగా వచ్చి నిలిచి ఉన్న ఆటోను వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న గార్ల మండలం సీతంపేటకు చెందిన ఎర్రనాగుల రమేశ్‌తోపాటు ఇల్లెందుకు చెందిన రీమా(23), మరొకరు అక్కడికక్కడే మృతిచెందారు. కొత్తగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మోతీలాల్(45)మృతిచెందారు. జర్పుల వంశీ(22)కు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం తీసుకెళ్లారు. ఎస్పీ అంబర్ కిషోర్‌ఝా సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదతీరును పరిశీలించారు.

కోడలిపై మామ ఘాతుకం

అత్యాచారం చేసి నిప్పంటించాడు

బరిపాద: ఒడిశాలో దారుణం చోటుచేసుకుంది. మయూర్‌భంజ్ జిల్లాలో రామ్‌గోపాల్ ఖేమ్కా(55) అనే వ్యక్తి..ఇంట్లో ఒంటరిగా ఉన్న తన కోడలిపై శుక్రవారం అత్యాచారం చేశాడు. ఆ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెబుతానంటూ బాధితురాలు(23) బెదిరించడంతో ఆగ్రహించి.. ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. జంషెడ్‌పూర్‌లోని ఆస్పత్రిలో చేరిన ఆమె ఆదివారం మృతిచెందింది. ఖేమ్కాను పోలీసులు అరెస్టు చేశారు.

రూ.కోటి విలువైన పాత నోట్ల స్వాధీనం

చెన్నై, న్యూస్‌టుడే: రూ.కోటి విలువైన రద్దు చేసిన పాత నోట్లను తిరుచ్చిలో పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తొప్పంపట్టిలో ఓ కారు అతి వేగంగా రావడాన్ని గమనించిన పోలీసులు తనిఖీల్లో భాగంగా అడ్డుకున్నారు. దానిలో పరిశీలించగా పాత రూ. 1000 నోట్లు రూ. 77.5 లక్షలు, రూ. 500 నోట్లు రూ. 22.5 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. విచారణలో అందులో వచ్చిన వారు ఈరోడ్‌కి చెందిన విజయరాజ్, నామక్కల్ జిల్లా పరమతి వేలూరు వాసి విజయన్, సేలం వాసి వేలుస్వామి, తిరుచెంగోడు వాసి చిన్నతంబిలు అని తెలిసింది.

స్థిరీకరణ దిశలో!



సమీక్ష : విదేశీ మార్కెట్ల సానుకూలతల ప్రభావంతో గతవారం మన మార్కెట్ ఉత్సాహంగా ప్రారంభమైంది. రుణాల్లో రెండంకెల వృద్ధి, 2017లో భారత డెట్ మార్కెట్లలో మదుపర్లు రూ.1.5 లక్షల కోట్లు పెట్టుబడిగా పెట్టారన్న వార్తలతో మార్కెట్ జోరు కొనసాగింది. ఏప్రిల్- డిసెంబరులో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.6.56 లక్షల కోట్లుగా నమోదుకావడం కూడా సెంటిమెంటు బలపడేందుకు దోహదం చేసింది. అయితే దిగ్గజ కంపెనీల త్రైమాసిక ఫలితాలు వెల్లడికానుండటం, ముడి చమురు ధరలు పెరగడంతో మదుపర్లు ఆ తర్వాత లాభాలను స్వీకరించారు. బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకొని కూడా జాగ్రత్తగా వ్యవహరించారు. అయితే విమానయానం, స్థిరాస్తి, ఏకవర్తక రిటైల్ లాంటి రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనల్లో మార్పులకు కేంద్రం అనుమతినివ్వడంతో ఆయా రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆఖర్లో సుప్రీంకోర్టు పరిపాలనా వ్యవహారాలపై చోటుచేసుకున్న పరిణామాలు కొంత ప్రభావం చూపినప్పటికీ.. వారం మొత్తం మీద సెన్సెక్స్ 439 పాయింట్లు పెరిగి 34592 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 123 పాయింట్ల లాభంతో 10,681 వద్ద స్థిరపడింది. దేశీయ సంస్థాగత మదుపర్లు (డీఐఐలు/ ఫండ్లు) నికరంగా రూ.2,383 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐలు) నికర అమ్మకాలు రూ.965 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:1గా నమోదుకావడం ఎంపిక ఆధారంగా షేర్ల కొనుగోళ్లు జరిగాయనడాన్ని సూచిస్తోంది.


ఈవారంపై అంచనా } వరుసగా ఆరో వారాన్ని లాభాలతో ముగించడమే కాకుండా సూచీలు కొత్త జీవన కాల గరిష్ఠాలను తాకాయి. ముమ్ముందు కూడా వీటి జోరు కొనసాగేందుకు అవకాశం ఉన్నప్పటికీ.. కొంత స్థిరీకరణకు లోనుకావచ్చున్న విషయాన్ని కొట్టిపారేయలేం. ఒకవేళ సెన్సెక్స్ తిరోగమన బాట పడితే 34000 వద్ద మద్దతు లభించే అవకాశం ఉంది.

ప్రభావిత అంశాలు } కార్పొరేట్ కంపెనీల అక్టోబరు- డిసెంబరు త్రైమాసిక ఫలితాలు, విదేశీ మార్కెట్ల సంకేతాలు, ముడి చమురు ధరలు ఈవారం ప్రధానంగా మార్కెట్‌కు దిశానిర్దేశం చేస్తాయి. అలాగే శుక్రవారం విడుదలైన పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ), రిటైల్ ద్రవ్యోల్బణ (సీపీఐ) గణాంకాలను కూడా మార్కెట్ వర్గాలు పరిగణనలోకి తీసుకుంటాయి. నవంబరులో పారిశ్రామికోత్పత్తి వృద్ధి అంచనాలకు మించి నమోదవడం ఉత్సాహం నింపితే.. డిసెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 17 నెలల గరిష్ఠానికి చేరడం నిరుత్సాహపరిచింది. ఈవారం ఫలితాలు ప్రకటించే దిగ్గజ కంపెనీల్లో హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, భారతీ ఎయిర్‌టెల్ లాంటివి ఉన్నాయి. ఈ ఫలితాల ప్రభావం ఆయా కంపెనీల షేర్లపై ఉంటుంది. గతవారం ముడి చమురు ధరలు మూడేళ్ల గరిష్ఠానికి చేరడంతో.. మదుపర్లు ఈవారం చమురు ధరల కదలికలపై కన్నేసే అవకాశం ఉంది. ప్రస్తుత స్థాయిలకు మించి చమురు ధరలు మరింత పెరిగితే మార్కెట్ సెంటిమెంటుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అమెరికా, చైనాలు వెల్లడించే కీలక గణాంకాలపైనా మార్కెట్ వర్గాలు దృష్టి సారిస్తాయి. రూపాయి కదలికలు, ఎఫ్ఐఐలు/ డీఐఐల పెట్టుబడులు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయి.

తక్షణ మద్దతు సాయిలు: 34311, 33964, 33620; **తక్షణ నిరోధం సాయిలు:** 34800, 35100, 35350

లాభాలు కొనసాగినప్పటికీ.. కొంత స్థిరీకరణ చోటుచేసుకోవచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ



14న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

కోడి గుడ్లు			
హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లర (ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	406
బెంగళూరు	405	చెన్నై	405
15వ తేదీకి		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	406	నమక్కల్	395

వారి దయతో వీరి ప్రయాణమా..

- విమాన ఛార్జీలపై గరిష్ఠ పరిమితి విధించాలి
- అభివృద్ధి చెందిన దేశాల విధానం మనకు సరిపోదు
- సిబ్బంది దురుసు ప్రవర్తన, ప్రయాణికులపై దాడులపై దృష్టి పెట్టాలి
- కేంద్రానికి పార్లమెంటరీ స్థాయీ సంఘం నివేదిక

ఈనాడు, హైదరాబాద్: విమాన ప్రయాణికులకు అండగా నిలిచేందుకు తక్షణం మేల్కొనాలని, ప్రైవేటు విమాన సంస్థల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితి తప్పించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం కేంద్రానికి సూచించింది. అభివృద్ధి చెందిన దేశాల ఛార్జీల విధానం మనదేశంలో అనుసరణీయం కానే కాదని స్పష్టం చేసింది. ఛార్జీలపై నియంత్రణ లేకుండా చేయడమంటే... ప్రయాణికులను దోచుకోవడానికి అపరిమిత స్వేచ్ఛను ఇచ్చినట్లు కాదంది. ఇంధన ధరలు సగానికి సగం తగ్గినా, ఆ ప్రయోజనాలను ప్రయాణికులకు అందించట్లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రయాణాలను రద్దు చేసుకుంటే డబ్బులను వెనక్కి ఇవ్వకపోవడాన్ని తప్పుపట్టింది. ప్రయాణికుల పట్ల విమాన సిబ్బంది దురుసుగా, అమర్యాదగా ప్రవర్తించడం, దాడులు చేయడం పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. విమానయానం ఆనందమయం కావాలనీ, ప్రజల పట్ల 'పౌర విమానయాన సంస్థ' సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరింది. సీట్లు, ఆహార నాణ్యత, ఇతర సదుపాయాలపైనా వెంటనే దృష్టి సారించాలని సూచిస్తూ- ఇటీవల తన నివేదికను కేంద్రానికి అందజేసింది. నివేదికలో ప్రస్తావించిన వివిధ ముఖ్యాంశాలు..



పదిరెట్లు ఎక్కువ ఛార్జీలా..

దేశ విమాన ఛార్జీల విధానం అభివృద్ధి చెందిన దేశాలకు వర్తించేదే తప్ప, మనకు అనుసరణీయం కాదు. ఇంధన (ఏటీఎఫ్) ధరలు గణనీయంగా తగ్గినా, ఆ మేరకు ఛార్జీలను తగ్గించట్లేదు. పండుగల వేళ, తక్కువ సమయం ప్రయాణానికి వసూలుచేస్తున్న ఛార్జీల విధానం సరికాదు. సాధారణ సమయంలో కంటే పది రెట్లు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. పౌరవిమానయాన శాఖ ప్రతి సెక్టర్‌లో కూడా విమాన టికెట్లకు గరిష్ఠ పరిమితిని విధించాలి.

రద్దు మొత్తం కనీసం ఛార్జీలో 50% మించకూడదు

విమాన టికెట్ల రద్దు ఛార్జీలకు సంబంధించి ఒక విధానం ఉండాలి. రద్దు చేసుకుంటే మొత్తం ఛార్జీలను కోల్పోతున్నారు. కనీస ఛార్జీలో 50 శాతం కంటే ఎక్కువ క్యాన్సిలేషన్ ఛార్జీలు ఉండకూడదు. టికెట్ రద్దు చేసుకున్న ప్రయాణికుల నుంచి పన్నులు, ఇంధన ఛార్జీలను వెనక్కి ఇవ్వాలి. రద్దు అనేది ప్రయాణికులకు భారం కాకుండా చూడాలి.

మార్గదర్శకాలు లేకుండా ఓపెన్‌స్కై విధానం

కేంద్ర ప్రభుత్వం తగిన మార్గదర్శకాలను రూపొందించకుండా ఓపెన్‌స్కై విధానం తీసుకువచ్చింది. విమానయాన సంస్థలను నియంత్రించే అంశాలపై దృష్టి సారించలేదు. నిబంధనలు, నియంత్రణ అంశాలను పట్టించుకోలేదు.

మూడోవంతు ఫిర్యాదులు సేవలవే

విమాన ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు పెరుగుతున్నాయి. 2017 సెప్టెంబర్ నెలలో 606 ఫిర్యాదులు రాగా, అక్టోబర్‌కు 656కి పెరిగాయి. వీటిలో 30.5 శాతం ప్రయాణికుల సేవలకు సంబంధించినవి. విమానాల రద్దు, ఆలస్యం వంటివాటికి సంబంధించినవి 16 శాతం, బ్యాగేజీ సమస్యలు 22 శాతం ఉండగా, విమాన సిబ్బంది ప్రవర్తనకు సంబంధించిని 7.5 శాతం.

సిబ్బంది ప్రవర్తన మారాలి

విమాన సిబ్బంది ప్రవర్తన గ్రౌండ్ సిబ్బంది, కేబిన్ క్రూ దురుసు ప్రవర్తన, ప్రయాణికులపై దాడి చేయడం, దయలేకుండా వ్యవహరించడం వంటి ఘటనలు ఎక్కువ జరుగుతున్నాయి. విమానయానం విస్తరిస్తూ, విమాన ప్రయాణికులు పెరుగుతున్న నేపథ్యంలో ఇది సరికాదు. విమానయానం అనేది సేవా పరిశ్రమ... సేవా పరిశ్రమ వినియోగదారులైన ప్రయాణికులకు స్నేహపూర్వకంగా, యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలి. సిబ్బందికి ప్రత్యేక శిక్షణపై విమాన సంస్థలు దృష్టి సారించాలి.

పది నిమిషాల్లో బోర్డింగ్ పాస్ తీసుకునేలా ఉండాలి

విమానప్రయాణంలో చెకిన్ విధానం, లగేజీ తీసుకోవడం అనేది చాలా గందరగోళంతో కూడుకున్నదే కాకుండా చాలా సమయం తీసుకుంటోంది. చెకిన్‌లో చాలా సమయం తీసుకోవడం వల్ల విమానాలను అందుకోలేకపోతున్నారు. ప్రైవేటు విమాన సంస్థల కౌంటర్ల వద్ద పొడవైన క్యూలు ఉంటున్నాయి. తగినంత సిబ్బంది చెకిన్ కౌంటర్లలో ఉండటంలేదు. బోర్డింగ్ పాస్ కోసం చెకిన్ కౌంటర్ల వద్ద ప్రయాణికులు పదినిమిషాలకంటే ఎక్కువ ఉండకుండా చూడాలి. రద్దీ ఉన్నపుడు ఎక్కువమంది సిబ్బందిని వినియోగించాలి. సెల్ఫ్ చెకింగ్ కియోస్క్‌లను ఏర్పాటు చేయాలి. దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో ఈ-బోర్డింగ్ సదుపాయం కల్పించాలి. రద్దీ వల్ల బోర్డింగ్ పాసు తీసుకోలేకపోయిన ప్రయాణికులు. సీట్ల కంటే ఎక్కువ టిక్కెట్లు ఇచ్చినపుడు వేరే విమానాల్లో ప్రయాణానికి ఏర్పాట్లు చేయాలి.

యాప్‌కు విస్తృత ప్రచారం కల్పించాలి

విమాన ప్రయాణికుల ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి తీసుకువచ్చిన ఎయిర్‌సేవా యాప్ విస్తృతంగా వినియోగించేలా చూడాలి. దేశంలో ఏటా 16 కోట్లమంది విమానప్రయాణం చేస్తుండగా ఫిర్యాదులకు సంబంధించి అందుబాటులోకి తెచ్చిన ఈ యాప్‌ను కేవలం 20 వేలమందిమాత్రం డౌన్‌లోడ్ చేసుకున్నారు. గత ఏడాది వీటి ద్వారా ఆరు వేల ఫిర్యాదులు వచ్చాయి. ఈ యాప్‌పై ప్రచారం కల్పించడమే కాకుండా దీని ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- ✦ మధుమేహరోగులు సహా ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఆహారాన్ని లోకాస్ట్ విమానాల్లో కూడా డబ్బులు చెల్లించి ఆహారం తీసుకునేందుకు అవకాశం కల్పించాలి.
- ✦ విమానాల్లో తగిన లెగ్ స్పేస్ ఉండటంలేదు. కనీస లెగ్ స్పేస్‌కు సంబంధించి పౌరవిమానయాన సంస్థ మార్గదర్శకాలను రూపొందించాలి.
- ✦ తనిఖీలు చేసే సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రయాణికుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. ప్రయాణికులతో స్నేహపూర్వకంగా వ్యవహరించేలా వీరికి సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ ఉండాలి.
- ✦ ఇమిగ్రేషన్ కౌంటర్లలో విదేశీ ప్రయాణికులు, సహా అందరు ప్రయాణికుల పట్ల ఎలా వ్యవహరించాలనే అంశాలపై వారికి సాఫ్ట్ స్కిల్స్ కలిగించాలి.
- ✦ విమాన ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాల కల్పన, విస్తరించడం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అత్యవసరంగా పెరగాలి.
- ✦ విమానాశ్రయాల్లో విదేశీ విమానాలకు ఎక్కువ అవకాశం కల్పిస్తూ స్వదేశీ విమానాలకు అవకాశాలను తగ్గించడం సరికాదు. కేంద్రం దీనిపై దృష్టి సారించాలి.

ఎయిరిండియా ఉద్యోగులకు పీఎస్‌యూల్లో ఉద్యోగం!

ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదన

దిల్లీ: ఎయిరిండియాలో వాటా విక్రయ ప్రతిపాదన నేపథ్యంలో సంస్థ ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు వివిధ మార్గాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఉద్యోగులకు ప్రభుత్వ రంగ సంస్థల్లో చేరే అవకాశాన్ని కల్పించడం ఇందులో ఒకటని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. స్వచ్ఛంద పదవీ విరమణ ప్యాకేజీ ఇచ్చే (వీఆర్ఎస్) ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోందని తెలిపాయి. అయితే వీటిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నాయి. ప్రస్తుతం ఎయిరిండియా, దాని అనుబంధ సంస్థల్లో ఒప్పంద ఉద్యోగులు సహా 29,000 మంది పనిచేస్తున్నారు.

డబ్ల్యూఈఎఫ్ 'తయారీ'లో భారత్‌కు 30వ స్థానం

దిల్లీ/ జెనీవా: ప్రపంచ తయారీ సూచీలో భారత్ 30వ స్థానాన్ని పొందింది. చైనా (5వ స్థానం) కంటే మనం వెనక ఉండగా.. బ్రిక్స్‌లోని ఇతర దేశాలతో (బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా) పోలిస్తే మెరుగైన ర్యాంకును పొందాం. వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) రూపొందించిన నివేదికలో ఈ ర్యాంకులను ఇచ్చింది. ఇందులో జపాన్‌కు అగ్రస్థానం దక్కగా.. దక్షిణ కొరియా, జర్మనీ, స్విట్జర్లాండ్‌లకు రెండు, మూడు, నాలుగు ర్యాంకులు లభించాయి. చెక్ రిపబ్లిక్, అమెరికా, స్వీడన్, ఐర్లాండులు తొలి 10 స్థానాల్లో చోటు దక్కించుకున్నాయి.

అల్యూమినియం అమ్మండి!

కమొడిటీస్ ఈ వారం

బంగారం, వెండి

పసిడి ఫిబ్రవరి కాంట్రాక్టు గతవారం రూ.29,193 వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత స్వల్పంగా దిద్దుబాటుకు లోనై రూ.29,121కి దిగివచ్చింది. అమెరికా నిరుద్యోగ క్లెయిమ్‌లు, ఫెడ్ తయారీ సూచీ గణాంకాలు వెల్లడయ్యాక కాంట్రాక్టు పుంజుకోవడం ప్రారంభమైంది. చివరకు 1.21% లాభంతో రూ.29,547 వద్ద ముగిసింది. ఈ వారం జోరు కొనసాగే అవకాశం ఉంది. అయితే అధిక స్థాయిల వద్ద ఎన్ని రోజుల పాటు నిలుదొక్కుకుంటుందన్నదే కీలకం. ఈవారం కాంట్రాక్టు కనీసం ఒక్క రోజైన రూ.29,875 స్థాయిని మించకంటే.. అమ్మకాల ఒత్తిడి ఎదురుకావచ్చు. సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటే రూ.29,775- 29,885 స్థాయిలకు దరిదాపులో లాంగ్ పొజిషన్లు ఉన్నవారు లాభాలను స్వీకరించడం మంచిది. గత వారం రూ.39,245 వద్ద ఆరంభమైన వెండి మార్చి కాంట్రాక్టు ఆ తర్వాత రూ.38,666కి పడిపోయింది. అనంతరం కోలుకున్నప్పటికీ వారం మొత్తం మీద 0.38% నష్టంతో రూ.39,096 వద్ద స్థిరపడింది. ఈవారం రూ.38,306 స్థాయి దిగువన ట్రేడ్‌కాకుంటే.. కాంట్రాక్టు సానుకూలంగా చలించేందుకు అవకాశం ఉంది.

ప్రాథమిక లోహాలు

రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం ఒక్క రోజైన రూ.451 దిగువన చలిస్తే.. మరింత డీలా పడి రూ.446కు పడిపోయే అవకాశం ఉంది. అందువల్ల షార్ట్‌సెల్ పొజిషన్లు కొనసాగించడం మంచిది. సీసం జనవరి కాంట్రాక్టు రూ.165 కంటే పైన కదలాడకంటే రూ.159.60; ఆ తర్వాత రూ.157.10కి దిగివచ్చే అవకాశం ఉంది. జింక్ జనవరి కాంట్రాక్టు ఈవారం కూడా సానుకూలంగా కనిపిస్తున్నప్పటికీ, రూ.219.10 దరిదాపుల్లో లాంగ్ పొజిషన్ల నుంచి బయటకు వచ్చేయడం మేలు. అల్యూమినియం జనవరి కాంట్రాక్టును ఈవారం అధిక స్థాయిల వద్ద విక్రయించడం ఉత్తమం. నికెల్ జనవరి కాంట్రాక్టును రూ.777 లక్ష్యంతో రూ.783 దిగువన విక్రయించొచ్చు.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ (నవంబరు కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (ఫిబ్రవరి)	452.75	453.15	0.09
సీసం (జనవరి)	162.40	161.50	(0.55)
జింక్ (జనవరి)	216.55	217.60	0.48
అల్యూమినియం(జనవరి)	139.35	141.00	1.18
నికెల్ (జనవరి)	790.40	803.80	1.70
ముడి చమురు (జనవరి)	3,900	4,070	4.36
సహజ వాయువు(జనవరి)	178.80	204	14.09
శెనగలు(జనవరి)	3,945	4,151	5.22
ధనియాలు (జనవరి)	5,300	5,652	6.64
సోయాబీన్ (జనవరి)	3,175	3,213	1.20

ఇంధన రంగం

ముడి చమురు జనవరి కాంట్రాక్టుకు ఈవారం కూడా లాభాలు కొనసాగొచ్చు. అయితే ఫిబ్రవరి కాంట్రాక్టు ప్రారంభమయ్యాక అధిక స్థాయిల వద్ద అమ్మకాల ఒత్తిడి ఎదురుకావచ్చు. రూ.3,881- 3,993 మధ్య లాంగ్ పొజిషన్లు తీసుకోవచ్చు. అదే రూ.3,776 దిగువున లాంగ్ పొజిషన్లకు దూరంగా ఉండాలి. సహజ వాయువు జనవరి కాంట్రాక్టు ఈవారం రూ.208; ఆ తర్వాత 2013 వరకు పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఈ స్థాయిల వరకు లాంగ్ పొజిషన్లను కొనసాగించొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు

శెనగలు జనవరి కాంట్రాక్టు ఈవారం సానకూలంగా కనిపిస్తోంది. లాంగ్ పొజిషన్లు అట్టేపెట్టుకోవడంతో పాటు మరిన్ని జతచేసుకోవడం కూడా మంచిదే. ధనియాలు జనవరి కాంట్రాక్టుకు ఈవారం అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. సోయా బీన్ జనవరి కాంట్రాక్టు ఈవారం రూ.3,260; ఆ తర్వాత రూ.3,307 వరకు పెరగొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ & డెరివేటివ్స్

కోస్టల్ ప్రాజెక్ట్స్ దివాలా ప్రక్రియ ప్రారంభం

- ఎస్‌బీఐ దరఖాస్తును అనుమతించిన ఎన్‌సీఎల్‌టీ
- రూ.975.27 కోట్ల బకాయి
- రుణదాతలు దరఖాస్తు చేసుకోవడానికి ప్రకటన జారీ

ఈనాడు, హైదరాబాద్: తీసుకున్న రుణాన్ని చెల్లించడంలో విఫలమైనందున కోస్టల్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌పై కార్పొరేట్ దివాలా ప్రక్రియను ప్రారంభించడానికి కోల్‌కతా నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) అనుమతించింది. రూ.975.27 కోట్ల రుణ బకాయిని చెల్లించకపోవడంతో కోస్టల్ ప్రాజెక్ట్స్ దివాలా ప్రక్రియను చేపట్టాలని, ఈ ప్రక్రియ నిమిత్తం దివాలా పరిష్కార నిపుణుడు (ఐఆర్‌పీ)ని నియమించాలంటూ ఎస్‌బీఐ దరఖాస్తు చేసింది. రుణ బకాయి వసూలు కోసం కోస్టల్ ప్రాజెక్ట్స్‌కు అన్ని అవకాశాలు ఇచ్చినట్లు ఎస్‌బీఐ తరఫున సిరిల్ అమర్‌చంద్ మంగలదాస్ సంస్థ న్యాయవాది బిశ్వజిత్ దూబె ఎన్‌సీఎల్‌టీకి నివేదించారు. వాదనలను విన్న ఎన్‌సీఎల్‌టీ ఎస్‌బీఐ నుంచి రుణం తీసుకున్నామంటూ కంపెనీ ధ్రువీకరించిన విషయాన్ని ఉత్తర్వుల్లో పేర్కొంది. రుణం చెల్లించడంలో విఫలమైనందున కార్పొరేట్ దివాలా ప్రక్రియను కొనసాగించడానికి బెంగళూరుకు చెందిన రవిశంకర్ దేవరకొండను ఐఆర్‌పీగా నియమించింది. కోస్టల్ ప్రాజెక్ట్స్ రుణదాతలతో సమావేశం నిర్వహించి తీర్మానాలను సమర్పించాలని ఆదేశించింది. కోస్టల్ ప్రాజెక్ట్స్ రుణదాతల వివరాలు సమర్పించడానికి వీలుగా ప్రకటన జారీ చేయాలని ఆదేశించింది. కోస్టల్ ప్రాజెక్ట్స్‌కు ఆస్తి లావాదేవీలపై నిషేధం విధించింది. తదుపరి కార్యాచరణ నిమిత్తం విచారణను ఈనెల 18వ తేదీకి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో కోస్టల్ ప్రాజెక్ట్స్ రుణదాతల వివరాలు సమర్పించడానికి వీలుగా ఐఆర్‌పీ ఈనెల 9న ప్రకటన జారీ చేస్తూ ఈనెల 19లోగా వివరాలను సమర్పించాలని సూచించారు.

స్టాక్ మార్కెట్ ఈ వారం

సూచీల్లోనూ సంక్రాంతులే

- కొత్త జీవన గరిష్ఠాలకు!
- త్రైమాసిక ఫలితాలపై దృష్టి
- దాదాపు అన్ని రంగాలకూ సానుకూలతలు

గత వారంలో నాలుగు సార్లు రికార్డు గరిష్ఠ స్థాయిల వద్ద మార్కెట్లు ముగిశాయి. ఈ వారమూ ఆ జోష్ కొనసాగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో చాలా తక్కువ శ్రేణికి లోబడి చలనాలు ఉండొచ్చని అంటున్నారు. ఇన్ఫోసిస్ ఫలితాలు రాణించిన నేపథ్యంలో ఐటీ షేర్లపై మార్కెట్ దృష్టి సారించొచ్చు. అమెరికా మార్కెట్లకు సోమవారం సెలవు. ఈ నేపథ్యంలో ఇతరత్రా మార్కెట్లు, స్థానిక రాజకీయ పరిణామాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. గురువారం జరగనున్న జీఎస్‌టీ మండలి సమావేశంపైనా ఓ కన్నేయవచ్చు. నిఫ్టీకి 10695-10735 శ్రేణిలో నిరోధం; 10590-10620 శ్రేణిలో మద్దతు కనిపించొచ్చని సాంకేతిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లు ఈ వారం కొత్త గరిష్ఠ స్థాయిలను చేరొచ్చని చెబుతున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

ఐటీ: ప్రతికూల ధోరణిలో చాలా తక్కువ శ్రేణికి లోబడి కదలాడవచ్చు. మదుపర్లు లాభాలను స్వీకరించే అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో ఐటీ షేర్లు చాలా ఎక్కువగా లాభపడడం ఇందుకు నేపథ్యం. విప్రో, మైండ్ ట్రీ ఫలితాలు ఈ వారం వెలువడనున్నాయి. గత వారం 7% దాకా లాభపడ్డ ఇన్ఫోసిస్ షేర్లకు రూ.1120 వద్ద నిరోధం; రూ.1010 వద్ద మద్దతు కనిపిస్తుంది. టీసీఎస్‌కు రూ.2900 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. రూ.2700 వద్ద మద్దతు ఉంది. ఈ వారం టెక్ మహీంద్రాను పరిశీలించొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

సిమెంటు: ఈ నెల నుంచి సిమెంటుకు గిరాకీ పెరుగుతుందన్న అంచనాల మధ్య ఈ రంగ షేర్లు సానుకూలంగా కదలాడవచ్చు. ఏసీసీ బలంగా కనిపిస్తోంది. రూ.1840 నిరోధ స్థాయిని అధిగమిస్తే రూ.1920ను తాకొచ్చు. గురువారం అల్ట్రాటెక్ సిమెంట్ ఫలితాలున్నాయి. అంబుజా సిమెంట్స్ రూ.264-276 శ్రేణిలో కదలాడవచ్చు. అల్ట్రాటెక్ సిమెంట్‌కు రూ.4320 వద్ద మద్దతు; రూ.4510 వద్ద నిరోధం కనిపిస్తోంది.

లోహ: ఫలితాలు బాగుంటాయన్న అంచనాల మధ్య లోహ, గనుల కంపెనీలు సైతం సానుకూలంగా ఉండొచ్చు. హిందాల్కో, టాటా స్టీల్, వేదాంతాలు రాణిస్తాయన్న భావనలున్నాయి. హిందుస్థాన్ జింక్ గురువారం ఫలితాలను వెల్లడించనుంది. సగటు అంచనాల ప్రకారం రూ.2631 కోట్ల లాభం; రూ.5953 కోట్ల విక్రయాలు నమోదు కావొచ్చు.

యంత్ర పరికరాలు: ఈ వారం కూడా లాభాలు కొనసాగనున్నాయి. స్వల్పకాలంలో ఎల్ అండ్ టీ పెరిగే అవకాశం ఉంది. ఆర్డర్లు భారీగా వస్తుండడం ఇందుకు నేపథ్యమని సాంకేతిక నిపుణులు అంటున్నారు. రూ.1380 వద్ద నిరోధం కనిపిస్తోందంటున్నారు. రూ.579 కోట్ల ఆర్డరు నేపథంలో సీమెన్స్ పైనా సానుకూలంగానే ఉన్నారు. ఇది రూ.1350 స్థాయి వరకు పెరగవచ్చని అంచనా కడుతున్నారు. భెల్‌కు రూ.108.50 వద్ద నిరోధం; రూ.101 వద్ద మద్దతు కనిపిస్తోంది. .

చమురు: ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు ఈ వారం స్థిరీకరణకు గురికావొచ్చు. ఐఓసీ, బీపీసీఎల్‌లకు అంతర్లీనంగా ప్రతికూల ధోరణి కనిపిస్తుండగా.. హెచ్‌పీసీఎల్‌కు సానుకూలతలు కనిపిస్తున్నాయి. ఐఓసీకి రూ.380 వద్ద మద్దతు; రూ.396 వద్ద నిరోధం కనిపిస్తున్నాయి. బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లకు వరుసగా మద్దతు స్థాయిలు రూ.482; రూ.410 వద్ద; నిరోధ స్థాయిలు రూ.494, రూ.440 వద్ద ఉన్నాయి.

వాహన: మారుతీ సుజుకీ, టాటా మోటార్స్‌లు రాణిస్తాయన్న అంచనాలున్నాయి. ఇటీవల మారుతీ ధరలు పెంచడం వల్ల కంపెనీకి వ్యయాలపై ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు. జనవరి 25న వెలువడే సంస్థ ఫలితాలు సైతం సానుకూలంగా ఉండొచ్చన్న అంచనాలున్నాయి. మారుతీ సుజుకీ రూ.9600 స్థాయికి పెరగవచ్చు. టాటా మోటార్స్ సైతం రూ.445కు చేరొచ్చు.

ఎఫ్‌ఎమ్‌సీజీ: డిసెంబరు, జనవరి విక్రయాల్లో రాణింపు కారణంగా ఈ రంగ షేర్లు రాణించొచ్చని అంచనా. హెచ్‌యూఎల్ రూ.1344-1399; ఐటీసీ రూ.263-273 స్థాయిలో కదలాడవచ్చు. ఐటీసీ ఫలితాలు 19న విడుదల కానున్నాయి. అంతక్రితం ఏడాది అక్టోబరు-డిసెంబరుతో పోలిస్తే ఈ సారి కంపెనీ సిగరెట్ ఆదాయాలు 7% మేర పెరగవచ్చని అంచనా. కంపెనీ వ్యవసాయ, హోటల్ వ్యాపార గణాంకాలను మదుపర్లు సునిశితంగా పరిశీలించొచ్చు.

టెలికాం: భారతీ ఎయిర్‌టెల్, ఐడియాలపై ఈ వారం అందరి దృష్టి పడనుంది. దేశీయ అంతర్ అనుసంధాన ఛార్జీల తగ్గింపు ప్రభావం డిసెంబరు త్రైమాసికంలో ఈ కంపెనీలపై ఎలా ఉంటుందో మదుపర్లు గమనించొచ్చు. అయితే రిలయన్స్ జియోకు ఈ పరిణామం ప్రయోజనకరంగా ఉండొచ్చు. గురువారం భారతీ ఎయిర్‌టెల్; శుక్రవారం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటే జియో ఫలితాలు ప్రకటితం కానున్నాయి. భారతీ రూ.490-540; ఐడియా రూ.100-115 మధ్య కదలాడవచ్చు. ఆర్ఐఎల్ రూ.1000 దిశగా పరుగులు తీయవచ్చు.

బ్యాంకింగ్: సానుకూల ధోరణే కనబడుతోంది. బ్యాంక్ నిఫ్టీకి రూ.25,800 వద్ద నిరోధం ఎదురుకావొచ్చని.. 25500 వద్ద మద్దతు లభించొచ్చని ఒకవేళ భారీ విక్రయాలు కనిపిస్తే 25300 వద్ద మద్దతు దొరకబుచ్చుకోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ వారంలోనే ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లు ఫలితాలను విడుదల చేయనున్నాయి.

ఈవారం ఫలితాలు

నేడు: డెల్టాకార్ప్, ఫెడరల్ బ్యాంక్, గ్యాలంట్ ఇస్పాత్, జీ లెర్న్

రేపు (మంగళ): ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, రిలయన్స్ నిప్పన్ లైఫ్, నెట్‌వర్క్ 18 మీడియా, టీవీ 18 బ్రాడ్‌కాస్ట్, ఎంసీఎక్స్, ఆగ్రో టెక్ ఫుడ్స్, హట్సన్ ఆగ్రో ప్రోడక్ట్స్, ఎస్‌హెచ్ కేల్కర్ అండ్ కంపెనీ

17న (బుధ): అదానీ పవర్, అదానీ ట్రాన్స్‌మిషన్, డీసీబీ బ్యాంక్, హిందుస్థాన్ యునిలీవర్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, జుబిలెంట్ లైఫ్ సైన్సెస్, జ్యోతీ లేబొరేటరీస్, మైండ్ ట్రీ, జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్, శ్రేయీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టెరిలైట్ టెక్నాలజీస్, టాటా స్పాంజ్ ఐరన్

18న (గురు): అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్, సైయెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, యెస్ బ్యాంక్, డీబీ కార్ప్, దీపక్ నైట్రేట్, హిందుస్థాన్ జింక్, జుబిలెంట్ ఇండస్ట్రీస్, కిర్లోస్కర్ ఇండస్ట్రీస్, మాస్టెక్, జెన్సార్ టెక్నాలజీస్

19న (శుక్ర): రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, విప్రో, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్, అతుల్, జుబిలెంట్ ఫుడ్ వర్క్స్, కన్సాయ్ నెరోలాక్ పెయింట్స్, ఎన్ఐఐటీ టెక్నాలజీస్, పీసీ జువెల్లర్స్, టాటా ఎలెక్సీ, వీఎస్‌టీ, జై ప్రకాశ్ అసోసియేట్స్

20న (శని): చెన్నై పెట్రోలియమ్ కార్పొరేషన్, డీసీఎం శ్రీరామ్, గృహ ఫైనాన్స్

ఆ రైతు మధురం!


మధు చందన్

• సేంద్రియ సాగుకు దారిచూపిన యువకుడు • మండ్యలో సాగు సిరుల పంట

ఓ యువకుడు పంతం పట్టాడు... పట్టెడన్నం పెట్టే రైతన్నను అప్పుల ఊబి నుంచి బయట పడేయాలని... కనుమరుగవుతున్న సహకార ఉద్యమానికి ఊపిరి పోయాలని.. విషాహారం తింటున్న జనానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని.. అంతే.. ఇంకేమీ ఆలోచించకుండా ముందడుగేశాడు. విదేశాల్లో ఉన్న ఉద్యోగాన్నీ, స్థాపించిన కంపెనీనీ వదిలేసి వచ్చాడు. మొదటి అడుగు ఎప్పుడూ ఒంటరే కదా.. అయినా వెనకడుగు వేయలేదు... అందుకే అప్పుడా యువకుడు వేసిన అడుగుకు ఇప్పుడు తొమ్మిదివేల అడుగులు తోడయ్యాయి. అది ఓ మహోద్యమమైంది. మహోన్నతంగా సాగుతోంది. ఆ అడుగేసిన యువకుడి పేరు మధు చందన్... 35ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. దేశవ్యాప్తంగా కుప్పకూలుతున్న సహకార సంఘాలకు ఆదర్శప్రాయమైన సంఘాన్ని ఆవిష్కరించారాయన. రుణాల ఊబిలో కూరుకుపోతున్న రైతాంగాన్ని పైకి లాగేందుకు చేయూతనిచ్చారు. భారీ పెట్టుబడి లేకుండా, ప్రకృతికి హానికరం కాని సేంద్రియ సాగుకు ఊపిరులూదారు. జనం 'విషాన్ని' తినకుండా కాపాడుతున్నారు.

కె.ఆదినారాయణ
ఈనాడు ప్రతినిధి, బెంగళూరు

మధు చందన్ స్వస్థలం కర్ణాటకలో చక్కెర సీమగా వినుతికెక్కిన మండ్య. 15ఏళ్ల పాటు అమెరికా, ఇంగ్లాండ్, ఫిలిప్పీన్స్, ఆఫ్రికా, ఇజ్రాయెల్ తదితర 12 దేశాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా ఆయన పని చేశారు. అమెరికాలోని శాన్‌జోస్‌లో సొంతంగా సాఫ్ట్‌వేర్ సంస్థను వెరిఫయా పేరుతో స్థాపించారు. ఇప్పటికీ ఆయన అందులో భాగస్వామి. కానీ సొంత జిల్లాలో అన్నదాతల వరుస ఆత్మహత్యలతో చలించిపోయారాయన. మూడేళ్ల కిందట స్వదేశానికి వచ్చి.. ఆర్థిక సమస్యల్ని అధిగమిస్తే ఇలాంటి అనర్థాల్ని తప్పించవచ్చని భావించి రైతాంగానికి సేంద్రియ సాగును ఆసరా చేశారు. మైసూరు-బెంగళూరు రహదారిలో మండ్య శివార్లలో వెలసిన ఆర్గానిక్స్ మండ్య సూపర్ మార్కెట్, దాని పక్కనే ఉన్న సేంద్రియ ఆహారాల హోటల్, వెనుక ఉన్న సేంద్రియ పంటల క్షేత్రం చూస్తే మనకు మధు చందన్ కృషి కనిపిస్తుంది. దేశవ్యాప్తంగా కష్టాల పాలవుతున్న రైతు సహకార వ్యవస్థకే ఆదర్శంగా నిలిచిన ఈ కృషీవలుడిని 'ఈనాడు' పలకరించింది. ఈ సందర్భంగా 'మండ్య సేంద్రియ ప్రస్థానాన్ని' ఆయన వివరించారు.

ఆర్గానిక్స్ మండ్య స్థాపించడానికి కారణాలేమిటి?

అప్పుడప్పుడూ అమెరికా నుంచి మా ఊరికి వచ్చినప్పుడు బెంగళూరులోని మిత్రులు, బంధువుల్ని కలుసుకునేవాడిని. నగరంలో ఏ ఆటో రిక్షా ఎక్కి డ్రైవరును మీది ఏ ఊరని అడిగేవాడిని. హోటళ్లలో ఆహారాన్ని తిన్నప్పుడూ అందించిన వారినీ, శుభ్రం చేసిన కార్మికుల్నీ ఏ ఊరని అడిగేవాడిని. వారిలో ఎక్కువ మంది నాగమంగళ, మేలుకోటె, పాండవపుర, మావళ్లి, మద్దూరు, కె.ఎం.దొడ్డి ఇలా.. మా మండ్య జిల్లాలోని ఊర్ల పేర్లే చెప్పేవారు. కావేరి నదీమతల్లి కరుణ కటాక్షాలతో సిరులు పొంగిన గడ్డ మాది. 1980లలో వేసవి సెలవులకు మా తాతల ఇళ్లకు వెళ్లినప్పుడు మా చేతుల్లో ఆ కాలంలోనే రూ. 200, 300 పెట్టేవారు అవీ ఇవీ కొనుక్కుని తినేందుకు. అంతటి సుసంపన్నమైన ఊళ్లు మావి. అంతటి ఊళ్లలో ఎందుకీ దీనావస్థని ఆలోచించా. వారి కోసం ఏమైనా చేస్తే బాగుండనిపించింది. మా ఊరు మండ్య సమీపంలోని సూగళ్లి. 2014లో మా జిల్లాలోనే అత్యధికంగా 150 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇది మరింత కలచి వేసింది. మా పక్క ఊరు కీలారకు మిత్రుల సాయంతో వెళ్లి ఇల్లిల్లూ తిరిగి ఆర్థిక సమస్యల గురించి మాట్లాడినప్పుడు అవగాహన కలిగింది. పంట దిగుబడుల కోసం రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాలు విపరీతంగా పెరిగాయని అర్థమైంది. విపణి శక్తులవల్ల ఆదాయమూ సన్నగిల్లింది. మరోవైపు పండగలు, పబ్బాల పేరిట జీవన వ్యయం పెరిగింది. ఫలితంగా రైతులు రుణాల ఊబిలో కూరుకు పోయారని తెలిసింది. ఒకప్పుడు ప్రతి ఇంటి వెనుకా కూరగాయల తోట ఉండేది. అన్ని రకాల ఆకు కూరలు, కూరగాయల్ని సాగు చేసేవారు. మా అధ్యయనంలో కీలారలో అవీ మాయమయ్యాయి. ప్రతి నెలా ఆకు కూరలు, కూరగాయలకు ఒక్కో ఇంటిలో ఆ పల్లెలోనే రూ.ఐదారు వందలు వ్యయం చేస్తున్నట్లు తేలింది. అందుకే సమస్యకు అక్కడి నుంచే పరిష్కారాన్ని కనుగొనాలని సంకల్పించాం. స్థానిక మిత్రులు కొందరు కలసి రైతులందరూ తమ పెరళ్లలో కూరగాయల తోటల్ని ప్రారంభించాలని పైసా ఖర్చు కాని ప్రచారం చేశాం. సానుకూల స్పందన లభించింది.


సూపర్ మార్కెట్ లోపలి భాగం

మండ్య సేంద్రియ సాగు రైతుల	
సహకార సంఘం సభ్యులు	: 9,000
నిరుటి డివిడెండ్	: 20%
ఆర్గానిక్ మండ్య ప్రారంభించిన 2014–15లో చేసిన వ్యాపారం	: రూ.1.4 కోట్లు
2015–16లో వ్యాపారం	: రూ.4.5 కోట్లు
2017–18లో వ్యాపారం (అంచనా)	: రూ.8.9 కోట్లు

సహకార సంఘాన్ని ఎలా ప్రారంభించారు?

మేం పండించిన కూరగాయల్లో ఇళ్లలో వాడుకోగా మిగిలిన వాటిని ఏం చేయాలి? ఎవరూ కొంటారని కొందరు రైతులు ప్రశ్నించారు. వారి సమస్య సమంజసమైనదే అనిపించి పరిష్కారంగా సూపర్ మార్కెట్ ఏర్పాటు చేశాం. ఇది నడిచేందుకు నిరంతరం పంటలు రావాలి. అందుకే సహకార సంఘాన్ని ప్రారంభించాం. హాప్‌కమ్స్ (పండ్ల తోటల ఉత్పత్తిదార్ల సహకార మార్కెటింగ్, ప్రాసెసింగ్ సొసైటీ). దీనిద్వారా మార్కెట్లో ఉన్న కొనుగోలు ధర కంటే 20శాతం ఎక్కువ ధరకు కూరగాయల్ని కొంటాం. బహిరంగ విపణి ధర అంత కంటే ఎక్కువగా ఉంటే మీరు అక్కడా అమ్ముకోవచ్చనే షరతుతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాం. సహకార సంఘంలో చేరాలని చుట్టుపక్కల గ్రామాల రైతుల్ని కోరాం. రూ.వేయి వంతున వాటా ధనాన్ని చెల్లించారు. వారి ఆశల్ని వమ్ము చేయలేదు. నిరుడు 20 శాతం డివిడెండ్‌గా చెల్లించాం.

సేంద్రియ సాగుకు రైతులు ఆసక్తి చూపారా?

ఆ సాగువల్ల కలిగే లాభాల రుచి చూపాం. నెమ్మదిగా ఇతరులూ చేరారు. వీటన్నింటి కంటే అతి ముఖ్యమైనదేమంటే.. రసాయనానికి ఎరువులు, పురుగు మందులతో సాగు చేసిన పంటల్ని ప్రజలకు అందించడంవల్ల కలిగే నష్టాల్ని వివరించాం. దీంతో మనసు మార్చుకుని సేంద్రియ సాగుకు మళ్లారు. 250 మందితో మొదలైన సహకార సంఘం సభ్యుల సంఖ్య మూడేళ్ల వ్యవధిలో 9వేలకు పెరిగింది. సుభాష్ పాలేకర్ ప్రతిపాదించిన ప్రకృతిసేద్యాన్నే చేస్తున్నాం. ప్రకృతి సేద్యంలోని జీవామృతం, బీజామృతాల్ని రైతులు అనుసరిస్తున్నారు. యువతకూ సేంద్రియ సాగు విలువ తెలిపేందుకు ప్రయత్నిస్తున్నాం. బెంగళూరు, మైసూరుల్లోని కార్పొరేట్, సమాచార, జీవ సాంకేతిక సంస్థల్లోని ఆసక్తి గల సిబ్బంది ప్రతి శని, ఆదివారాల్లో మా వ్యవసాయ క్షేత్రానికి వచ్చి సేద్యం చేస్తుంటారు.

ఏయే సేంద్రియ ఉత్పత్తులు లభిస్తున్నాయి?

బియ్యం, బెల్లం, చముర్లు, గోధుమ, తృణ ధాన్యాలు వంటి 215 రకాలను విక్రయిస్తున్నాం. మొదట్లో 10 శాతం సరకుల్ని మండ్య నుంచి మిగిలిన 90 శాతాన్ని ఇతర ప్రాంతాల నుంచి సమీకరించేవాళ్లం. ఇప్పుడు పరిస్థితి మారింది. 70శాతాన్ని మండ్య ప్రాంతం నుంచే సేకరిస్తున్నాం.

కొనుగోలుదారుల స్పందన ఎలా ఉంది?

మైసూరు ప్రాంతంలో నూటికి పైగా దేశీయ వరి రకాలున్నాయి. ఇందులో 15 రకాలను పండిస్తున్నాం. ఎంతో రుచికరమైన వీటిలో నార శాతం ఎక్కువ. ఆరోగ్యానికి మంచిది. రాజముడిని ఈ ప్రాంత రైతులు మైసూరు మహారాజుకు కానుకలుగా సమర్పించేవారు. ఈ బియ్యంతో వండిన అన్నం రుచి అత్యద్భుతం. ఇక గన్‌సాలే రకానికి సాటిలేదు. దాని అన్నం చందనం పరిమళాలతో ఘుమఘుమలాడుతుంటుంది. ఇలాంటి దేశీయ రుచులు సహజంగానే మన వారిని ఆకట్టుకుంటున్నాయి. ఒక కిలో రాజముడి రకం బియ్యాన్ని రైతుల నుంచి రూ.58కి కొంటాం. రూ.90కి విక్రయిస్తాం. గతంలో రైతులకు క్వింటాలుకు రూ.1500 అందేది. ఇప్పుడు రూ.4వేల వరకూ అందుతోంది.


సూపర్ మార్కెట్

మూడేళ్ల ప్రయాణంలో ఇబ్బందులు తలెత్తలేదా?

కొందరిని చూసి మరీ ఇంత మోసమా అని? తిరిగి అమెరికా వెళ్లిపోతే బాగుండేదని అనుకున్నాను. అయితే 90, 95 శాతం మంది మంచి వాళ్లున్నారు. ఇంత చిన్న దానికే లక్ష్యాన్ని వదలి పెట్టడం మంచిది కాదని ఇక్కడే ఉన్నాను. 2014లో ఇక్కడి వచ్చిన తర్వాత మళ్లీ అమెరికా పోలేదు.


మీ వ్యాపార విజయ సూత్రం ఏమిటి?

విదేశాల్లోనే కాకుండా మన దేశంలోనూ పాలకులు, అధికార యంత్రాంగం ఒక ప్రణాళికను రచించి అమలు చేస్తున్నాయి. దీని వల్ల ఇంత లాభం, ఇంత మందికి ప్రయోజనం అని లెక్కలు కడుతున్నారు. మన దేశానికి అది సరిపడదు. నేను సమస్యలకు పరిష్కారాల్ని వెదుక్కుంటూ ముందుకు పోయాను. అంతే తేడా. హోటల్, సూపర్ మార్కెట్ ఇలాంటివే. బెంగళూరు-మైసూరు మధ్య ప్రతి రోజూ కొన్ని వేల పర్యాటకుల వాహనాలు సంచరిస్తుంటాయి. పర్యాటకుల్ని ఆకట్టుకునేందుకు సేంద్రియ ఆహార పదార్థాల హోటల్‌ను స్థాపించాం. దాని పక్కనే సూపర్ బజారు నెలకొల్పాం. మండ్య నుంచి సేంద్రియ ఉత్పత్తుల్ని దేశం నలుమూలలా విక్రయిస్తున్నాం. ఈ కామర్స్ సంస్థ అమెజాన్‌తో అవగాహన కుదిరింది. కన్యాకుమారి నుంచి దిల్లీ వరకూ, అహ్మదాబాద్ నుంచి కోలకతా వరకూ మా కొనుగోలుదారులు విస్తరించి ఉన్నారు.



స్వయం ఉపాధి వైపు తరలండి

యువతకు రాష్ట్రపతి కోవింద్ పిలుపు



ముంబయి: ఉద్యోగాల వైపు కాకుండా స్వయం ఉపాధివైపు మొగ్గుచూపాలని యువతకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ముద్ర', 'స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా' వంటి పథకాలు అందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. స్వయం ఉపాధిని గౌరవనీయమైన వృత్తిగా చూడాలని చెప్పారు. దీనిపై ప్రజలకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించాలని అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్) అనుబంధ సంస్థ 'రాంభావ్ మాల్గి ప్రబోధిని' ఆదివారమిక్కడ ఏర్పాటుచేసిన 'ఆర్థిక ప్రజాస్వామ్య సదస్సు' ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ఈ మేరకు మాట్లాడారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం: సమాజంలో ప్రతిఒక్కరూ హింసను విడనాడి దయాగుణం అలవర్చుకోవాలని రాష్ట్రపతి కోవింద్ పిలుపునిచ్చారు. బుద్ధుడి బోధనలు అందరికీ అనుసరణీయమని ఆయన పేర్కొన్నారు. 'విపాసన' బోధకుడు సయాగ్యి యు బా ఖిన్ వర్ధంతిని పురస్కరించుకొని మహారాష్ట్రలోని గోరైలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కోవింద్ ఈ మేరకు మాట్లాడారు. విపాసన కోర్సులు అభ్యసించేలా ఉద్యోగులను ప్రోత్సహిస్తున్నందుకుగాను మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసించారు.

ప్రధాని హత్తుకోవడంపై కాంగ్రెస్ విమర్శలు

దిల్లీ: ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు స్వాగతం పలుకుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆయనను హత్తుకోవడంపై కాంగ్రెస్ విమర్శలు చేసింది. మోదీ నుంచి ఇలాంటి ఆలింగనాలు మరిన్ని ఆశించవచ్చంటూ ట్వీట్ చేసింది. గతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రోన్‌లను హత్తుకున్నప్పటి వీడియోలను కూడా ఆ ట్వీట్‌కు జత చేసింది. ఆలింగన దౌత్యం అంటూ వ్యాఖ్యానించింది. దీనిని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జావ్‌డేకర్ విమర్శించారు. ఈ ట్వీట్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు. ఇది కాంగ్రెస్ అపరిపక్వతను, రాజకీయ పరిజ్ఞాన శూన్యతను సూచిస్తోందని అన్నారు. ఇది ప్రధానికే కాకుండా, పర్యటనకు వచ్చిన అతిథికి కూడా అవమానకరమని, ఇందుకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు.

కీలక ఒప్పందాలపై భారత్-బ్రిటన్ సంతకాలు

లండన్: చట్టవిరుద్ధంగా బ్రిటన్‌లో నివసిస్తున్న భారతీయులను వెనక్కి తిప్పి పంపేయడానికి సంబంధించిన రెండు ఒప్పందాలపై భారత్-బ్రిటన్‌లు సంతకాలు చేశాయి. దాంతోపాటు నేరాలు, ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన రికార్డులను పరస్పరం తెలియచేసుకునే అంశం కూడా ఈ ఒప్పందంలో ఓ భాగంగా ఉంది. వ్యాపారవేత్త విజయ్ మాల్యా సత్వర అప్పగింతలో బ్రిటన్ సాయం కోసం భారత్ అభ్యర్థించిన నేపథ్యంలో ఈ ఒప్పందంపై సంతకాల పరిణామం చోటు చేసుకుంది. చట్టవిరుద్ధంగా ఇక్కడే కొనసాగుతున్న భారతీయులను సులువుగా గుర్తించి...సత్వరం వారిని స్వదేశానికి పంపించేందుకు ఈ ఒప్పందం గుర్తిస్తుంది. ఉభయదేశాల మధ్య కుదిరిన రెండు అవగాహన ఒప్పందాలపై భారత మంత్రి కిరణ్‌రిజిజు, బ్రిటన్ ఇమిగ్రేషన్ వ్యవహారాల మంత్రి కెరోలిన్ నోక్స్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందాలు ఉభయదేశాల మధ్య పెరిగిన పరస్పర సహకారానికి ప్రతీకలని బ్రిటన్ ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

పెరూలో భూకంపం: ఇద్దరు మృతి

రిక్టర్ స్కేలుపై తీవ్రత 7.3గా నమోదు

లిమా: దక్షిణ పెరూను ఆదివారం కుదిపేసిన భూకంపం తీవ్రతకు కనీసం ఇద్దరు వ్యక్తులు మరణించారు. 65 మంది గాయపడ్డారు. రిక్టర్ స్కేలుపై ఈ భూకంపం తీవ్రత 7.3గా నమోదైంది. జాతీయ పౌరరక్షణ సంస్థ ప్రతినిధి ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు.

ఆత్మీయ ఆహ్వానం.. పరవశించిన స్నేహం

- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు అపూర్వ స్వాగతం
- స్వయంగా విమానాశ్రయానికి వెళ్లిన ప్రధాని మోదీ

దిల్లీ

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆరు రోజుల భారత్ పర్యటన ఆదివారం అత్యంత ఆత్మీయ వాతావరణంలో ప్రారంభమయింది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి ఆయనను ఆహ్వానించారు. సాధారణంగా విదేశీ నేతలను రాష్ట్రపతి భవన్ వద్ద అధికారికంగా జరిగే కార్యక్రమంలో ఆహ్వానించడం సంప్రదాయం కాగా, తన ప్రియమైన మిత్రుని కోసం దానిని పక్కన పెట్టారు. స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి, నెతన్యాహును ఆయన భార్య శారాకు స్వాగతం పలికి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఆయనను ఆప్యాయంగా హత్తుకున్నారు. దేశాల మధ్యనే కాకుండా ఇద్దరు ప్రధానుల మధ్య వ్యక్తిగత స్నేహం ఉండడం ఇందుకు కారణం. అనంతరం ఇరువురు ప్రధానులు తీన్‌మూర్తి చౌక్‌ను తీన్ మూర్తి-హైఫా చౌక్‌గా నామకరణం చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇది కూడా రెండు దేశాల మధ్య ఉన్న ప్రత్యేక సంబంధాలు, ఉమ్మడి చరిత్రకు నిదర్శనమని ఇజ్రాయెల్ ప్రధాని వ్యాఖ్యానించారు. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఆయనతో భేటీ అయ్యారు. తనకు లభించిన విశేష స్వాగతం గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాత్రి నెతన్యాహు దంపతులకు ప్రధాని మోదీ ప్రయివేటు విందు ఇచ్చారు. రెండు దేశాల మధ్య సంబంధాలు మరో మెట్టుపైకి ఎదిగాయని ఇజ్రాయెల్ ప్రధాని వ్యాఖ్యానించారు. రక్షణ, చమురు, సహజవాయువు, పునరుత్పాదక ఇంధనం, విమానాశ్రయాలు, సైబర్ భద్రత, సినిమా, డాక్యుమెంటరీలు తదితర రంగాల్లో ఒప్పందాలు కుదరనున్నాయి. సోమవారం ఇండో-ఇజ్రాయెల్ సీఈవోల సదస్సులో నెతన్యాహు ప్రసంగిస్తారు. మంగళవారం రైసినా డైలాగ్ సమావేశంలో ఉపన్యసిస్తారు. బుధవారం అహ్మదాబాద్ వెళ్లి మోదీతో కలిసి సబర్మతి ఆశ్రమాన్ని, వద్రాద్‌లో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ప్రారంభిస్తారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భుజ్‌లో ఖర్జూరాల పరిశోధన కేంద్రాన్ని ఆవిష్కరిస్తారు. 18న ముంబయిలో వ్యాపారవేత్తలు, యూదులతో సమావేశమవుతారు. సినీ తారలతో నిర్వహించే షలోమ్ బాలీవుడ్ ఉత్సవానికి హాజరవుతారు. ముంబయి దాడుల్లో తల్లిదండ్రులను కోల్పోయిన ఇజ్రాయెల్ బాలుడు మోషే హోల్ట్జ్‌బర్గ్‌తో కలిసి ఛబాద్ హౌస్ కార్యక్రమంలో పాల్గొంటారు.


పాలం విమానాశ్రయంలో ఆప్యాయంగా హత్తుకుంటున్న ఇజ్రాయెల్, భారత్ ప్రధానులు నెతన్యాహు, మోదీ

హీబ్రూలోనూ మోదీ ట్వీట్

నెతన్యాహుకు స్వాగతం పలుకుతూ ప్రధాని మోదీ ఆంగ్లంతో పాటు, ఇజ్రాయెల్ భాష అయిన హీబ్రూలోనూ ట్వీట్ చేశారు. "నా మిత్రుడు ప్రధాని నెతన్యాహుకు భారత్‌కు స్వాగతం. ఇది రెండు దేశాల మధ్య ఉన్న సన్నిహిత స్నేహ బంధాన్ని మరింత దృఢపరుస్తుంది. షాలోమ్, నమస్తే" అని పేర్కొన్నారు.

పులకించిన నెతన్యాహు

మోదీ వచ్చి స్వాగతం పలకపడంపై పులకించిన నెతన్యాహు కృతజ్ఞతలు తెలుపుతూ ట్వీట్ చేశారు. "నా మంచి మిత్రుడు, భారత ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు. విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలికి ఆశ్చర్యపరిచారు. ఇద్దరం కలిసి రెండు దేశాల సంబంధాలను నూతన శిఖరాలకు తీసుకువెళ్దాం" అని పేర్కొన్నారు.

ఇజ్రాయెల్‌కు వరం: నెతన్యాహు

జెరూసలేం: భారత్ ఓ ప్రపంచ శక్తి అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అభివర్ణించారు. "ప్రపంచ ఆర్థిక, భద్రత, సాంకేతిక, పర్యాటక శక్తి"తో ద్వైపాక్షిక సంబంధాలు పెంపొందింప చేయాలన్న లక్ష్యంతో ఆదేశంలో పర్యటించనున్నట్టు తెలిపారు. భారత పర్యటనకు బయలుదేరడానికి ముందు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇజ్రాయెల్‌తో భారత్ దౌత్య సంబంధాలేర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. 2003లో (వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్నప్పుడు) అప్పటి ప్రధాని ఏరియల్ షరోన్ భారత్‌లో పర్యటించగా, 15 ఏళ్ల మళ్లీ తరువాత ఇజ్రాయెల్ ప్రధాని పర్యటించనుండడం విశేషం. 6 నెలలక్రితం భారత ప్రధాని ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఇజ్రాయెల్‌కు వెళ్లిన తొలిభారత ప్రధాని ఆయనే. ప్రపంచ శక్తితో సంబంధాలు మెరుగుపరచుకుంటున్నామని, ఇది ఇజ్రాయెల్‌కు వరమని నెతన్యాహు తెలిపారు.

తీన్ మూర్తి చౌక్‌కు 'హైఫా' జోడింపు

మధ్య దిల్లీలోని తీన్ మూర్తి చౌక్‌ను 'హైఫా తీన్ మూర్తి చౌక్'గా పేరు మార్చారు. వందేళ్ల క్రితం జరిగిన మొదటి ప్రపంచ యుద్ధంలో ఇజ్రాయెల్ నగరమైన హైఫాను రక్షించడంలో భారత సైనికులు చేసిన త్యాగాలకు గుర్తుగా గతంలో తీన్ మూర్తి చౌక్‌ను నెలకొల్పారు. శతవత్సర విజయోత్సవం సందర్భంగా దానికి హైఫా పేరును జత చేశారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమలో భారత్, ఇజ్రాయెల్ దేశాల ప్రధానులు నరేంద్ర మోదీ, బెంజమిన్ నెతన్యాహు పాల్గొన్నారు. అక్కడ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. సందర్శకుల పుస్తకంలో ప్రధాని మోదీ సైనికుల త్యాగాలను ప్రస్తుతించారు. 'మొదటి ప్రపంచ యుద్ధంలో హైఫా నగరం విముక్తికి భారతీయ సంప్రదాయంలో భాగంగా నిస్వార్థంగా బలిదానాలు, తపస్సు చేసిన భారతీయ సైనికులకు అభివందనం తెలియజేస్తున్నా' అని ఆ పుస్తకంలో రాశారు.

ఇక్కడ ఉన్న కాంస్య విగ్రహం 15వ ఇంపీరియల్ సర్వీసు అశ్వక దళాని(కేవలరీ బ్రిగేడ్)కి చెందిన హైదరాబాద్, జోధ్‌పూర్, మైసూరు శూలధారుల (లాన్సర్ల)కు గుర్తుగా ఏర్పాటు చేశారు. మూడు దళాలకు చిహ్నంగా తీన్ మూర్తి పేరుతో విగ్రహాన్ని రూపొందించారు. 1918 సెప్టెంబరు 23న జర్మన్లు, ఆస్ట్రియా-హంగేరి, ఒట్టొమన్ ఉమ్మడి సైన్యం హైఫాపై దాడి చేయగా; భారత సైన్యం సమర్థంగా ఎదుర్కొని ఆ నగరాన్ని కాపాడింది. ఆ కారణంగా ఇంగ్లండ్ ఆధ్వర్యంలోని సైన్యానికి ఈ నగరం ద్వారా అన్ని రకాల సామగ్రి సరఫరా చేయడానికి వీలు కలిగింది. ఈ యుద్ధంలో 41 మంది భారతీయ సైనికులు అమరులయ్యారు. అప్పటి నుంచి 61వ అశ్వక దళం సెప్టెంబరు 23న వ్యవస్థాపక దినం/హైఫా దినోత్సవమంటూ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.


తీన్ మూర్తి హైఫా చౌక్ వద్ద నివాళులర్పించి వెళ్తున్న ఇజ్రాయెల్, భారత్ ప్రధానులు నెతన్యాహు, మోదీ, నెతన్యాహు భార్య సారా

ఆంగ్ల పాఠ్యపుస్తకాల్లో కలాం జీవిత చరిత్ర!



దిల్లీ: 'భారతరత్న' అబ్దుల్ కలాం స్వీయచరిత్రకు సంబంధించిన కొన్ని అంశాలు ఇకపై ఆంగ్ల పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశంగా ఉండవచ్చు. ఎస్ఎస్‌సీ, హెచ్ఎస్‌సీ బోర్డులు నిర్దేశించే ఆంగ్ల పాఠ్యపుస్తకాల్లో అబ్దుల్‌కలాం జీవిత చరిత్ర అంశాలు ఉండాలన్న సూచనల నేపథ్యంలో 'సెంట్రల్ అడ్వయిజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్(సీఏబీఈ) సోమవారం నాడిక్కడ సమావేశమై ఇదే అంశంపై చర్చించనుంది. అంతేకాదు, ప్రాథమిక చికిత్స, ఆసుపత్రులు, వార్డుల నిర్వహణ వంటి అంశాల్లో స్వల్పకాలిక సర్టిఫికేట్ కోర్సులను నిర్వహించేందుకు 'వైద్యవిజ్ఞాన సంస్థ'ను ఏర్పాటు చేయాలని సీఏబీఈ సభ్యుడొకరు ప్రతిపాదన చేశారు.

సైనిక చర్యలతో పాటు చర్చలు: రావత్

దిల్లీ: జమ్ము-కశ్మీర్‌లో శాంతి నెలకొల్పడానికి సైనిక కార్యకలాపాలతో పాటు రాజకీయ ప్రయత్నాలూ కొనసాగాల్సి ఉందని భారత సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ అభిప్రాయపడ్డారు. ఆ రాష్ట్రంలో యథాతథస్థితి కొనసాగడానికి వీల్లేదని, పరిస్థితులకు అనుగుణంగా కొత్త వ్యూహాలను అమలు చేయాలని చెప్పారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రయత్నాలతో పాటు, ఇతర చర్యలను ఏకకాలంలో కలిసికట్టుగా అమలు చేయాలని అన్నారు. కశ్మీర్‌లో సుస్థిర శాంతి నెలకొనాలంటే రాజకీయ-సైన్య విధానం అమలు చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. కశ్మీర్‌కు చెందిన వివిధ వర్గాల నాయకులతో చర్చించేందుకు గత అక్టోబరులో ప్రత్యేక ప్రతినిధిగా నిఘా విభాగం మాజీ అధిపతి దినేశ్వర్ శర్మను నియమించిన నేపథ్యంలో ఆయన పై అభిప్రాయం వ్యక్తంచేశారు. 'సుస్థిర చర్చల కోసమే ప్రభుత్వం సంభాషణకర్తను నియమించింది. కశ్మీర్ ప్రజల వద్దకు వెళ్లాల్సిన ప్రభుత్వ ప్రతినిధి ఆయనే. వారి సమస్యలను రాజకీయ స్థాయిలో పరిష్కరించడానికి కృషి చేయాల్సిందీ ఆయనే' అని చెప్పారు.



పాకిస్థాన్‌పై ఒత్తిడి: కశ్మీర్‌కు ఉగ్రవాదులను పంపించకుండా నిరోధించే విషయమై పాకిస్థాన్‌పై మరింత ఒత్తిడి పెంచుతారా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను, ఎత్తుగడలను మార్చుతూ ఒత్తిడి పెంచాల్సి ఉందని తెలిపారు. గత ఏడాదిగా ఉగ్రవాద నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటున్నామని, పాక్ కాల్పుల విరమణ ఉల్లంఘనలను సమర్థంగా ఎదుర్కొంటున్నామని చెప్పారు. యువత ఉగ్రవాదంవైపు ఆకర్షితులవుతున్నారని, దీనిని అరికట్టడానికి కూడా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

భారత దౌత్యవేత్త అక్బరుద్దీన్ ట్విటర్ ఖాతాకు హ్యాకింగ్ దెబ్బ


అక్బరుద్దీన్

ఐరాస: ఐక్యరాజ్య సమితిలో భారత రాయబారిగా పనిచేస్తున్న సయ్యద్ అక్బరుద్దీన్ ట్విటర్ ఖాతా ఆదివారం హ్యాకింగ్‌కు గురైంది. ఖాతాలో అక్బరుద్దీన్ ఇండియాగా ఉన్న ఆయన పేరును అక్బరుద్దీన్ సయ్యద్‌గా హ్యాకర్లు మార్చారు. పాకిస్థాన్ అధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్ ఫొటోతోపాటు టర్కీ, పాక్‌ల జాతీయ జెండాల చిత్రాలను అందులో పోస్ట్ చేశారు. 'అవారా హూ' అని సాగే బాలీవుడ్ పాటను కూడా అప్‌లోడ్ చేశారు. హ్యాకింగ్‌ను గుర్తించిన ట్విటర్ సంస్థ ఆయన ఖాతాను తాత్కాలికంగా నిలిపివేసి.. అనంతరం పునరుద్ధరించింది. స్పందించిన అక్బరుద్దీన్.. ట్విటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'ఖాయిలా'కు సాయం అందేనా?

● తెలంగాణలో 15774 పరిశ్రమల ఎదురుచూపులు ● ప్రభుత్వంపైనే ఆశలు

ఈనాడు - హైదరాబాద్

- బాలానగర్‌లో శ్రీనివాస్ రూ.50 లక్షల బ్యాంకు రుణం తీసుకొని మెటల్ కంపొనెంట్ పరిశ్రమ స్థాపించారు. మొదట్లో బాగా నడిచింది. తర్వాత ఊహించని కష్టాలు వచ్చాయి. పరిశ్రమ మూతపడింది. అప్పు వడ్డీ మీద పడింది. చెల్లించడానికి నానా కష్టాలు పడుతున్నారు.
- పది లక్షల రుణం తీసుకొని చర్లపల్లి ఇంజినీరింగు పరిశ్రమ స్థాపించారు నర్సింగ్‌రావు. మొదట్లో లాభాలే వచ్చాయి. తర్వాత ఆర్డర్లు తగ్గాయి. ఉత్పత్తి నిలిచిపోయింది. బ్యాంకుకు అప్పు చెల్లించలేని దుస్థితిలో పరిశ్రమకు తాళాలు వేశాడు. దిక్కుతోచని పరిస్థితికి చేరుకున్నారు.

వీరిద్దరే కాదు ఇలా తెలంగాణవ్యాప్తంగా 15744 మంది ఖాయిలా చిన్న పరిశ్రమల యజమానులదీ దయనీయ పరిస్థితే. బాగా బతికినవారు... ఇప్పుడు బాధల్లో ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు కష్టాలు, ఆర్థిక సమస్యల వల్ల ఈ పరిశ్రమలు మూతపడ్డాయి. పారిశ్రామికవేత్తలు ఇంటిముఖం పట్టారు. పాత అప్పులు చెల్లించలేక, జీవనం గగనంగా మారి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు వారంతా రాష్ట్ర ప్రభుత్వం మీదే ఆశలు పెట్టుకున్నారు.

కష్టాల పర్వం..

హైదరాబాద్ చుట్టుపక్కల, ఇతర జిల్లాల్లో చాలా మంది పరిశ్రమలను స్థాపించారు. 90 శాతం మంది బ్యాంకుల్లో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టగా.. పది శాతం మంది ఆస్తులను అమ్ముకొని పరిశ్రమలను ప్రారంభించారు. 2008 నుంచి దాదాపు ఆరు సంవత్సరాల పాటు ఆయా పరిశ్రమలు కష్టాలను ఎదుర్కొన్నాయి. విద్యుత్ కోత, కొరతతో తల్లడిల్లాయి. అది ఉత్పత్తి మీద తీవ్ర ప్రభావం చూపింది. సకాలంలో వస్తువులను ఎగుమతి చేయలేకపోయారు. దీంతో ఆర్డర్లు తగ్గిపోయాయి. పెట్టుబడికి తగిన ఆదాయాలు రాక నష్టాలు మొదలయ్యాయి. అప్పులకు వడ్డీ చెల్లించలేని స్థితికి చేరుకున్నారు. ఒకటి, రెండు వాయిదాలు చెల్లించకున్నా బ్యాంకులు నోటీసులు ఇచ్చాయి. నిరర్థక ఆస్తులుగా ప్రకటించి, ఆయా సంస్థలను స్వాధీనంలోకి తీసుకున్నాయి.

తమ ప్రమేయం లేకుండానే తమ పరిశ్రమలు బ్యాంకుల పరంకావడం వాటి యజమానులను తీవ్రంగా బాధించింది. బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లి బతిమిలాడినా వారు మరో అవకాశం ఇవ్వలేదు. అప్పట్లో ప్రభుత్వాన్ని ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. ఇప్పటికీ రోజూ పరిశ్రమ వద్దకు వెళ్లి చూసుకొని వస్తున్నారు. తమ కష్టాలను తలుచుకొని కుమిలిపోతున్నారు.



ప్రభుత్వం ఆదుకునేనా

తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత ఖాయిలా పరిశ్రమల యజమానులు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, పరిశ్రమల మంత్రి కేటీఆర్‌ను కలిసి తమ గోడు వినిపించారు. ఆదుకోవాలని కోరారు. దీనికి సీఎం హామీ ఇచ్చారు. కేటీఆర్ చొరవతో రూ.100 కోట్లతో పరిశ్రమల పునరుద్ధరణ నిధిని ఏర్పాటు చేశారు. ఖాయిలా పరిశ్రమలపై ఇప్పటికే అధ్యయనం ప్రారంభమైంది. ప్రాథమిక అంచనా ప్రకారం ఒక్కో పరిశ్రమకు రూ. 4.5 లక్షల సగటు అప్పు ఉన్నట్లు తేలింది. దీని ఆధారంగా పునరుద్ధరణ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇదీ పరిస్థితి

- మొత్తం ఖాయిలా పరిశ్రమలు 15774
- వాటికి ఉన్న అప్పులు రూ.969.97 కోట్లు

సాయం చేస్తే తెలంగాణ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుంది

ఖాయిలా పరిశ్రమలను ఆదుకుంటే తెలంగాణ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుంది. ఇప్పటి వరకు దేశంలో ఏ ప్రభుత్వం కూడా మూతపడిన పరిశ్రమలను తెరిపించలేదు. ఆ ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుంది. ప్రభుత్వం పూనుకుంటే చిన్న పరిశ్రమల వారి జీవితాల్లో మళ్లీ వెలుగులు విరజిమ్ముతాయి.

-కె.సుధీర్‌రెడ్డి, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య అధ్యక్షుడు



యాదగిరిగుట్ట బాలాలయంలో కల్యాణమూర్తుల ఊరేగింపు

యాదాద్రిలో గోదా కల్యాణం


యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం రాత్రి శ్రీ గోదాదేవి పాండురంగనాథుల పరిణయోత్సవం జరిగింది. ధనుర్మాస పూజలు చేపట్టిన విష్ణుచింతుని కుమార్తె గోదాదేవికి శ్రీరంగనాథుడు ప్రసన్నమై వివాహమాడే పర్వాలను బాలాలయంలో పూజారులు నిర్వహించారు. వైష్ణవ ఆచారంగా అమ్మవారిని మండపంలో పెళ్లి కుమార్తెగా ముస్తాబు చేసి యాదగిరీశుడిని రంగనాథుడిగా తీర్చిదిద్ది కల్యాణోత్సవ తతంగాలను చేపట్టారు. ప్రధాన పూజారులు, స్థానాచార్యుల సమక్షంలో జరిగిన గోదాదేవి కల్యాణంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



మకరజ్యోతిని దర్శించుకుంటున్న అయ్యప్ప భక్తులు

మకర జ్యోతి దర్శనానికి పోటెత్తిన భక్తులు

శబరిమల(కేరళ): విశ్వవిఖ్యాత శబరిమలలో ఆదివారం వేలాది మంది 'మకరజ్యోతి' దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. దీంతో, రెండునెలల పాటు కొనసాగిన అయ్యప్పదీక్షలు పరిసమాప్తమైనాయి. 'సన్నిధానం' అంతా భక్తజనసందోహంతో కిటకిటలాడిపోయింది. 'స్వామియే శరణం అయ్యప్ప' అన్న భక్తుల స్వరాలతో శబరిగిరులు ప్రతిధ్వనించాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుంచి వెల్లువెత్తిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు.



మకరజ్యోతి దర్శనం

ఏటా పెరుగుతున్న ఇసుక ఆదాయం

- గతేడాది కంటే ఈయేడు ఇప్పటికే 64 కోట్లు అదనం
- మూడేళ్లలో రూ.1,300 కోట్ల రాబడి

ఈనాడు, హైదరాబాద్: ఇసుక ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఏటికేడాది పెరుగుతోంది. 2017-18లో జనవరి 10వ తేదీ నాటికే రూ. 498.37 కోట్ల ఆదాయం వచ్చింది. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఈ మొత్తం రూ. ఆరొందల కోట్లకు చేరుతుందని టీఎస్‌ఎండీసీ అంచనా. గత ఏడాదితోపోలిస్తే ఈ ఏడాది ఇప్పటికే 64 కోట్లకు పైగా ఆదాయం అదనంగా వచ్చింది. ఇసుక ద్వారా 2014 నుంచి చూస్తే ఇప్పటివరకు రూ. 1,300 కోట్ల ఆదాయం సమకూరింది.

పెరిగిన ఇసుక లభ్యత: రెండు, మూడు నెలల క్రితంతో పోలిస్తే తాజాగా ఇసుక లభ్యత పెరిగింది. గడువు ముగిసిన రీచ్‌లకు మళ్లీ అనుమతులు ఇవ్వడంతో ఇటీవలివరకు 20 ఉన్న రీచ్‌లసంఖ్య 26కు పెరిగింది. ఇసుక లభ్యత పెరగడం, వర్షకాలం దాటిపోవడంతో ఇసుక ధరలు కూడా కొంత తగ్గాయి. లారీల్లో వచ్చే ఇసుక హైదరాబాద్‌లో టన్ను రూ. 1,200-1,250 వరకు దొరుకుతోంది. తక్కువ మొత్తంలో విక్రయించే చిన్నవ్యాపారులు టన్నుకు రూ. 1,400 వరకు తీసుకుంటున్నారు. ఇసుక ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఓ వైపు ఆదాయం పెరుగుతుండగా మరో వైపు అక్రమరవాణా, నిబంధనల ఉల్లంఘనలతో నష్టం జరుగుతోంది. 2014 నుంచి 15,488 కేసులు నమోదయ్యాయి. టీఎస్‌ఎండీసీ గణాంకాల్ని పరిశీలిస్తే ఇటీవలికాలంలో కొత్త కేసులు నమోదు కావడం లేదని తెలుస్తోంది. ప్రస్తుత ఏడాదిలో సెప్టెంబరు నాటికి 2,819 కేసులు నమోదవగా.. డిసెంబరు నెలాఖరునాటికి సంఖ్యలో మార్పులేదు. క్షేత్రస్థాయి పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. పది లారీల్లో ఒకటి అనుమతి లేకుండా, అనుమతి ఉన్నవాటిలో పరిమితికి మించి అదనంగా ఇసుక నింపుతున్నారు. ఈ మేరకు సంబంధిత శాఖల క్షేత్రస్థాయి సిబ్బందికి మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలున్నాయి. టీఎస్‌ఎండీ వర్గాలు మాత్రం.. నిబంధనలు పక్కాగాఅమలు చేస్తున్నామని, టీఎస్‌ఎండీసీ రీచ్‌ల నుంచి ఇసుక అక్రమరవాణా జరగడం లేదని చెబుతున్నాయి.

సంవత్సరాల వారీగా ఇసుక ద్వారా వచ్చిన ఆదాయం, నమోదయిన కేసులు, జరిమానాల వివరాలు..

సంవత్సరం	ఆదాయం (రూ.కోట్లలో)
2014-15	రూ. 10.06
2015-16	రూ. 374.98
2016-17	రూ. 434.00
2017-18	రూ. 498.37 (జనవరి 10నాటికి)

సంవత్సరం	కేసులు	జరిమానా (రూ.కోట్లలో)
2014-15	1591	3.45
2015-16	5958	11.83
2016-17	5120	7.58
2017-18	2819	5.14



తల్లుల ప్రాంగణంలో భక్తజనులు

మేడారానికి భారీగా భక్త జనం

మేడారం, న్యూస్‌టుడే: మేడారం మహాజాతరకు సమయం ఆసన్నమవుతోంది. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఉత్సవం జరగనుంది. జాతర సమయంలో రద్దీని దృష్టిలో పెట్టుకొని భక్తజనులు ముందస్తుగా అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం రాష్ట్రం నలుమూలల నుంచి విశేషంగా తరలివచ్చిన భక్తులతో జయశంకర్ జిల్లాలోని సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణం సందడిగా మారింది. వేకువజాము నుంచే వాహనాలు మేడారం వైపు దారికట్టాయి. భక్తజనులు తొలుత జంపన్నవాగు స్నాన ఘట్టాలపై పుణ్య సాన్నమాచరించారు. కల్యాణ కట్టలపై పిల్లలకు తలనీలాల మొక్కులు సమర్పించుకున్నారు. శివసత్తుల పూనకాలతో జంపన్నవాగు స్నాన ఘట్టాలు, అమ్మల గద్దెల ప్రాంగణం మారుమోగాయి.

సంక్రాంతి రద్దీతో 50శాతం పెరిగిన రైలు ప్రయాణికులు

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారితో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్ల నుంచి సగటు కంటే 50శాతం ప్రయాణికులు అదనంగా వెళ్లారని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ స్టేషన్ల నుంచి సగటున నిత్యం రెండున్నర లక్షల మంది వెళ్తుంటారు. 10 నుంచి 13 తేదీల్లో సగటున రోజూ నాలుగు లక్షల మంది వరకు స్వస్థలాలకు వెళ్లారు. దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసిన ప్రత్యేకరైళ్లు, అదనపు బోగీలు రద్దీకి చాలకపోవడంతో ప్రయాణికులు బెర్తులు, సీట్లు లేకుండా ప్రయాణించాల్సి వచ్చింది. శనివారం కూడా సంక్రాంతి రద్దీ భారీగా కొనసాగింది. దీంతో దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్లలో శనివారం రాత్రి రద్దీని పరిశీలించారు. బోగీల్లో ప్రయాణికులతో మాట్లాడారు. సంక్రాంతితో పాటు అయ్యప్ప భక్తులకు వేసిన ప్రత్యేకరైళ్లతో రైల్వేశాఖకు భారీ ఆదాయం వచ్చింది. జోన్ పరిధిలో సగటున ప్రతిరోజు 10.20 లక్షల మంది రైళ్లలో ప్రయాణిస్తుంటారు. జనవరి 1 నుంచి 13 వరకు సగటున 10.80 లక్షల మంది ప్రయాణించారు. 20వ తేదీ వరకు రద్దీ ఉంటుందని, మొత్తంగా 20 రోజుల్లో అదనంగా ప్రయాణించేవారి సంఖ్య 12 లక్షలకు చేరుకుంటుందని రైల్వే వర్గాలు తెలిపాయి.

సంప్రదాయమంటూనే కత్తిగట్టారు!

- ఉభయగోదావరి జిల్లాల్లో చెలరేగిన కోడి
- భారీగా తరలివచ్చిన పందెపురాయుళ్లు
- అధునాతన హంగులతో నిర్వహణ
- గుండాట, ఇతర జూదాలు మామూలే





తూర్పుగోదావరి జిల్లా మురమళ్లలో బరిలో కొట్లాడుకుంటున్న కత్తులు కట్టిన కోళ్లు ★ పశ్చిమగోదావరి జిల్లా కలగంపూడి వద్ద కోడిపందేలకు పెద్దఎత్తున హాజరైన జనం

అమలాపురం, ఐ.పోలవరం, కంకిపాడు, న్యూస్‌టుడే, ఈనాడు డిజిటల్, భీమవరం, విజయవాడ: హైకోర్టు విస్పష్ట ఆదేశాలు, పోలీసుల హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోని పందెంరాయుళ్లు సంప్రదాయమంటూనే కోళ్లకు కత్తులు గట్టి నోట్ల కట్టలతో పందేలకు దిగారు. ఈ పందేల ముసుగులో పేకాట, గుండాట, కోసు లాంటి జూద క్రీడలు విచ్చలవిడిగా సాగాయి. ఉభయగోదావరి జిల్లాలతోపాటు కృష్ణా జిల్లాలోని పలుచోట్ల భోగి పండగ రోజైన ఆదివారం ఉదయం నుంచే బరుల చెంతకు పందెంరాయుళ్లు చంకన పుంజులతో వరుస కట్టారు. దాదాపు ప్రతిచోటా బహిరంగంగా కోళ్ల కాళ్లకు కత్తులు కట్టే పందేలు నిర్వహించారు. అప్పటివరకు హడావుడి చేసిన పోలీసులు అసలు సమయానికి పత్తా లేకుండా పోయారు. భోగి పండగ రోజునే తూర్పుగోదావరి జిల్లాలో రూ. 10 కోట్లు చేతులు మారినట్లు అంచనా. జిల్లాలో పెద్ద బరి అయిన ఐ.పోలవరం మండలం మురమళ్లలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పర్యవేక్షణలో పందేలు జరిగాయి. విద్యుత్తు దీపాలు, ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేసి పందేలను డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించి మరీ ప్రత్యక్ష ప్రసారం చేశారు. బౌన్సర్లతో పాటు వందమందితో భద్రతను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏకంగా పది బరులు ఏర్పాటు చేసి వెయ్యికి పైగా పందేలు నిర్వహించారు. పందేలు జరిగే ప్రాంగణంలో 30 గుండాట బోర్డులు ఏర్పాటు చేసి జూదరులు చెలరేగిపోయారు. తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా సుమారు 450 బరుల్లో తొలిరోజు పందేలు నిరాటంకంగా సాగాయి. సహ జూదాల ద్వారా రూ. కోటికి పైగా ప్రజల సొమ్ము నిర్వాహకుల జేబుల్లోకి వెళ్లినట్లు అంచనా. అక్కడక్కడా పందేల మాటున పేకాట శిబిరాలూ నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం సంప్రదాయ కోడి పందేలు నిర్వహించుకోవడానికి అవకాశం ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి సమాచారం రావడంతో బరుల వద్ద నుంచి పోలీసులు, రెవెన్యూ అధికారులు వెళ్లిపోయారు. పందెంరాయుళ్లు అప్పటికప్పుడు ఏర్పాట్లు చేసుకుని పందేలు ప్రారంభించారు. జిల్లాలోని యలమంచిలి మండలం కలగంపూడి, పాలకొల్లు మండలం పూలపల్లి, ఆకివీడు మండలం అయిభీమవరం, దెందులూరు మండలం శ్రీరామవరం, పెదవేగి మండలం కొప్పాక, వీరవాసరం మండలం కొణితివాడ, నిడమర్రు మండలం పత్తేపురం, పెనుమంట్ర మండలం పెనుమంట్ర, మార్టేరు, ఉండి మండలం మహదేవపట్నం, కాళ్ల మండలంలో సీసలి, మాలవానితిప్ప, జక్కరంలలో పందేలు జోరుగా జరిగాయి. అయిభీమవరంలో ఉండి శాసనసభ్యుడు శివరామరాజు, పారిశ్రామికవేత్త రఘురామకృష్ణంరాజు, పాలకొల్లులో ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు కోడిపుంజులను వదిలి పందేలు ప్రారంభించారు. యలమంచిలి మండలం కలగంపూడిలో భారీఎత్తున పందేలు జరిగాయి.

పోలీసులు, గ్రామస్థుల మధ్య తోపులాట: భీమవరం మండలం వెంప, శ్రీరాంపురం గ్రామాల మధ్య కోడిపందేల విషయమై పోలీసులు, గ్రామస్థుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. అన్నిచోట్లా కోడి పందేలకు అనుమతులిచ్చి తమకు ఎందుకు ఇవ్వరంటూ గ్రామస్థులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు బరి మధ్యలో కూర్చోవడంతో చివరకు పందేలు జరగలేదు.


సై అన్న కృష్ణా కోడి: కృష్ణాలోనూ కోడి పందేలు రాత్రింబవళ్లు నిర్వహించేలా షామియానాలు, ఫ్లడ్‌లైట్ల వెలుగులతో బరులను ఏర్పాటు చేశారు. జిల్లాలో సుమారు 70కి పైగా బరులు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ప్రధానంగా పెనమలూరు, తిరువూరు, జగ్గయ్యపేట, కైకలూరు, నందిగామ నియోజకవర్గాల్లో పెద్దఎత్తున డబ్బులు చేతులుమారాయి. కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని గొడవర్రులో నిర్వహిస్తున్న కోడి పందేల్లో వరుసగా మూడు పోటీల్లో విజయం సాధించిన పుంజుల యజమానులు మానికొండ ప్రభాకర్, కొసరాజు చిన్నిలకు ఆదివారం రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌ను ఎమ్మెల్సీ యలమంచిలి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు.

భోగి వేడుకల్లో జీఎమ్మార్



స్వీయ చిత్రాలకు సహకరిస్తున్న జీఎమ్మార్

రాజాం, న్యూస్‌టుడే: ఎక్కడున్నా.. ఎన్ని పనులున్నా.. సంక్రాంతి వచ్చిందంటే చాలు జీఎమ్మార్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు రాజాంలో వాలిపోతారు. సొంతింటికి చేరుకుంటారు. సరిగ్గా భోగి ముందు శ్రీకాకుళం జిల్లా రాజాం పట్టణంలోని కంచరవీధిలో ఏర్పాటు చేసిన భోగి మంట వద్దకు రావడం ఆయనకు మొదటి నుంచీ అలవాటు. అదే సంప్రదాయం ఈ ఏడాదీ కొనసాగించారు. ఆదివారం ఉదయం సరిగ్గా 6.15 గంటల సమయంలో భోగి మంట వద్దకు వచ్చి సందడి చేశారు. అక్కడివారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.



కుటుంబ సభ్యులు, స్థానిక పెద్దలతో కలసి నెల్లూరుకు సమీపాన గల వెంకటాచలంలోని సీనియర్ సిటిజన్స్ హోమ్ వద్ద భోగి పండుగ జరుపుకుంటున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దూరం దగ్గరైంది.. బకాయి భారమైంది!

- కిరోసిన్ టోకు వ్యాపారులు చెల్లించాల్సింది రూ.కోట్లలోనే..
- ఇప్పటికే 15 మందిపై వేటు

శ్రీరాంపూర్ (మంచిర్యాల), న్యూస్‌టుడే: పెద్ద మొత్తంలో బకాయి పడి చెల్లించడానికి వెనుకాడుతున్న కిరోసిన్ టోకు వ్యాపారులపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. నిల్వ కేంద్రాల నుంచి పంపిణీ కేంద్రాలకు కిరోసిన్ సరఫరా చేసే టోకు వ్యాపారులు రవాణా ఛార్జీల వ్యత్యాసాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 15 మంది వ్యాపారులను సస్పెండ్ చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కిరోసిన్ టోకు వ్యాపారులపై వేటు పడడానికి దారి తీసిన కారణాలు, బకాయిల భారంపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నీలి కిరోసిన్‌ను ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు మూడు చమురు కంపెనీల ద్వారా టోకు వ్యాపారులు కిరోసిన్‌ను పంపిణీ కేంద్రాలకు రవాణా చేస్తుంటారు. ఐఓసీ ద్వారా పంపిణీ చేసేవారు రామగుండం నుంచి, హెచ్‌పీసీఎల్ అయితే సూర్యాపేట, ఘట్‌కేసర్, బీపీసీ చర్లపల్లి (హైదరాబాద్) నుంచి కిరోసిన్‌ను ట్యాంకర్ల ద్వారా ఆయా జిల్లాల్లోని పంపిణీ కేంద్రాలకు రవాణా చేస్తారు. అక్కడి నుంచి జిల్లాలోని డీలర్లకు చేరవేస్తారు. ఈ క్రమంలో దూర, దగ్గరి ప్రాంతాలకు మధ్య రవాణా వ్యయంలో వ్యత్యాసం ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఈ వ్యత్యాసాలను పట్టించుకోకపోవడంతో దూర ప్రాంతాల నుంచి పంపిణీ చేసినవారు నష్టపోగా, దగ్గరి ప్రాంతాలవారు ఆర్థికంగా లాభపడ్డారు. రాష్ట్ర విభజన అనంతరం దూరాభారం వల్ల నష్టపోయిన టోకు వ్యాపారులు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్‌కు పరిస్థితిని వివరించగా, ఆయన ఆరా తీశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013 నుంచి రవాణా వ్యయంపై దృష్టి సారించలేదని తెలిసింది. కనీసం రికార్డులు కూడా నిర్వహించలేదని తేలడంతో ఈ పరిస్థితిని సమీక్షించాలని ఆయన నిర్ణయించారు.

చెల్లించడానికి వెనుకాడుతున్న టోకు వ్యాపారులు: దగ్గరి ప్రాంతాలవారు పొందిన లాభాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తే, నష్టపోయిన వ్యాపారులకు ఈ మొత్తాన్ని చెల్లించడం ద్వారా సమతూకం పాటించవచ్చని భావించిన కమిషనర్ పలు మార్లు టోకు వ్యాపారులతో సమావేశాలు నిర్వహించారు. రూ. 10 లక్షల వరకు బకాయిలు పడినవారు 2017 నవంబరు నుంచి 2018 ఫిబ్రవరిలోగా రెండు వాయిదాల్లో రూ. 5 లక్షల చొప్పున చెల్లించాలని కోరారు. రూ. 20 లక్షల మేరకు బకాయి ఉంటే ఎనిమిది సమాన వాయిదాలు, అంతకన్నా ఎక్కువ ఉంటే 2018 అక్టోబరు వరకు 12 నెలసరి వాయిదాల్లో తిరిగి జమ చేయాలని సూచించారు. దీనికి వ్యాపారులు సానుకూలంగా స్పందించలేదు. కొంతమంది వ్యాపారులు కోర్టును ఆశ్రయించారు. తప్పు చేసి కోర్టును ఆశ్రయించడం వల్ల ప్రయోజనం లేదని, 2015 ఏప్రిల్ నుంచి ప్రభుత్వం రవాణా ఛార్జీలను వర్తింపచేస్తోంది. భూగర్భ ట్యాంకులు లేని వ్యాపారులకు సైతం ఛార్జీల్లో తేడాలను సర్దుబాటు చేశారు. జీఓలను జారీ చేసి టోల్ ఛార్జీల ఇబ్బందులను తొలగించినా వ్యాపారులు కోర్టును ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది.

పక్క జిల్లాల వారికి బాధ్యతలు: బకాయిలు చెల్లించకుండా వ్యాపారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుండటంతో పౌర సరఫరాల శాఖ చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొండి బకాయిదారులపై వేటు వేసి, వారి బాధ్యతలను పక్క జిల్లాల వ్యాపారులకు అప్పగించింది. సస్పెన్షన్‌కు గురైన వారిలో మంచిర్యాల జిల్లా వ్యాపారుల్లో ఎంఆర్ అండ్ కంపెనీ దాదాపు రూ. 38 లక్షలు, సత్యజ్యోతి ట్రేడర్స్ రూ. 20 లక్షల మేరకు బకాయి పడ్డట్లు సమాచారం. దిల్లీ, పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో ఇప్పటికే కేంద్రం కిరోసిన్ పంపిణీని నిలిపివేసింది. భవిష్యత్తులో తెలంగాణలోనూ కిరోసిన్ పంపిణీ ఆపితే, తాము పెద్ద మొత్తం ప్రభుత్వానికి చెల్లించడం ఎందుకనే ఉద్దేశంతో టోకు వ్యాపారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

రాష్ట్ర రాజధానిలోనే అధిక బకాయిలు

ఒక్క హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పరిధిలోనే రూ. 10.12 కోట్ల మేరకు టోకు వ్యాపారులు బకాయి పడ్డారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులు 43 మంది, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందినవారు 23 మంది ఉన్నారు. ఇతర జిల్లాల నుంచి దాదాపు రూ. 2 కోట్ల మేరకు బకాయిలు పేరుకు పోయినట్లు సమాచారం. హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లో కిరోసిన్ పంపిణీ చేసే దూరం తక్కువగా ఉండటంతో ఈ ప్రాంతంలో తేడాలు అధికంగా ఉన్నాయి. రామగుండం కేంద్రంగా ఉన్న ఐఓసీ కంపెనీ నుంచి కిరోసిన్ రవాణా చేసిన మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ముగ్గురు వ్యాపారులు దాదాపు రూ. 70 లక్షల వరకు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఇక్కడ మిగతా డీలర్లకు ప్రభుత్వమే బకాయి పడింది.

బ్యాంకుల్లో పాసుపుస్తకాలు చేతికి వచ్చేదెలా!

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు కొత్తపాసుపుస్తకం పంపిణీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో గ్రామాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు పలు సందేహాలు కూడా తలెత్తుతున్నాయి. పంట రుణాలు తదితర కారణాలతో భూమి పత్రాలను బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన రైతులు కొత్త పుస్తకాల సందర్భంగా చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమౌతుంది. ప్రభుత్వం నుంచి కొత్త పుస్తకాలు పొందాలంటే పాతవి వెనక్కు ఇవ్వాల్సి ఉంటుంది. తీసుకున్న మొత్తాన్ని చెల్లించనిదే బ్యాంకులు పాతపుస్తకాలను వెనక్కు ఇస్తాయా అనే సందేహాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై ఓ విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు బ్యాంకులు తమ వద్ద ఉన్న రైతుల పాసుపుస్తకాల జాబితాపై నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ) జారీచేస్తే వారందరికీ కొత్తవి పొందేందుకు అవకాశాలు కల్పించొచ్చన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది. బ్యాంకులు కూడా పాతవాటికి కాలంతీరనున్న నేపథ్యంలో కొత్త పుస్తకాలను తమ పరిధిలోకి తెచ్చుకోవాల్సి ఉంటుంది. పంట రుణాలకు మాత్రం పాసు పుస్తకం కుదవ పెట్టుకోకుండానే ఇవ్వాలని ప్రభుత్వం సూచిస్తోంది. పాసు పుస్తకాలు చేతిలో లేని రైతుల పరిస్థితిని ప్రభుత్వం ఎలా పరిష్కరిస్తుందో వేచి చూడాలి.



180 పృథ్వీ షా, కల్రాల తొలి వికెట్ భాగస్వామ్యం. అండర్-19 ప్రపంచకప్‌లో భారత్‌కు ఇదే అత్యుత్తమం. 2004లో శిఖర్ ధావన్, రాబిన్ ఉతప్ప జోడీ 179 పరుగులతో నెలకొల్పిన రికార్డును వీళ్లు బద్దలు కొట్టారు.

ఛాంపియన్స్

కుర్రాళ్లు అదరగొట్టారు

అండర్-19 ప్రపంచ కప్‌లో భారత్ శుభారంభం

- ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆస్ట్రేలియాపై ఘనవిజయం
- మెరిసిన షా, కల్రా, శివమ్, నాగర్‌కోటి

అండర్-19 ప్రపంచకప్ ఫేవరెట్లలో ఒకటైన భారత యువ జట్టు.. టోర్నీని ఘనంగా ఆరంభించింది. తన తొలి మ్యాచ్‌లో మరో ఫేవరెట్ ఆస్ట్రేలియాను 100 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. బ్యాటుతో, బంతితో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన భారత కుర్రాళ్ల ముందు కంగారూ జట్టు నిలవలేకపోయింది.

మౌంట్ మౌంగానుయ్

పృథ్వీ షా నేతృత్వంలోని భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆస్ట్రేలియాను మట్టికరిపించింది. ఓపెనర్లు పృథ్వీ షా (94; 100 బంతుల్లో 8×4, 2×6), మన్‌జ్యోత్ కల్రా (86; 99 బంతుల్లో 12×4, 1×6).. మూడో నంబర్ బ్యాట్స్‌మన్ శుభమ్ గిల్ (63; 54 బంతుల్లో 6×4, 1×6) సత్తా చాటడంతో మొదట భారత్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 328 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం పేసర్లు శివమ్ మావి (3/45), నాగర్‌కోటి (3/29) సంచలన బౌలింగ్ ప్రదర్శన చేయడంతో ఆసీస్ 42.5 ఓవర్లలో 228 పరుగులకే ఆలౌటైంది. ఎడ్వర్డ్స్ (79; 90 బంతుల్లో 6×4, 1×6) ఒక్కడే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడాడు. ఎడ్వర్డ్స్ బంతితోనూ రాణించి 4 వికెట్లు పడగొట్టడం విశేషం. పృథ్వీ షా 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

ధనాధన్.. ఫటాఫట్: దేశవాళీ సంచలనం పృథ్వీ షా.. తొలి మ్యాచ్‌లోనే తన స్థాయి ఏంటో చూపించాడు. మెరుపు షాట్లతో జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. మరో ఓపెనర్ కల్రాది కూడా అంతే విలువైన ఇన్నింగ్స్. వీళ్లిద్దరూ తొలి వికెట్‌కు 178 బంతుల్లోనే 180 పరుగుల భారీ భాగస్వామ్యంతో జట్టును తిరుగులేని స్థితికి చేర్చారు. వికెట్ కోసం ఆసీస్ బౌలర్లు చేయని ప్రయత్నం లేదు. చివరికి 30వ ఓవర్లో కానీ వారికి ఫలితం దక్కలేదు. సెంచరీకి ఆరు పరుగుల దూరంలో షా వెనుదిరిగాడు. కాసేపటికే కల్రా కూడా ఔటయ్యాడు. తర్వాత ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యత శుభమ్ తీసుకున్నాడు. చివర్లో అభిషేక్ వర్మ (23; 14 బంతుల్లో 2×4, 2×6) మెరుపులు మెరిపించాడు. అనంతరం ఆసీస్ ఛేదన నత్తనడకన సాగింది. 15వ ఓవర్లో తొలి వికెట్ పడే సమయానికి ఆ జట్టు స్కోరు 57 పరుగులే. పేసర్లు శివమ్ మావి, నాగర్‌కోటి 145 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులేస్తూ ఆసీస్ బ్యాట్స్‌మెన్‌ను ఉక్కిరి బిక్కిరి చేశారు. వీళ్లిద్దరూ చెరో వైపు దాడి చేయడంతో ఆసీస్ పతనం వైపు సాగింది.

భారత్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) హోల్ట్ (బి) విల్ 94; మన్‌జ్యోత్ కల్రా (సి) సంఘా (బి) పరమ్ 86; శుభమ్ గిల్ (సి) అండ్ (బి) ఎడ్వర్డ్స్ 63; హిమాంశు రాణా (సి) ఆస్టిన్ వా (బి) ఎడ్వర్డ్స్ 14; అనుకుల్ (సి) సంఘా (బి) ఆస్టిన్ వా 6; అభిషేక్ శర్మ (సి) విల్ (బి) ఎడ్వర్డ్స్ 23; నాగర్‌కోటి నాటౌట్ 11; శివ సింగ్ (బి) ఎడ్వర్డ్స్ 10; జుయల్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 13 **మొత్తం:** (50 ఓవర్లలో 7 వికెట్లకు) **328; వికెట్ల పతనం:** 1-180, 2-200, 3-249, 4-272, 5-282, 6-298, 7-320; **బౌలింగ్:** బార్ట్‌లెట్ 7-1-47-0; రాల్‌స్టన్ 5-0-26-0; విల్ సదర్లాండ్ 10-0-55-1; జాక్ ఎడ్వర్డ్స్ 9-0-65-4; లాయిడ్ పోప్ 3-0-22-0; జొనాథన్ మెర్లో 2-0-13-0; పరమ్ ఉప్పల్ 8-0-35-1; ఆస్టిన్ వా 6-0-64-1

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: ఎడ్వర్డ్స్ (బి) అనుకుల్ రాయ్ 73; బ్రయంట్ (సి) శివమ్ మావి (బి) నాగర్‌కోటి 29; జేసన్ సంఘా (సి) పృథ్వీ షా (బి) అభిషేక్ శర్మ 14; మెర్లో (బి) శివమ్ మావి 38; ఉప్పల్ రనౌట్ 4; ఆస్టిన్ వా (సి) జుయల్ (బి) నాగర్‌కోటి 6; విల్ సదర్లాండ్ (బి) నాగర్‌కోటి 10; హోల్ట్ ఎల్బీ (బి) శివమ్ మావి 39; బార్ట్‌లెట్ (సి) జుయల్ (బి) శివమ్ మావి 7; రాల్‌స్టన్ రనౌట్ 3; పోప్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (42.5 ఓవర్లలో ఆలౌట్) **228; వికెట్ల పతనం:** 1-57, 2-86, 3-145, 4-157, 5-166, 6-168, 7-187, 8-205, 9-228; **బౌలింగ్:** శివమ్ మావి 8.5-1-45-3; పొరెల్ 4.1-0-24-0; శివ సింగ్ 6.5-0-30-0; నాగర్‌కోటి 7-1-29-3; అభిషేక్ శర్మ 7-0-33-1; హిమాంశు రాణా 4-0-30-0; అనుకుల్ రాయ్ 5-0-36-1

పంత్ దంచేశాడు

- 32 బంతుల్లో శతకబాదిన దిల్లీ కుర్రాడు



దిల్లీ: 30 బంతుల్లో సెంచరీ.. టీ20ల్లో వేగవంతమైన శతకమిది. వెస్టిండీస్ భీకర బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ సాధించిన రికార్డిది. అద్భుతమైన ఈ రికార్డుకు అతి చేరువగా వచ్చాడు దిల్లీ కుర్రాడు రిషబ్ పంత్. అతడు ఇంకాస్త గట్టిగా ప్రయత్నించివుంటే గేల్ రికార్డు తుడిచిపెట్టుకుపోయేదే. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో 20 ఏళ్ల రిషబ్ విశ్వరూపం ప్రదర్శించాడు. వచ్చిన బంతిని వచ్చినట్లు కసిగా కొట్టిన పంత్ 32 బంతుల్లోనే సెంచరీ బాదేశాడు. భారత్ తరపున అత్యంత వేగంగా సెంచరీ చేసిన క్రికెటర్‌గా రోహిత్ శర్మ పేరిట ఉన్న రికార్డు (శ్రీలంకపై 35 బంతుల్లో 100)ను అతడు తిరగరాశాడు. పాపం హిమాచల్ ప్రదేశ్ బౌలర్లు.. ఆదివారం రిషబ్ పంత్ బాదుడికి బలయ్యారు. నార్త్‌జోన్ మ్యాచ్‌లో 145 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన దిల్లీ.. రిషబ్ పంత్ (116 నాటౌట్; 38 బంతుల్లో 12×6, 8×4) అజేయ సెంచరీతో చెలరేగిపోవడంతో కేవలం 11.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. 10 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. రిషబ్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడగా.. మరోవైపు గంభీర్ (33 బంతుల్లో 30 నాటౌట్) ప్రేక్షకుడిగా మారిపోయాడు. మొదట నిర్ణీత ఓవర్లలో హిమాచల్ ప్రదేశ్ 8 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది.

రెండో రోజు గడిచే సరికి సెంచూరియన్‌లో దక్షిణాఫ్రికాదే ఆధిపత్యం.

పిచ్‌పై బ్యాటింగ్ అంత కష్టమేమీ కాకపోయినా .. ఆతిథ్య జట్టు బౌలింగ్ కేప్‌టౌన్‌లో ఉన్నంత భీకరంగా లేకున్నా.. టీమ్‌ఇండియా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. బ్యాటింగ్‌లో తడబడింది. పరుగుల వేటలో వెనుకబడింది. అయినా మ్యాచ్‌లో ఆశలు సజీవమే.

కారణం ఒకే ఒక్కడు. కెప్టెన్ విరాట్ కోహ్లి! ఒంటరిగా భారత్ ఆశలు మోస్తున్నాడు.

భారత్ కుప్పకూలలేదంటే, పరిస్థితి చేయిదాటి పోలేదంటే అది కోహ్లి పోరాట ఫలితమే. ఓ వైపు నుంచి వికెట్లు పోతున్నా.. ఒత్తిడికి గురికాకుండా మరోవైపు పట్టుదలగా నిలిచిన అతడు కెప్టెన్ ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికాను అడ్డుకున్నాడు. సాధికారిక బ్యాటింగ్‌తో సెంచరీ దిశగా సాగుతున్నాడు. భారత్ కాస్త సంతృప్తితోనే రోజును ముగించినా.. ముప్పు పొంచే ఉంది. చేతిలో ఐదు వికెట్లు మాత్రమే ఉన్న జట్టు ఇంకా 152 పరుగులు వెనుకబడి ఉంది. మూడో రోజు హార్దిక్ పాండ్య, టెయిలెండర్లు కోహ్లికి ఎంత మేర సహకరిస్తారన్నది మ్యాచ్‌లో భారత్ అవకాశాలను నిర్ణయించనుంది.



ఆశలు నిలిపాడు

పోరాడుతున్న కోహ్లి ● భారత్ 183/5 ● దక్షిణాఫ్రికా 335 ఆలౌట్

సెంచూరియన్

విరాట్ కోహ్లి (85 బ్యాటింగ్; 130 బంతుల్లో 8×4) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన వేళ.. దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో నిలిచేందుకు టీమ్ ఇండియా పోరాడుతోంది. కోహ్లితోపాటు విజయ్ (46; 126 బంతుల్లో 6×4) రాణించడంతో రెండో రోజు, ఆదివారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 5 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. కోహ్లితో పాటు హార్దిక్ పాండ్య (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 335 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరుకు ఆ జట్టుకు 66 పరుగులు జోడించింది.

ఆదుకున్న కోహ్లి: ఓ వైపు నుంచి ఒక్కొక్కరే నిష్క్రమిస్తున్న వేళ.. కెప్టెన్ విరాట్ కోహ్లి నిలవకపోయుంటే దక్షిణాఫ్రికా ఈపాటికే మ్యాచ్‌పై పూర్తిగా పట్టుబిగించేదే. చక్కని బ్యాటింగ్‌తో కోహ్లి భారత్‌ను ఆదుకున్నాడు. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో దక్షిణాఫ్రికా బౌలర్లు ఎంత ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించినా సమర్థంగా అడ్డుకున్నాడు. ధాటిగా బ్యాటింగ్ చేసిన అతడు.. ముచ్చటైన కవర్ డ్రైవ్, స్ట్రెయిట్ డ్రైవ్‌లతో అలరించాడు. ఓపెనర్ విజయ్ కూడా మంచి ఇన్నింగ్స్ ఆడినా నిలదొక్కుకున్న తర్వాత ఔటయ్యాడు. నిజానికి సొంతగడ్డపై ఉన్నట్లున్న పిచ్‌పై భారత్ మెరుగైన స్కోరు చేయాల్సింది. కానీ ఆరంభంలో అనవసరంగా వికెట్లు కోల్పోయింది. పదో ఓవర్లో మొదలైంది భారత్ పతనం. మోర్కెల్ వేసిన ఆ ఓవర్లో రెండు వికెట్లు కోల్పోయింది. ధావన్ స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన రాహుల్ (10) ఓ పేలవ షాట్‌కు నిష్క్రమించాడు. మోర్కెల్ బంతిని డ్రైవ్ చేయబోయి అతడికే రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. వెంటనే భారత్‌కు మరో షాక్. పుజారా (0) తాను ఎదుర్కొన్న తొలి బంతికే రనౌటై భారత్‌ను ఇబ్బందుల్లోకి నెట్టాడు. బంతిని మిడాన్‌లోకి ఆడి, సింగిల్ తీసేందుకు యత్నించిన పుజారా ఎంగిడి సూపర్ త్రోకు వెనుదిరిగాడు. ఆ దశలో చాలా ఏకాగ్రతతో ఆడుతున్న విజయ్‌కి తోడైన కోహ్లి.. జట్టును ఆదుకున్నాడు. మోర్కెల్, రబాడ, ఎంగిడి, ఫిలాండర్లను ఎదుర్కొంటూ విజయ్ క్రీజులో పాతుకుపోగా.. కోహ్లి ఏమాత్రం అవకాశం వచ్చిన దాడికి దిగాడు. టీ సమయానికి భారత్.. 80/2తో మెరుగైన స్థితిలో నిలిచింది. మంచి స్కోరు చేసేలా కనిపించింది. టీ తర్వాత కోహ్లి అర్ధశతకం (68 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. కానీ ఇన్నింగ్స్ సాఫీగా సాగిపోతున్న దశలో స్పిన్నర్ మహారాజ్ బౌలింగ్‌లో విజయ్ ఔట్ కావడంతో 79 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. మహారాజ్ బంతిని కట్ చేయబోయిన విజయ్. వికెట్‌కీపర్ డికాక్‌కు చిక్కాడు. రోహిత్ శర్మ (10) మరోసారి అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోయాడు. కోహ్లితో 25 పరుగులు జోడించిన అతడు రబాడకు వికెట్ల ముందు దొరికిపోయాడు. సమీక్ష కోరినా ఫలితం లేకపోయింది. పదేపదే ఆఫ్‌స్టంప్ ఆవల బంతులేస్తూ బ్యాట్స్‌మెన్‌ను పరీక్షించిన రబాడ... చివరికి ఓ బంతిని లోపలికేసి రోహిత్‌ను బోల్తా కొట్టించాడు. పార్థివ్ (19) కూడా ఎక్కువసేపు నిలువలేదు. ఐదో వికెట్‌కు 32 పరుగులు జోడించి.. ఎంగిడికి తొలి టెస్ట్ వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత కోహ్లికి పాండ్య జత కలిశాడు. ఇద్దరూ కలిసి ఆట ఆఖరుకు మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డారు.



దక్షిణాఫ్రికా మరో 66: ఉదయం 269/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికాను భారత్ కట్టడి చేసింది. ఆతిథ్య జట్టు మరో 66 పరుగులు జోడించించి, లంచ్‌కు కొద్దిసేపు ముందు 335 పరుగులకు ఆలౌటైంది. మొత్తంగా ఆతిథ్య జట్టు 89 పరుగులకే తన చివరి ఏడు వికెట్లు కోల్పోయింది. అశ్విన్ (4/113), ఇషాంత్ శర్మ (3/46) భారత్ తరపున అత్యంత విజయవంతమైన బౌలర్లు. ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు 24తో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ (63; 142 బంతుల్లో 9×4) జట్టుకు విలువైన పరుగులు అందించాడు. కేశవ్ మహారాజ్ (18)తో ఏడో వికెట్‌కు 31 పరుగులు జోడించిన అతడు.. రబాడ (11)తో ఎనిమిదో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆ క్రమంలో టెస్టుల్లో 17వ అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. డుప్లెసిస్ చివరికి తొమ్మిదో వికెట్ రూపంలో నిష్క్రమించాడు. ఇషాంత్ అతణ్ని బౌల్డ్ చేశాడు.

దక్షిణాఫ్రికా ఓ స్పిన్నర్‌తో..

దక్షిణాఫ్రికా ఆశ్చర్యకరంగా ఎడమచేతి వాటం స్పిన్నర్ కేశవ్ మహారాజ్‌తో బౌలింగ్‌ను దాడిని ఆరంభించింది. చివరిసారి 1912లో దక్షిణాఫ్రికా తరపున ఓ స్పిన్నర్ (ఆబ్రే ఫాల్క్‌నర్, ఆస్ట్రేలియాపై) తొలి ఇన్నింగ్స్‌లో బౌలింగ్ దాడిని ఆరంభించాడు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) విజయ్ (బి) అశ్విన్ 31; మార్‌క్రమ్ (సి) పార్థివ్ (బి) అశ్విన్ 94; ఆమ్లా రనౌట్ 82; డివిలియర్స్ (బి) ఇషాంత్ 20; డుప్లెసిస్ (బి) ఇషాంత్ 63; డికాక్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 0; ఫిలాండర్ రనౌట్ 0; మహారాజ్ (సి) పార్థివ్ (బి) షమి 18; రబాడ (సి) పాండ్య (బి) ఇషాంత్ 11; మోర్నీ మోర్కెల్ (సి) విజయ్ (బి) అశ్విన్ 6; ఎంగిడి నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (113.5 ఓవర్లలో ఆలౌట్) **335**

వికెట్ల పతనం: 1-85, 2-148, 3-199, 4-246, 5-250, 6-251, 7-282, 8-324, 9-333; **బౌలింగ్:** బుమ్రా 22-6-60-0; షమి 15-2-58-1; ఇషాంత్ 22-4-46-3; పాండ్య 16-4-50-0; అశ్విన్ 38.5-10-113-4

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) డికాక్ (బి) మహారాజ్ 46; రాహుల్ (సి) అండ్ (బి) మోర్కెల్ 10; పుజారా రనౌట్ 0; కోహ్లి బ్యాటింగ్ 85; రోహిత్ ఎల్బీ (బి) రబాడ 19; పార్థివ్ (సి) డికాక్ (బి) ఎంగిడి 19; పాండ్య బ్యాటింగ్ 11; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (61 ఓవర్లలో 5 వికెట్లకు) **183**; **వికెట్ల పతనం:** 1-28, 2-28, 3-107, 4-132, 5-164; **బౌలింగ్:** మహారాజ్ 16-1-53-1; మోర్కెల్ 15-3-47-1; ఫిలాండర్ 9-3-23-0; రబాడ 12-0-33-1; ఎంగిడి 9-2-26-1



మారిన్‌కు ట్రోఫీ అందిస్తున్న గవర్నర్ నరసింహన్, గోపిచంద్

హైదరాబాద్ వేటాడేసింది

పీబీఎల్ టైటిల్ కైవసం

హైదరాబాద్, ఈనాడు: హైదరాబాద్ సాధించింది. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ టైటిల్‌ను ఎట్టకేలకు ఒడిసిపట్టింది. ఆదివారం ఉత్కంఠభరితంగా సాగిన పీబీఎల్-3 ఫైనల్లో హైదరాబాద్ హంటర్స్ 4-3తో బెంగళూరు బ్లాస్టర్స్‌ను ఓడించింది. హంటర్స్ విజయంలో తెలుగు కుర్రాడు సాత్విక్‌సాయి రాజ్‌ది కీలకపాత్ర. టైటిల్ నిర్ణయాత్మక మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ జోడీ విజయం సాధించడంతో హైదరాబాద్ ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకుంది. ఫైనల్ ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లుగా సాగింది. తొలుత వెనకబడినా ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్న హైదరాబాద్‌కే టైటిల్ దక్కింది. ఫైనల్‌ను ఆతిథ్య హైదరాబాద్ ఓటమితో ఆరంభించింది. తొలి మ్యాచ్ పురుషుల డబుల్స్‌లో మార్కిస్ కిడో, యూ ఇయాన్ సియోంగ్ జోడీ 9-15, 10-15 తేడాతో మథియాస్ బో, కిమ్ సా రాంగ్ చేతిలో ఓడింది. వెంటనే పుంజుకున్న హంటర్స్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. పురుషుల సింగిల్స్‌ను ట్రంప్ మ్యాచ్‌గా చేసుకున్న హైదరాబాద్ అందులో విజయం సాధించింది. లీ హ్యూన్ 15-7, 15-13తో సుభాంకర్ డేపై గెలిచాడు. ఆ తర్వాత మళ్లీ విజయం బెంగళూరును వరించింది. ట్రంప్ మ్యాచ్‌లో విక్టర్ అక్సెల్సెన్ 15-8, 15-10తో సాయి ప్రణీత్‌పై గెలవడంతో బెంగళూరు 3-2తో తిరిగి ఆధిక్యం సాధించింది. ఈ స్థితిలో కరోలిన్ మారిన్ కీలక విజయం సాధించి స్కోరును సమం చేసింది. మారిన్ 15-8, 15-14తో క్రిస్టీ గిల్మోర్‌ను ఓడించడంతో స్కోరు 3-3తో సమమైంది. ఉత్కంఠ తారాస్థాయికి చేరిన వేళ.. మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, పియా బెర్నాండెట్ జోడీ మెరిసింది. దూకుడుగా ఆడిన సాయి రాజ్ ఆకట్టుకున్నాడు. మ్యాచ్‌లో సాయి రాజ్ జోడీ 15-11, 15-12తో కిమ్ సారాంగ్, సిక్కిరెడ్డి జంటను మట్టికరిపించడంతో టైటిల్ హైదరాబాద్ వశమైంది.

సెమీస్‌లో భారత్

అంధుల ప్రపంచకప్

దుబాయి: అంధుల ప్రపంచకప్‌లో భారత్ దూసుకుపోతోంది. టోర్నీలో జైత్రయాత్ర సాగిస్తున్న డిఫెండింగ్ ఛాంపియన్ టీమ్‌ఇండియా సెమీఫైనల్లో ప్రవేశించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో నేపాల్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్ 37.5 ఓవర్లలో 156 పరుగులకు ఆలౌటైంది. బౌలింగ్, ఫీల్డింగ్‌లో ఆకట్టుకున్న భారత్.. నేపాల్‌ను తక్కువ స్కోరుకే కట్టడిచ చేసింది. ప్రకాశ్ జయరామయ్య రెండు వికెట్లతో రాణించాడు. అనంతరం భారత్ రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అజయ్ గారియా (54; 29 బంతుల్లో 6×4) అర్ధశతకంతో జట్టును గెలిపించాడు.

ఇంగ్లాండ్ గెలిచింది

మెల్‌బోర్న్: యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా చేతిలో 0-4తో చిత్తయిన ఇంగ్లాండ్‌కు ఊరట. ఐదు వన్డేల సిరీస్‌లో ఇంగ్లాండ్ శుభారంభం చేసింది. జేసన్ రాయ్ (180; 151 బంతుల్లో 16×4, 5×6) రికార్డు శతకంతో చెలరేగడంతో ఆదివారం తొలి వన్డేలో ఇంగ్లాండ్ 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. ఇంగ్లాండ్ తరపున వన్డేల్లో అత్యధిక స్కోరు చేసిన ఆటగాడిగా రాయ్ రికార్డు సృష్టించాడు. అరోన్ ఫించ్ (107; 119 బంతుల్లో 10×4 3×6) శతకంతో సత్తా చాటడంతో మొదట ఆస్ట్రేలియా 304 (8 వికెట్లకు) పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో రాయ్‌తో పాటు రూట్ (91 నాటౌట్; 110 బంతుల్లో 5×4) మెరవడంతో మరో ఏడు బంతులు మిగిలి ఉండగానే ఇంగ్లాండ్ లక్ష్యాన్ని ఛేదించింది. రాయ్, రూట్ మూడో వికెట్‌కు 221 పరుగులు జోడించి జట్టును గెలిపించారు.





ఫేవరెట్లుగా ఫెదరర్, నాదల్

నేటి నుంచే ఆస్ట్రేలియన్ ఓపెన్ ● ప్రధాన డ్రాకు యుకి అర్హత | ఉదయం 5.30 నుంచి సోని టెన్-2, 6లో ప్రసారం

మెల్‌బోర్న్: కొత్త ఏడాదిలో మొట్టమొదటి గ్రాండ్‌స్లామ్‌కు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచే ఆస్ట్రేలియన్ ఓపెన్. డిఫెండింగ్ ఛాంపియన్ ఫెదరర్‌తో పాటు నిరుటి ఫైనలిస్ట్, ప్రపంచ నంబర్‌వన్ రఫెల్ నాదల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. టాప్ సీడ్ నాదల్ (స్పెయిన్) టోర్నీ తొలి రోజు బుర్గోస్ (డొమినికన్ రిపబ్లిక్)తో మ్యాచ్‌తో టైటిల్ వేటను ఆరంభిస్తాడు. ఫెదరర్ తన తొలి రౌండ్లో మంగళవారం స్లొవేనియాకు చెందిన అల్జాజ్ బెడెన్‌ను ఢీకొంటాడు. ఫేవరెట్లే అయినా ఫెదరర్ (స్విట్జర్లాండ్), నాదల్‌ల వేట ఈసారి మరీ అంత తేలికైతే కాబోదు. ఆరుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంప్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) ఈసారి బరిలో ఉన్నాడు. మోచేతి గాయం కారణంగా నిరుడు వింబుల్డన్ తర్వాత టెన్నిస్‌కు దూరమైన జకో ఈ మధ్యనే మళ్లీ రాకెట్ పట్టాడు. పూర్వపు ఫామ్‌ను అందుకోవాలని తహతహలాడుతున్నాడు. మరోవైపు మహిళల సింగిల్స్‌లో చాలా మంది అమ్మాయిలు టైటిల్ రేసులో ఉన్నారు. ముఖ్యంగా ప్రపంచ నంబర్-4 ఎలినా స్వితోలినా (ఉక్రెయిన్), బ్రిటన్‌కు చెందిన ప్రపంచ నంబర్-9 జొహానా కొంటాలపై మంచి అంచనాలే ఉన్నాయి.

మెయిన్‌డ్రాకు యుకి: మంచి ఫామ్‌లో ఉన్న భారత్ ఆటగాడు యుకి బాంబ్రి ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ప్రధాన డ్రాకు అర్హత సాధించాడు. ఆదివారం జరిగిన మూడో, చివరి క్వాలిఫయింగ్ రౌండ్లో యుకి 1-6, 6-3, 6-3తో పీటర్ పోలన్‌స్కీ (కెనడా)పై విజయం సాధించాడు.



‘దశల’పై దిశ ఏదీ..?

- శ్లాబ్ రుసుముల ఊసెత్తని తిరుపతిరావు కమిటీ
- విద్యాశాఖలోనూ దీనిపై విధానమే లేదు
- పై తరగతులకు వెళ్లేకొద్దీ పెరుగుతున్న భారం

ఈనాడు- హైదరాబాద్



ప్రైవేటు పాఠశాలలు విద్యను శ్లాబుల కింద విడగొట్టి ఇష్టానుసారం రుసుములు వసూలు చేస్తున్నా.. రుసుముల నియంత్రణపై ఏర్పాటైన ఆచార్య తిరుపతిరావు కమిటీ దీనిపై దృష్టి సారించకపోవడం చర్చనీయాంశమవుతోంది. ఈ విధానంపై తగిన చర్యలు లేకుంటే తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రాథమిక విద్య అంటే 1-5వ తరగతులు, మాధ్యమిక విద్య అంటే 6-10 తరగతులుగా విభజించారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో ఎల్‌కేజీ, యూకేజీలను పూర్వ ప్రాథమిక లేదా శిశు విద్యగా పిలుస్తున్నారు. మరి రుసుములు కూడా అదే విధంగా ఉండాలి కదా? ప్రైవేటు పాఠశాలలు ‘ఎల్‌కేజీ-యూకేజీ, 1 నుంచి 5 వరకూ తరగతులు, 6 నుంచి 8 వరకూ, 9 నుంచి 10 వరకూ తరగతులు...’ ఇలా నాలుగు దశలుగా విభజించి రుసుములను వసూలు చేస్తున్నాయి. పై స్లాబ్‌కు వెళ్లేకొద్దీ రుసుము అమాంతం పెరిగిపోతుంది. కొన్ని బడుల్లో ఒక్కో తరగతికి ఒక్కో రకమైన రుసుమును నిర్ణయించి వసూలు చేస్తున్నారు. దీనిపై ఆ కమిటీ నివేదికలో ఏమీ ప్రస్తావించకపోవడం గమనార్హం. విద్యాశాఖ వద్ద కూడా ఎన్ని స్లాబులు ఉండాలనే దానిపై ఒక విధానం లేదని విద్యాశాఖాధికారి ఒకరు తెలిపారు.

నష్టం ఇలా..

తిరుపతిరావు కమిటీ ప్రస్తుతం ఉన్న రుసుములపై ఏటా 10 శాతం వరకు రుసుములు పెంచుకోవచ్చని ప్రభుత్వానికి సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి వరకు చదివిన తరగతిలో చెల్లించిన రుసుంపై 10 శాతమా? పైతరగతిలో ఉన్న రుసుంపై 10 శాతమా? అన్న దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్(హెచ్‌ఎస్‌పీఏ) మాత్రం పైతరగతిలోని రుసుంపైనే పెంపుదల ఉంటుందని కమిటీ చెప్పిందని తెలిపింది. దీనివల్ల రుసుము ఏటా 15-20 శాతం వరకు పెరుగుతుందని ఆ సంఘం ప్రతినిధులు లెక్కలు వేశారు. ఈ స్లాబులు అధికంగా ఉండటం వల్ల కూడా తల్లిదండ్రులపై భారీగా ఆర్థిక భారం పడుతుందని స్పష్టమవుతోంది. ఉదాహరణకు 5వ తరగతిలో ఒక విద్యార్థి రూ.40 వేలు రుసుం చెల్లిస్తే... 6వ తరగతికి వచ్చేసరికి 10 శాతం పెంపు అనుకుంటే రూ.44 వేలు చెల్లించాలి. అయితే 6వ తరగతి నుంచి స్లాబ్ మారిపోవడం వల్ల ఆ పాఠశాల 6వ తరగతికి రూ.50 వేలు నిర్ణయిస్తుంది. అప్పుడు దానిపై 10 శాతం అంటే రూ.55 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క తరగతి పెరిగే సరికి రూ.40 వేల నుంచి రూ.55 వేలకు రుసుం పెరిగింది. అంటే 37.5 శాతం ఫీజు పెరిగినట్లు. అదే ప్రతి రెండు తరగతులకు ఒక స్లాబ్ ఉన్న బడుల్లో పైతరగతికి వెళ్లేకొద్దీ మరింత భారం తప్పదని నిపుణులు స్పష్టంచేస్తున్నారు.





విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ జాయింట్ సీపీ తరుణ్‌జోషి. వృత్తంలో నిందితులు ★ నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయిల్ ట్యాంకర్లు, కార్లు, ద్విచక్ర వాహనాలు

చెంగిచర్ల ఘటనలో ఇద్దరికి రిమాండ్

- పరారీలో మరో ముగ్గురు
- 12 ట్యాంకర్లు, రెండు కార్లు, రూ.7.5 లక్షలు స్వాధీనం

మేడిపల్లి, చెంగిచర్ల(బోడుప్పల్): న్యూస్‌టుడే: అక్రమ పెట్రోల్ అడ్డాలు నిర్వహిస్తూ చెంగిచర్లలో అగ్ని ప్రమాదానికి కారణమైన ఘటనలో మేడిపల్లి పోలీసులు ఇద్దర్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. ఈ మేరకు రాచకొండ జాయింట్ సీపీ తరుణ్‌జోషి మేడిపల్లి ఠాణాలో ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బోడుప్పల్ భీంరెడ్డినగర్‌కాలనీలో ఉండే కులాల్ రాజు(37), చెంగిచర్ల ఆర్టీసీకాలనీలో ఉండే జగదీప్ అలియాస్ జగ్గు(34) అన్నదమ్ములు.. ఎనిమిదేళ్లుగా చెంగిచర్ల-మేడిపల్లి రోడ్డులో వీరు అక్రమ పెట్రోల్ అడ్డా నిర్వహిస్తున్నారు. చర్లపల్లి, ఘట్‌కేసర్‌లోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎస్సార్, హిందూస్థాన్ పెట్రోలియం ట్యాంకర్ల డ్రైవర్లు, క్లీనర్లను మచ్చిక చేసుకొని ఇంధన చోరీకి పాల్పడుతున్నారు. ఈనెల 12న షెడ్డుకు కాకినాడ నుంచి వచ్చిన ఎస్సార్ ట్యాంకర్ నుంచి పెట్రోల్ చోరీ చేస్తుండగా ప్రమాదవశాత్తూ మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఎస్సార్ ట్యాంకర్ పూర్తిగా, మరో ట్యాంకర్ పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో చెంగిచర్ల రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న పలువురు గాయపడ్డారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మేడిపల్లి వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు రాజు, జగ్గును అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వారి దగ్గర నుంచి 12 ఆయిల్ ట్యాంకర్లు, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.7.5లక్షల నగదు, 3 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు కారణంగా భావిస్తున్న మరో ముగ్గురు ఖదీర్, షర్ఫోద్దీన్, నయీం పరారీలో ఉన్నారు.

కర్ణాటక నుంచి వలస వచ్చి..: కర్ణాటకలోని బీదర్ జిల్లా, చించోలికి చెందిన బాబురావుకు నలుగురు సంతానం. రాజు రెండోవాడుకాగా జగ్గు ఆఖరివాడు. పాతికేళ్ల క్రితమే వీరి కుటుంబం నగరానికి వలస వచ్చి బోరబండలో ఉంటూ.. చిన్నా, చితక పనులు చేస్తుండేవారు. ఈక్రమంలో తొలుత స్థిరాస్తి వ్యాపారం చేసిన రాజు, ఆశించిన సంపాదన లేదని ఇంధనం అక్రమ అడ్డాలకు తెరతీశాడు. తొలుత చర్లపల్లి, ఘట్‌కేసర్, కొర్రెముల, మేడిపల్లి ప్రాంతాల్లో మెకానిక్ షెడ్లు ఏర్పాటుచేసి భారీ ట్యాంకర్లకు మరమ్మతులంటూ నమ్మబలుకుతూ ఇంధనాన్ని చోరీ చేస్తూండేవారు. కొర్రెముల, చౌదరిగూడలో ప్రత్యేకంగా ఒక డంప్‌ను ఏర్పాటుచేసి, పెట్రోల్, డీజిల్, కిరోసిన్‌లను తక్కువ ధరకు అమ్ముతూ రూ.కోట్లు గడించారు. రోజుకు రూ.75వేల నుంచి లక్ష వరకు సంపాదిస్తున్నట్లు అంచనా. ఈ అక్రమాలకు సంబంధించి, పోలీసులు మామూళ్లు దండుకొని మిన్నకుండిపోయారనే ఆరోపణలపై విచారిస్తున్నారు.

నెలాఖరు నుంచి రైతు పోరుబాట

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

ఈనాడు, నల్గొండ: రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెలాఖరు నుంచి రైతు పోరుబాట కార్యక్రమాలు 45 ప్రాంతాల్లో నిర్వహిస్తామని భారతీయ జనతాపార్టీ(భాజపా) రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వెల్లడించారు. పార్టీ పదాధికారుల సమావేశంలో పాల్గొనడానికి ఆదివారం నల్గొండ వచ్చిన ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతుందని, రాష్ట్రంలో తెరాసకు భాజపానే ప్రత్యామ్నాయమన్నారు. రాష్ట్రంలోని 19 ఎస్సీ, 12 ఎస్టీ రిజర్వుడు అసెంబ్లీ స్థానాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

నాగంకు భాజపా బుజ్జగింపులు

- పార్టీ ఎదుగుదలపై నమ్మకం కలిగించాలన్న సీనియర్‌నేత

ఈనాడు, హైదరాబాద్: అసంతృప్తితో ఉన్న సీనియర్‌నేత నాగం జనార్దన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు కమలనాథులు మొదలుపెట్టారు. తొందరపాటుతో నిర్ణయాలు తీసుకోవద్దని, పార్టీలో కొనసాగాలని కోరారు. కొద్దిరోజులుగా నాగం చేస్తున్న వ్యాఖ్యలు భాజపాలో చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి భాజపా కోర్ కమిటీ సమావేశమై నాగం వ్యవహారంపై చర్చించింది. పార్టీని వీడకుండా ఆయనతో మాట్లాడాలని నిర్ణయించారు. ఈ మేరకు కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయతోపాటు సంస్థాగత వ్యవహారాల ముఖ్యనేత మంత్రి శ్రీనివాస్ నాగంను గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో ఆదివారం కలిశారు. పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని చెప్పినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.."తెలంగాణలో భాజపా బలపడటం లేదు. కార్యకర్తల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఏం చేయమంటారు? పార్టీ ఎదుగుతుందన్న నమ్మకం ప్రజల్లో కలిగిస్తే పునరాలోచిస్తా. సమస్యలపై పార్టీ చురుగ్గా వ్యవహరించడం లేదు. ప్రాజెక్టుల అవినీతిపై వ్యక్తిగతంగా పోరాడుతున్నా. ఇక ముందు పోరాటం చేస్తా. మీ మద్దతు ఉండాలి" అని నాగం వారితో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. తొందరపడొద్దని భాజపా నేతలు కోరగా.. తానేమీ అలా వ్యవహరించడం లేదని, ఉగాది తర్వాతే నిర్ణయాన్ని ప్రకటిస్తానని నాగం స్పష్టం చేశారు.



నూతన కార్యవర్గంతో వరవరరావు, హరగోపాల్ తదితరులు

2019 ఎన్నికలను బహిష్కరించండి

- విరసం మహాసభల ముగింపు సమావేశంలో వరవరరావు

మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే: వచ్చే 2019 సాధారణ ఎన్నికలను ప్రజలు బహిష్కరించి నూతన విప్లవ రాజకీయం వైపు నడవాలని విరసం నేత వరవరరావు కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న విప్లవ రచయితల సంఘం 26వ రాష్ట్ర మహాసభల ముగింపు సమావేశంలో ఆదివారం రాత్రి ఆయన మాట్లాడారు. ఐక్యత పేరుతో వచ్చే ఎన్నికల ద్వారా దేశంలో ఫాసిజాన్ని తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఎన్నికల ప్రక్రియ ఈ దేశానికి నలుగురు హంతకులను ప్రధానులుగా చేసిందని ఆరోపించారు. మహారాష్ట్రలో నక్సల్స్ పేరుతో ఏడుగురిని అరెస్టు చేశారని, వెంటనే వారిని విడుదల చేయాలని కోరారు. నల్లమల ప్రస్తుతం ఖాళీ అయిందని, రానున్న రోజుల్లో మళ్లీ నిండుకొని ఉద్యమం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం ఇచ్చి ఆదివాసీలను ముంచుతోందని, కేసీఆర్‌కు తెలంగాణ ఇచ్చిందన్నారు. విరసం నాయకులు కళ్యాణ్‌రావు మాట్లాడుతూ.. దేశంలో ఇటీవల కాలంలో దేశభక్తి.. దేశద్రోహం, హిందూ మతం అనే మాటలు సామాజిక మాధ్యమాలు, వార్తల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. విరసం మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ ఎప్పుడు ఈడీ.. సీబీఐ వంటి సంస్థలు వచ్చి తనిఖీలు నిర్వహిస్తాయో అన్న భయంలో ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులున్నారన్నారు. నిర్భయంగా మాట్లాడే మనుషులను ఈ ప్రభుత్వాలు హత్య చేస్తున్నాయని, ఈ క్రమంలోనే గౌరీ లంకేశ్ హత్య చోటు చేసుకుందన్నారు.

విరసం రాష్ట్ర కార్యవర్గం ప్రకటన: మహాసభల ముగింపులో విరసం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యదర్శిగా పాణి, కార్యవర్గ సభ్యులుగా కాశీం, రాంకి, వరలక్ష్మి, అరసవెల్లి కృష్ణ, కిరణ్, జగన్, క్రాంతి, చిన్నయ్య, రాము, గీతాంజలి, ఉదయ్‌భాను, బాసిత్, రివేరా, ఉజ్వల్, వెంకన్నను ఎన్నుకున్నారు. అనంతరం పదిహేను తీర్మానాలను కార్యదర్శి పాణి ప్రవేశ పెట్టారు.

అగ్రకుల ఆధిపత్యాన్ని అడ్డుకోవడమే లక్ష్యం

బహుజన వామపక్ష కూటమి కన్వీనర్ తమ్మినేని

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: బహుళజాతి సంస్థల దోపిడీ, అగ్రకుల ఆధిపత్యాన్ని అడ్డుకోవడమే బహుజన వామపక్ష కూటమి (బీఎల్‌ఎఫ్) ప్రధాన లక్ష్యమని కూటమి రాష్ట్ర కన్వీనర్ తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. ఈ నెల 25న బీఎల్‌ఎఫ్ ఆవిర్భావ సభను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 28 రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి 119 శాసనసభ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో నిర్వహించిన బీఎల్‌ఎఫ్ ఆవిర్భావ సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కూటమి అధికారంలోకి వచ్చాక బహుజనులకు సామాజిక న్యాయం, సమ న్యాయం, హక్కులు, రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. సీపీఐ కూడా తమతో కలిసి రావాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చాడవెంకటరెడ్డితో చర్చలు జరుపుతున్నామన్నారు. సమావేశంలో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర ఛైర్మన్ నల్లా సూర్యప్రకాష్‌రావు, ఎంసీపీఐ (యూ) జాతీయ కమిటీ సభ్యుడు మద్దికాయల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారానికి యత్నించిన క్యాబ్ డ్రైవర్‌కు రిమాండ్

మరో కేసులోనూ నిందితుడిగా గుర్తింపు

కుషాయిగూడ, బోడుప్పల్, న్యూస్‌టుడే: కారులో ఓ యువతిపై అత్యాచారానికి యత్నించి తప్పించుకు తిరుగుతున్న క్యాబ్ డ్రైవర్‌ను కుషాయిగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో రాచకొండ సంయుక్త పోలీసు కమిషనర్ తరుణ్‌జోషి ఈ వివరాలను వెల్లడించారు. లాలాపేట్ శాంతినగర్‌లో నివసించే కందుకూరి నాగమధు కిరణ్ (29) ఓలా క్యాబ్ డ్రైవర్. ఈనెల 5న రాత్రి 10.50 గంటల సమయంలో కాప్రా రాధికా చౌరస్తాలో ఒంటరిగా నిల్చున్న యువతి (ప్రైవేటు ఉద్యోగిని)ని ఎక్కడికి వెళ్లాలని అడిగి ఆమె దిగాల్సిన చోట దింపుతానని కారులో ఎక్కించుకున్నాడు. కారును ఓ చోట ఆపి తన స్నేహితులు వస్తారని, వెనుక సీటులో కూర్చోవాల్సిందిగా సూచించాడు. ఆమె వెనక్కి వెళ్లగానే తానూ వెనుక సీటులోకి వెళ్లి కారు తలుపులు లాక్ చేసి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె ప్రతిఘటించి కేకలు వేసింది. దీంతో యువతిని అక్కడే వదిలి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఇతను గతేడాది అక్టోబర్ 17న కాప్రా పరిధిలోని అశోక్ కాలనీకి చెందిన ఓ పదేళ్ల బాలికపైనా అత్యాచార యత్నానికి పాల్పడినట్లు తేలింది.

25న ‘పద్మావత్’ విడుదల

చిత్ర బృందం అధికారిక ప్రకటన

ముంబయి: సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన “పద్మావత్” ఎట్టకేలకు ఈ నెల 25న విడుదల కాబోతోందని చిత్ర నిర్మాతలు, వయాకామ్ 18 మోషన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించారు. సెన్సార్ బోర్డు సూచనల మేరకు సినిమా పేరును పద్మావతి నుంచి పద్మావత్‌గా మార్చినట్లు స్పష్టీకరించారు. హిందీ, తెలుగు, తమిళంలలో ప్రపంచ వ్యాప్తంగా విడుదలచేస్తున్నట్లు తెలిపారు. తొలి భారతీయ ఐమ్యాక్స్ 3డీ సినిమా ఇదేనని చెప్పారు. దీనిలో రాణి పద్మావతిగా దీపికా పదుకొణె, రాజా రతన్ సింగ్‌గా షాహిద్ కపూర్, అల్లావుద్దీన్ ఖిల్జీగా రణ్‌వీర్ సింగ్ నటించారు. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలపై రాజ్‌పుత్ కర్ణిసేన తీవ్ర అందోళనలు వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. మరోవైపు గుజరాత్‌లో ఈ చిత్రం విడుదలకాకుండా అక్కడి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. శాంతి భద్రతల పరిరక్షణకు ఇది తప్పనిసరని పేర్కొంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00